



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 34 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 27 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## ఇస్రో ఎల్‌వీఎం రాకెట్ సిద్ధం



- సీఎంఎస్-03 కమ్యూనికేషన్ శాటిలైట్ ప్రయోగానికి సర్వంసిద్ధం
- నవంబర్ రెండో తేదీన ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నామని ఇస్రో వెల్లడి
- కమ్యూనికేషన్ సేవలు అందించే లక్ష్యంతో మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్‌ను ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ సాయంతో కక్ష్యలో ప్రవేశపెట్టాలని నిర్ణయించడం తెల్సిందే.

5లో

# మొంథా అలర్ట్



- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం
- నేటి ఉదయానికి తుపానుగా, రేపటికి తీవ్ర తుపానుగా రూపాంతరం
- 28 రాత్రి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం
- పలు జిల్లాలకు అత్యంత భారీ వర్షాల ముప్పు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కోస్తా జిల్లాలపైకి 'మొంథా' తుపాను దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. అది ఆదివారం సాయంత్రానికి పోర్టుబ్లెయిర్‌కు 670 కిలోమీటర్లు, చెన్నైకు 720, కాకినాడకు 780, విశాఖపట్నానికి 790, గోపాలపూర్ (ఒడిశా)కు 900 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయంలోగా నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారి, అదే రోజు రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేసింది. మంగళవారం దాదాపు 12 గంటలపాటు దాని తీవ్రత కొనసాగి, తర్వాత తుపానుగా బలహీనపడొచ్చని పేర్కొంది. దీని - మిగతా2లో



### గోదావరి-కావేరీ అనుసంధానంపై

## ముందడుగు!

- ఇచ్చంపల్లి నుంచే అనుసంధానం చేపడతామన్న కేంద్రం
- సూత్రప్రాయంగా తెలంగాణ సర్కార్ అంగీకారం
- హిమాలయ నదుల నీటిని ఎప్పుడు తెస్తారో చెప్పాలన్న ఏపీ ప్రభుత్వం
- కృష్ణా జలాల్లో వాటా పెంచాలన్న కర్ణాటక, మహారాష్ట్ర
- తక్షణమే చేపట్టాలన్న తమిళనాడు సర్కార్
- ఎన్‌డబ్ల్యూడీఏ 75వ పాలకమండలి సమావేశం వివరాలు వెల్లడి

2లో



### దేశవ్యాప్త ఎస్ఐఆర్ తొలి విడతపై

## ఈసీ సమావేశం

- 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలతో సహా 10 నుంచి 15 రాష్ట్రాల్లో తొలి విడత ఎస్ఐఆర్ నిర్వహించే తేదీలను ప్రకటించే అవకాశం
- వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సాధ్యమైనంత త్వరగా ఎస్ఐఆర్‌ను పూర్తి చేయాలని భావిస్తోంది ఎన్నికల కమిషన్

# విద్యా శాఖలో ఇష్టారాజ్యం

- దొడ్డిదారిన డిప్యుటేషన్లతో కేంద్ర కార్యాలయంలోనే తిష్ట
- సెప్టెంబర్‌లో మరోసారి 'వర్క్ అడ్జెస్ట్‌మెంట్'పేరుతో డిప్యుటేషన్లు
- ఒక్క అక్టోబర్‌లోనే రెండోసారి డిప్యుటేషన్లు
- సెమిస్టర్ పూర్తయ్యాక పని సర్దుబాటుపై అనుమానాలు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'వడ్డించేవాడు మనోడైతే..' అన్నట్టు రాష్ట్ర సాంకేతిక విద్యలో ఉద్యోగుల బదిలీలు ఎప్పుడు కావాలంటే అప్పుడు, కావాల్సిన వారికి 'వర్క్ అడ్జెస్ట్‌మెంట్' పేరుతో జరిగిపోతున్నాయి. ఈ ఏడాది మే నుంచి ఇప్పటి దాకా నాలుగుసార్లు బదిలీలు చేపట్టగా, ఇప్పుడు ఐదోసారి బదిలీలకు రంగం సిద్ధమైంది. జూన్‌లో జరిగిన సాధారణ బదిలీలు మినహా, మిగిలిన అన్ని బదిలీలకు సర్‌ప్లస్, వర్క్ అడ్జెస్ట్‌మెంట్, డిప్యుటేషన్ పేరుతో కావాల్సిన వారిని నచ్చిన - మిగతా2లో

# ప్రజల్ని అప్రమత్తం చేయాలి



- అంతరాయం లేకుండా వాతావరణ హెచ్చరికలు పంపాలి..
- మొబైల్ టవర్ల వద్ద జనరేటర్లు
- డ్రోన్ల ద్వారా సహాయక చర్యలకు ఏర్పాట్లు చేయండి
- తుపాను సన్నాహక చర్యలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం, మొంథా తుపాను కదలికలపై ఎస్ఎంఎస్, సామాజిక మాధ్యమాలు, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సప్ ద్వారా ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపాలని అధికారుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గ్రామస్థాయి వరకు వేగంగా సమాచారం చేరవేసేలా చూడాలని.. కమ్యూనికేషన్‌లో అంతరాయం తలెత్తకుండా రాష్ట్రంలోని 27వేల మొబైల్ టవర్ల వద్ద డీజిల్ జనరేటర్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం 28వ తేదీ నాటికి తీవ్ర తుపానుగా మారి కాకినాడ వద్ద తీరం దాటుతుందనే హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆయన అధికారులతో సమీక్షించారు. 'తుపాను ప్రభావంతో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. అధిక వేగంతో గాలులు వీస్తాయి. ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని చంద్రబాబు సూచించారు. 'ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ - మిగతా2లో

**ప్రవాసులతో మమేకమై.. దుబాయ్‌లో చంద్రబాబు ప్రసంగం**

2



## స్వేచ్ఛా వాణిజ్యం బలోపేతం

- స్వేచ్ఛా విపణితో భారత్, ఆసియాన్ దేశాల ప్రజలకుఎంతో ప్రయోజనమని వ్యాఖ్య
- అమెరికా సుంకాల మోత వేళ ఆసియాన్‌తో బంధం బలోపేతంపై దృష్టి
- అంతర్జాతీయ సుస్థిరాభివృద్ధికి భారత్-ఆసియాన్ భాగస్వామ్యమే గట్టి పునాది
- ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని
- ప్రపంచ శాంతిభద్రతలకు ఉగ్రవాదం సవాల్‌గా మారిందని ఆందోళన వ్యక్తంచేసిన మోదీ

**కుమ్రం భీమ్ పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకం**

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

5

# జగన్మోహన్ రెడ్డిని మించిపోయిన
# చంద్రబాబు రాక్షస పాలన

- తప్పుడు కేసులు పెట్టి బెదిరించాలని చూస్తున్నారు
- బిసి రక్షణ చట్టం తేలేని బిసి ఎమ్మెల్యేలు, ఎంపిలకు రాజీనామా చేసే దమ్ముందా?
- బిసి ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా బానిస బ్రతుకులు వీడండి
- ఎక్కడ సమస్య ఉన్నా అక్కడ బిసివై పార్టీ ఉంటుంది
- చంద్రబాబుపై బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఫైర్



అమరావతి

రాష్ట్రంలో జగన్ ను మించి చంద్రబాబు రాక్షస పాలన కొనసాగిస్తున్నారని బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చేసిన తప్పులకంటే పదింతలు ఎక్కువగా చంద్రబాబు తప్పులు చేస్తున్నారన్నారు. ఆదివారం ఆయన మంగళగిరిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిణామాలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు వేధింపులకు గురవుతున్నారన్నారు. జగన్ హయాంలో లిక్కర్ కుంభకోణం జరిగితే... చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏకంగా నకిలీ లిక్కర్ నే తయారు చేసి అమ్మేస్తున్నారన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రాణాలతో ఆడుకుంటున్నారని దుయ్యబట్టారు. జగన్ హయాంలో షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ కు 37 వేల కోట్లు కాంట్రాక్టులు కట్టబెడితే... చంద్రబాబు హయాంలో 69 వేల కోట్లు దోచిపెట్టారన్నారు. జగన్ ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తే... చంద్రబాబు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారన్నారు. ఉద్యోగాలు చేస్తున్న టీచర్లకు టెట్ నిర్వహించాలన్న నిబంధనను వ్యతిరేకించపోవడమే దానికి ఉదాహరణ అన్నారు. అన్ని రాష్ట్రాలు ఈ నిబంధనకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తుంటే చంద్రబాబు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జగన్ హయాంలో అరాచకాలు జరుగుతున్నాయని చంద్రబాబుకు అధికారం ఇస్తే ఆయన పది రెట్లు అరాచకం చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో పోలీస్ శాఖను అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే విష సంస్కృతిని పెంచి పోషిస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పోలీసు శాఖను టిడిపి పార్టీ విభాగంగా మార్చేశారన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వం విధానాలను వ్యతిరేకించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. బాధితులు ప్రశ్నించినా కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారన్నారు. కరేడు రైతులు తమకు ఇండోసోల్ ఫ్యాక్టరీ వద్దు అన్నందుకు వారిపై కేసులు పెట్టారన్నారు. అలాగే రెండు రోజుల క్రితం కరేడుకు వెళ్లిన ఇండోసోల్ ప్రతినిధులు భూములు ఇవ్వాలని రైతులను బెదిరించారని, భూములు ఇవ్వబోమని చెప్పిన రైతులను రాత్రి వేళలో వెళ్లి పోలీసులు బెదిరిస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్ కు పిలిపించుకొని భూములు ఇవ్వకపోతే కేసులు పెడతామని డిఎస్పీ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపైన అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. మహిళలు, మత్స్యకారులపైనా అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో నాపై తప్పుడు కేసులు పెట్టారని చంద్రబాబు నాయుడు పుంగనూరు బహిరంగ సభలో మాట్లాడారని రామచంద్రయాదవ్ అన్నారు. అలాగే 27 అక్రమ కేసులు తనపై పెట్టారని సాక్షాత్తు అసెంబ్లీలోనే చెప్పిన చంద్రబాబు నాయుడు... ఆయన అధికారంలోకి వచ్చాక తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారన్నారు. అప్పుడు పెట్టిన కేసులను తప్పుడు కేసులన్న చంద్రబాబు తానూ అదే తరహాలో కేసులు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనపై పది అక్రమ కేసులు పెట్టారన్నారు. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ పాదయాత్ర చేస్తే ఓ కేసు పెట్టారన్నారు. కరేడు రైతులకు మద్దతు తెలిపితే అక్కడా కేసులు పెట్టారన్నారు. రాజయ్యపేట మత్స్యకారులకు అండగా వెళ్తే రాజమండ్రి హొటల్ లో తనను అడ్డుకొని పోలీసులు హంగామా సృష్టించి అక్కడ కూడా తనపైనే కేసులు పెట్టారన్నారు. అలాగే వైజాగ్ లో కూడా అడ్డుకొని పోలీస్ ఎస్కార్ట్ పెట్టి వెనక్కి పంపిన పోలీసులు మహిళా పోలీసులపై దాడి చేశామని కేసులు పెట్టారన్నారు. ఒకే సంఘటలో మూడు చోట్ల తీవ్ర నేరాలు చేసినట్టు కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ చంద్రబాబు చేస్తున్న రాక్షస పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మరే సమస్యా లేనట్టు తన చుట్టూనే పోలీస్ వ్యవస్థను తిప్పుతున్నారని రామచంద్రయాదవ్ ఎద్దేవా చేశారు. ఇటీవల డిజిపి ఓ సర్క్యులర్ ఇచ్చారని అందులో తనపై ఉన్న కేసులన్నింటినీ బయటికి తీయాలంటూ డిజిపి ఆ సర్క్యులర్ లో పేర్కొన్నారన్నారు. అన్ని సమస్యలూ పక్కనబెట్టి అత్యవసరంగా తనపై ఉన్న కేసుల వివరాలు కావాలంటూ కోరారంటే తనను చూసి ఏ స్థాయిలో ప్రభుత్వం భయపడుతుందో వేరే చెప్పనక్కర్లేదన్నారు. తనపై ఉన్న కేసులను బయటికి తీసి పిటి వారెంట్లతో బయట తిరగకుండా కట్టడి చేయాలని చూస్తున్నారన్నారు. ఎన్ని చేసినా ప్రజా సమస్యల కోసం ఎట్టి పరిస్థితిల్లో వెనకడుగు వేసేది లేదన్నారు. చిల్లర వేషాలకు బయపడేది లేదని రామచంద్రయాదవ్ తేల్చి చెప్పారు. ఓ పక్క బిసిలపై దాడులు జరుగుతున్నాయని, అయినా బిసి రక్షణ చట్టంపై చంద్రబాబు ప్రభుత్వం నోరు మెదపడం లేదని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపిలో ఉన్న బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు రక్షణ చట్టం తీసుకువచ్చేందుకు చంద్రబాబుపై ఒత్తిడి చేయాలన్నారు. బానిస బ్రతుకులను వీడి ప్రజలకు క్షమాపణ చెప్పి పదవులకు రాజీనామా చేయాలని ఎద్దేవా చేశారు. బిసిలకు కూడా న్యాయం చేయలేని బిసి ప్రజాప్రతినిధులు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. బానిసల్లా బ్రతకడం మాని బిసిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాజీనామాలు చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చా పబ్లిసిటీ పిచ్చితో పాలనను గాలికి వదిలేశారన్నారు. ఇతర దేశాలు వద్దన్న డేటా సెంటర్ ను తీసుకువచ్చి తీరప్రాంతాన్ని నాశనం చేసేందుకు కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రామచంద్రయాదవ్. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైనా చంద్రబాబు తన తీరు మార్చుకోవాలని కోరారు.

# సాంకేతిక విద్య శాఖలో ఇష్టారాజ్యం

-మొదటిపేజీ తరువాయి

చోటుకు పంపేస్తున్నారు. అక్టోబర్ 8న వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో బదిలీలు చేసిన ప్రభుత్వం.. తాజాగా మరోసారి ఉద్యోగుల సర్దుబాటుకు సిద్ధమైందంటే పరిస్థితి ఏ స్థాయిలో దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ సర్దుబాటుకు ఏకంగా కౌన్సెలింగ్‌కు సిద్ధపడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఎవరెవరికి పోస్టులు కావాలో వివరాలు సేకరించడం చర్చనీయాంశమైంది. ఈ నెల 25వ తేదీతో మొదటి సెమిస్టర్ కూడా పూర్తయిపోయింది. అయినప్పటికీ మరోసారి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయడం ఏంటని లెక్చరర్లు, ఉద్యోగులే ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మంత్రి ఏం చేస్తున్నట్టని నిలదీస్తున్నారు.

**అడ్డగోలు బదిలీలు**

జూన్‌లో వీడియో కాల్స్ ద్వారా ఉత్తుత్తి బదిలీలు చేపట్టి రికార్డు సృష్టించిన సాంకేతిక విద్యాశాఖ... సెప్టెంబర్ లో 'వర్క్ అడ్జెస్ట్‌మెంట్' పేరుతో అడ్డగోలు డిప్యుటేషన్లు చేపట్టింది. ఇందులో ఫోకల్ (పట్టణాలు)లో పనిచేస్తూ మేలో నాన్ ఫోకల్ (గ్రామీణ నేపథ్యం)కు బదిలీ అయినవారిని, గతంలో ఆర్థిక తప్పులు చేసి పనిషిమెంట్ తీసుకున్నవారినీ తిరిగి రాష్ట్ర కార్యాలయానికి తీసుకొచ్చారు. అలాగే, జూన్‌లో సాధారణ బదిలీలు చేపట్టినా అన్ని ఖాళీలు చూపకుండా కేవలం డబ్బులిచ్చిన వారికి, నేతల సిఫారసు ఉన్నవారికే ప్రాధాన్యం ఇచ్చారు. కీలకమైన స్థానాలను దాచిపెట్టి కేవలం వీడియో కాన్ఫరెన్స్‌తో బదిలీలు చేపట్టి దానికి ఆన్‌లైన్ బదిలీలుగా నామకరణం చేశారు. ఎస్‌బీటీఈటీ (స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్)లో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి కూడా సాధారణ బదిలీల్లో స్థానచలనం కల్పించినట్టు జీవోలతో కలరింగ్ ఇచ్చిన అధికారులు... తర్వాత ఆ ఉత్తర్వులు పట్టించుకోవద్దని కాలేజీలు, కార్యాలయాలకు సమాచారం అందించారు. అయితే, వీరికోసం గత నెలలో మరోసారి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేస్తూ ఉన్న స్థానాల్లో కొనసాగేలా బదిలీ ఉత్తర్వులిచ్చారు.

**ఎస్‌బీటీఈటీలోనూ అవినీతి మకిలి**

సాంకేతిక విద్యలో సిబ్బంది కొరత ఉంది. దీంతో అవసరం మేరకు డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమిస్తారు. దీనికి ఓ విధానం కానీ, మార్గదర్శకాలు కానీ పాటించడం లేదు. పైరవీలు చేసేవారికే అవకాశం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా వచ్చిన వారు కార్యాలయాన్ని వదలకుండా కొత్తవారు రాకుండా అడ్డుకుంటున్నట్టు విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే గత నెలలో పలువురు అధికారులు డిప్యుటేషన్లు తెచ్చుకోగా,




వారికి అనుకూలంగా ఉండే వారికోసం తాజాగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ బదిలీలకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం దీనిపై తీవ్ర దుమారం రేగుతోంది. 2014%–%17 మధ్య ఎస్‌బీటీఈటీలో పనిచేసిన ఓ అధికారిపై ఆర్థిక ఆరోపణలు రావడంతో పాలిటెక్నిక్ కాలేజీకి బదిలీ చేశారు. అయితే తనకున్న పలుకుబడితో రాష్ట్ర కార్యాలయానికి వచ్చేందుకు ఆయన ప్రయత్నించినా, గత ప్రభుత్వంలో కుదరలేదు. కూటమి ప్రభుత్వం రాగానే కాకినాడ ఆర్జేడీ కార్యాలయానికి బదిలీ చేయించుకున్నారు. మేలో జరిగిన బదిలీల్లో ఆయన్ను కలిదిండి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసినా చేరకుండా డిప్యుటేషన్ కోసం ప్రయత్నించి చివరికి జాయింట్ సెక్రటరీగా రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు.

ఇప్పటి దాకా బోర్డులో సిస్టం అనలిస్ట్‌గా హెడ్ ఆఫ్ సెక్షన్ స్థాయి అధికారికి మాత్రమే అవకాశమిచ్చారు. తాజాగా ఆంధ్రా పాలిటెక్నిక్‌లో పనిచేసే ఓ లెక్చరర్‌ను తెచ్చి ఈ పోస్టులో నియమించారు. విజయవాడలో అత్యధిక సర్వీసు చేసిన ఈయన తన పరిచయాలను వాడుకుని మళ్లీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఏళ్ల తరబడి తిరుపతి ఆర్జేడీ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఓ అధికారికి జూన్‌లో బేతంచర్ల పాలిటెక్నిక్ కాలేజీకి హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్‌గా బదిలీ అయింది. అయితే, ఆయన ఆ పోస్టులో చేరకుండా పైరవీలతో బోర్డులో డిప్యూటీ కార్యదర్శిగా వచ్చారు. బోర్డులో పనిచేసిన ఒకరిని పార్వతీపురం మన్యం జిల్లాలోని చినమేరంగి కాలేజీకి హెడ్‌గా ఇటీవల బదిలీ చేశారు. ఆయన కూడా తిరిగి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో డెప్యూటీ కార్యదర్శిగా స్థానం సంపాదించారు.

**జూన్‌లో జరిగిన బదిలీలు బేఖాతరు**

సాంకేతిక విద్యలో బదిలీలకు ప్రభుత్వం జూన్ 16న ఉత్తర్వులిచ్చింది. జీవో నం.91 ద్వారా ప్రిన్సిపాల్స్/డిప్యూటీ డైరెక్టర్ల స్థాయి అధికారులను బదిలీ చేసింది. జీవో నంబర్ 92 ద్వారా సెక్షన్ హెడ్ కేడర్ అధికారులను బదిలీ చేసింది. ఇందులోనూ ప్రభుత్వంలోని పెద్దల అండదండతో బదిలీ అయినా ఆ పోస్టులోకి వెళ్లకుండా కొంతమంది డైరెక్టరేట్‌లోనే చక్రం తిప్పుతున్నారు. ఈ విషయాన్ని గత నెలలో 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టారు. వాస్తవాలు వెలుగులోకి రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు నటించారు. యథాస్థానాల్లో కొనసాగుతూ బోర్డులో చక్రం తిప్పుతున్నారు.

**బోర్డులో పాతుకుపోయారు**

2017 నుంచి బోర్డులో ఏడీగా కొనసాగుతున్న అధికారిని జూన్‌లో జంగారెడ్డిగూడెం బదిలీ చేయగా ఆయన బోర్డును మాత్రం వదల్లేదు.

2018 నుంచి బోర్డులో పనిచేస్తున్న మరో అధికారిని గుంతకల్లు బదిలీ చేశారు. ఆయన కూడా అంతే. మరో అధికారిని ఇటీవల రాయదుర్గం బదిలీ చేసినా, ఆయన తీరూ ఇలానే ఉంది. ఇక డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న మరో అధికారిని హిందూపూర్ బదిలీ చేసినా, బోర్డును పట్టుకునే వేలాడుతున్నారు. 2016 నుంచి బోర్డులో కొనసాగుతున్న ఓ అధికారిపై అవినీతి ఆరోపణలు రావడంతో గత కమిషనర్ చర్యలు తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వం మారగానే తాను కీలక మంత్రికి బంధువునంటూ మళ్లీ బోర్డులోకి వచ్చేశారు. ఈయన్ను ఎటపాక బదిలీ చేసినా జీవోను సైతం రద్దు చేయించుకుని డైరెక్టర్ పేషీలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ అన్నీ చక్కబెడుతున్నట్టు ఆరోపణలున్నాయి.

## ప్రజల్ని అప్రమత్తం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

బృందాల్ని ఇప్పటికే తీరప్రాంత జిల్లాల్లో మోహరించాం. తుపానుపై ప్రెడిక్టివ్ మోడల్, రియల్‌టైమ్ డేటా ఆధారంగా విశ్లేషిస్తున్నాం. జలాశయాల్లో నీటిమట్టాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన కార్యాచరణ అమలుచేయాలి. 'విద్యుత్తు, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థలకు అంతరాయం లేకుండా చూడాలి. తీరప్రాంత ప్రజల్ని షెల్టర్లకు తరలించి పునరావాసం కల్పించాలి. రహదారులు, చెరువులు, కాల్వల గట్లు కోతకు గురైతే వెంటనే మరమ్మతులు చేపట్టాలి. చెట్లు కూలినా, కొమ్మలు విరిగిపడినా తొలగించేందుకు విద్యుత్తు రంపాలు, క్రేన్లు, జేసీబీలు ప్రతి డివిజన్ స్థాయిలోనూ సిద్ధంగా ఉంచుకోవాలి' అని సీఎం నిర్దేశించారు.

**పంటనష్టంపై వ్యవసాయశాఖ, ఆర్టీజీఎస్ సమన్వయంతో పనిచేయాలి**

'పంటనష్టం వివరాల్ని స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయశాఖ, ఆర్టీజీఎస్ సమన్వయంతో పనిచేయాలి. సముద్రంలోకి వెళ్లిన 82 మెకనైజ్డ్, 37 మోటరైజ్డ్ పడవల్ని తీరానికి సురక్షితంగా రప్పించాలి. జిల్లాలవారీగా ప్రత్యేక అధికారుల్ని నియమించాం. అన్ని శాఖలు, విభాగాల యంత్రాంగం సమన్వయంతో పనిచేసి.. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు. తుపాను ముందస్తు సన్నాహక చర్యలపై ఇప్పటివరకు 11 సమావేశాలు నిర్వహించామని, జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, క్రేన్లు, 757 విద్యుత్తు రంపాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు.

## మొంథా అలర్ట్

-మొదటిపేజీ తరువాయి

ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళ, బుధవారాల్లో గరిష్ఠంగా గంటకు 110 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు వీయొచ్చని చెప్పింది. తుపాను నేపథ్యంలో ఐఎండీ సోమవారం 7 జిల్లాలకు 'రెడ్' ఎలర్ట్, 16 జిల్లాలకు 'ఆరెంజ్', మరో 3 జిల్లాలకు 'ఎల్లో' ఎలర్ట్, మంగళవారం 14 జిల్లాలకు 'రెడ్', 8 జిల్లాలకు 'ఆరెంజ్', మరో 4 జిల్లాలకు 'ఎల్లో' ఎలర్ట్ జారీచేసింది.

సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. విశాఖపట్నం, మచిలీపట్నం, కృష్ణపట్నం, నిజాంపట్నం, గంగవరం, కాకినాడ పోర్టుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగిస్తున్నారు. కళింగపట్నం, భీమునిపట్నం, వాడరేవు పోర్టులకూ సమాచారం అందించారు.

తుపాను నేపథ్యంలో సహాయక చర్యల కోసం 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు జిల్లాల్లో ఉన్నాయని, మరికొన్ని బృందాలు హెడ్‌క్వార్టర్స్‌లో సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

**వర్షాలు ఇలా..**

సోమవారం: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలతో పాటు యానాంలో ఒకటి, రెండు చోట్ల అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలుబీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కర్నూలు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. మంగళవారం: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలతో పాటు యానాంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలుబీ పార్వతీపురం మన్యం, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైస్సార్ కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలుబీ చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది. బుధవారం: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు యానాంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలుబీ అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలుబీ బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని చెప్పింది.

## గోదావర్ళికావేరి
## అనుసంధానంపై ముందడుగు!

అమరావతి

గోదావరి–కావేరి అనుసంధానానికి ముందడుగు పడింది. ఇచ్చంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపడతామని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. దీనికి తెలంగాణ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 148 టీఎంసీలను తాత్కాలికంగా తరలించేలా అనుసంధానం చేపడతామని చెబుతున్నారని, హిమాలయ నదుల నుంచి గోదావరికి నీటిని తెచ్చాక వాటిని శాశ్వత ప్రాతిపదికన కావేరికి మళ్లిస్తామని అంటున్నారని, అసలు హిమాలయ నదుల నుంచి గోదావరికి నీటిని ఎప్పుడు తెస్తారో చెప్పాలని కేంద్రాన్ని ఏపీ సర్కార్ కోరింది. జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకమండలి 75వ సమావేశం ఈ నెల 1న కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు అధ్యక్షతన జరిగింది. అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ కార్యదర్శులు పాల్గొన్న ఈ సమావేశంలో గోదావరి%–%కావేరి అనుసంధానంపై చర్చించారు. ఆ వివరాలను పాలకమండలి విడుదల చేసింది.

**రాష్ట్రాల సమ్మతి ప్రకారమే..**

ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 148 టీఎంసీల గోదువరి జలాలను ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్(కృష్ణా), సోమశిల(పెన్నా), అరణియార్ రిజర్వాయర్‌ల మీదుగా కావేరికి గోదావరి జలాలను తరలించేలా 2022లో ఎన్‌డబ్ల్యూడీఏ డీపీఆర్‌ను రూపొందించింది. అంతర్భాగంగా కర్ణాటకలో బెడ్తి%–%వరద అనుసంధానం చేపడతామని పేర్కొంది. కావేరికి తరలించే 148 టీఎంసీల గోదావరి జలాలు, బెడ్తి%–%వరద అనుసంధానంలో తరలించే 18.5 టీఎంసీలు కలిపి మొత్తం 166.5 టీఎంసీల్లో... తెలంగాణకు 43.65, ఆంధ్రప్రదేశ్‌కు 43.86, తమిళనాడుకు 40.93, కర్ణాటకకు 34.40, పుదుచ్చేరికి 2.19 టీఎంసీలు కేటాయిస్తామని తెలిపింది. దీనివల్ల 6,78,797 హెక్టార్లకు సాగునీరు, తాగునీటిని అందించవచ్చని పేర్కొంది. ఈ డీపీఆర్‌పై బేసిన్‌లోని రాష్ట్రాలతో కేంద్రం పలుమార్లు సంప్రదింపులు జరిపింది. తాజా సమావేశంలో ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ట్రిబ్యునల్ కేటాయించిన జలాలను తాము వాడుకుంటామని.. అదనంగా ఉన్న నీటిని కావేరికి మళ్లిస్తే తమకు అభ్యంతరం లేదని ఛత్తీస్‌గఢ్ పేర్కొంది. ఈ అనుసంధానానికి తెలంగాణ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అనుసంధానం ద్వారా మళ్లించే జలాల్లో 50 శాతం తమకు కేటాయించాలని కోరింది. గోదావరిలో నికర జలాల్లో మిగులు లేదని.. తాత్కాలికంగా ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని నీటినే కావేరికి తరలిస్తామని కేంద్రం చెబుతోంది. హిమాలయ నదుల నుంచి గోదావరికి నీటిని తెచ్చాక.. ఆ నీటిని శాశ్వత ప్రాతిపదికన కావేరికి మళ్లిుస్తాుముని అంటోంది. ఈ నేపథ్యంలో హిమాలయ నదుల నీుటిని గోదావరికి ఎప్పుడు తెస్తారో చెప్పాలని ఏపీ కోరింది. లేుదంటే తమ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని తెలిపింది. కృష్ణా జలాల్లో తమకు అదనపు వాటా పెంచాలని కర్ణాటక, మహారాష్ట్ర డిమాండ్ చేశాయి. తక్షణమే అనుసంధానం చేపట్టాలని తమిళనాడు, పుదుచ్చేరి కోరగా.. కావేరి జలాల్లో అదనపు వాటా కావాలని కేరళ డిమాండ్ చేసింది. బేసిన్‌లోని రాష్ట్రాల సమ్మతి, ట్రిబ్యునల్ అవార్డుల ప్రకారమే ఈ అనుసంధానం చేపడతామని కేంద్రం స్పష్టం చేసింది.

### మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను

# సత్కరించిన మైనార్టీ పెద్దలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం మాజీ పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్ రామ్‌కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గా పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించిన శుభ సందర్భంగా రాజమండ్రి సిటీ మైనార్టీవిభాగం ఆధ్వర్యంలో భరత్‌ను ఘనంగా సత్కరించారు. మంచి ఉన్నతమైన స్థానాన్ని కల్పించినందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భరత్‌ను ఈ సందర్బంగా శాలువా కప్పి పూలబొకేతో అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫుల్లా ఖాన్, సిటి జనరల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండి షబ్బీర్ భాయ్, మైనార్టీ సీనియర్ నాయకులు మదీనా భాష, అలీ భాయ్, సయ్యద్ బాబులు, ఉస్మాన్, అక్రమ్, సుభాని, సామాజిక సేవకులు అమీర్ పాషా, శేఖర్, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# గుర్తు తెలియని వ్యక్తి మృతి

**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు మండలం సింగన్నగూడెం గ్రామంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో ఉండగ గ్రామస్తులు మానవత్వంతో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పూర్తిగా ఆరోగ్యం క్షిణించడంతో ఆదివారం నాడు సాయింత్రం మరణించడం జరిగింది. చింతూరు గ్రామ విఆర్ఓ మానే లక్ష్మయ్య పంచానమా చేసి పంచాయితీ పరిధిలో దహన సంస్కరణ నిర్వహించారు. వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందడంతో చింతూరు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అన్నమయ్య సాహితీ ఉత్సవంలో

# యువ కవి నక్కిన ధర్మేష్‌కు ఘన సత్కారం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక అధ్వర్యంలో అన్నమయ్య సాహితీ ఉత్సవం 158 వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం అన్నమయ్య జిల్లా, మదనపల్లి శ్రీరామ కమ్యూనిటీ లో కనుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా బొబ్బిల్లంక గ్రామానికి చెందిన యువ కవి, విద్యా మరియు సామాజికవేత్త, పలు అవార్డులు గ్రహీత నక్కిన ధర్మేష్ ఏంటో ఈ జీవిత ప్రయాణం అనే కవితా శీర్షికతో చక్కటి కవితాగానం చేసి కవుల ప్రశంసలు పొందారు. యువ కవి నక్కిన ధర్మేష్ ను ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ డి. జి. రామ మూర్తి, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారథి చేతుల మీదుగా శాలువ, పూలదండ, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.అలాగే గ్రామస్తులు ధర్మేష్ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### మానవత్వాన్ని చాటుకున్న

# రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా, జాలిముడి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో తన జీవనాధారం కోల్పోయిన బాధితురాలు సిద్దే రత్నకుమారి కుటుంబానికి రుడా చైర్మన్ రాజానగరం తేదేపా నియోజక వర్గం ఇంచార్జ్ మరియు రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి అండగా నిలిచారు.వివరాల్లోకి వెళితే, సిద్దే రత్నకుమారి నడుపుతున్న బడ్డీ కొట్టు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయి, ఆమె కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ఈ విషయం తెలుసుకున్న బొడ్డు వెంకటరమణ చౌదరి వెంటనే స్పందించి, బాధితురాలిని పరామర్శించారు.నష్టపోయిన ఆమె బడ్డీ కొట్టును తిరిగి నిర్మించుకునేందుకు, కుటుంబానికి తాత్కాలిక ఊరట కల్పించేందుకు గాను, బొడ్డు వెంకటరమణ చౌదరి తమ వంతుగా కొంత నగదును (ఆర్థిక సహాయాన్ని) రత్నకుమారికి అందజేశారు.

### మొంథా తుఫాన్ ప్రభావం, విపత్తును ఎదుర్కొనేందుకు

# జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** "మొంథా "తుఫాను ప్రభావం తో జిల్లాలో రానున్న 4 రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు 100 నుండి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలు లు వీస్తాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడిం చారు ఆదివారం స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికేయులు సమావేశం నిర్వ హించి మొంథా తుఫాన్ ప్రభావం, విపత్తును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు గూర్చి వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 27, 28, 29 తేదీలలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈనెల 28 వ తేదీ అల్పపీడనం వాయుగుండంగా మారి సాయంత్రం కాకినాడ జోన్ నందు తీరాన్ని దాటే అవకాశ ముందన్నారు. జిల్లా యంత్రం గాన్ని అప్రమత్తం చేసి క్షేత్రస్థాయి ఉద్యోగులకు విపత్తును ఎదుర్కొ నేందుకు విధులు కేటాయించ దం జరిగిందని తెలిపారు. స ముద్రతీరం వెంబడి ఉన్న తుఫాన్ పునరావాస కేంద్రాలను సిబ్బందితో సిద్ధం చేసి భోజన, వసతిని కల్పించేందుకు సమాయత్త పరిచామన్నా రు. సముద్ర తీరం వెంబడి 34 ఆవాసాలలో సుమారు 6000 మంది ప్రజానీకం ఉందని వారిని తుపాను హెచ్చరికలకు అనుగు ణంగా తరలించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. తరలింపు ప్రణాళికకు కూడా మానవ వనరులు, పడవలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రాబోయే 4 రోజులు అనవసర ప్రయాణాలు వాయిదా వేసు కోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన స్పష్టం చేశారు. రాబోయే 15 రోజులలో ప్రసవ తేదీలు ఉన్న గర్భిణీలను వైద్యులు గుర్తించి సమీప పీహెచ్సీ సిహెచ్ కేంద్రా లలోని బర్త్ వెయిటింగ్ హాల్ కు సురక్షిత ఆసుపత్రి ప్రసవాల నిర్వహణ నిమిత్తం తరలిం చడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 428 మందిని గర్భిణీలను గుర్తించి తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో 90 కిలో మీటర్ల మేర తీర ప్రాంతం ఉందని మూడు కిలోమీటర్లకు ఒక ఇన్చార్జ్ సిబ్బందిని నియమించి హెచ్చరికలకు అనుగుణంగా మెరైన్ పోలీస్ సమన్వయంతో సహాయక చర్యలు నిమిత్తం చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. బీచ్ ప్రాంతంలో ఎవరు సంచరించరాదన్నారు. సముద్రంపై చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులను తీరానికి రప్పించడం జరిగిందని, పడవలను కూడా ఫిష్ లాండింగ్ కేంద్రాల నందు మత్స్యశాఖ ఆధ్వర్యంలో భద్రపరిచినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రం, డివిజన్, మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 08856బి 293104 నెంబర్ లో సంప్రదించి సహా యక చర్యలు పొందవచ్చునన్నారు. జిల్లాలో తుఫాను సహాయక చర్యలు నిమిత్తం ఒక ఎన్డిఆర్ఎఫ్ బృందం ఉందని మరో ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం రానున్నద న్నారు. ఈ విధంగా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు విపత్తును ఎదుర్కొనేందుకు తీసుకోవడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఏపీ ఈపీడీసీ ఎల్ వారు 3000 కరెంటు స్తంభాలు, ట్రాన్స్ఫా ర్మర్లు మెటీరియల్ను విద్యు త్ పునరుద్ధరణ కొరకు తీర ప్రాంత వెంబడి ఉన్న సబ్ స్టేషన్లలో భద్రపరిచారన్నారు. అదే విధంగా మానవ వనరులను సిద్ధం చేయడం జరిగిందన్నారు ఈదురు గాలులకు చెట్లు కూలి రహదారి రాకపోక లకు అడ్డం కులు ఏర్పడిన నేపథ్యంలో వాటిని తొలగించి రహదారి పునరుద్ధరణకు పవర్ రంపాలు జెసిబిలు క్రేన్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.ఈనెల 28 29 తేదీలలో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు తుఫాను హెచ్చ రికల నేపథ్యంలో సెలవులు ప్రకటించినట్లు తెలిపారు నియోజకవర్గ,మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాలో తప్పనిసరిగా ఉండాల న్నారు.ముంపుకు గురయ్యే ప్రాంతాలను హెచ్చరికలకు అనుగు ణంగా ముందుగా గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. మొంథా తుఫానును తేలికగా తీసుకోరాదని, మరింత తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరి కల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నా రు. ప్రత్యేకించి మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వారికి కేటాయిం చిన కేంద్రాలలో తప్పనిసరిగా ఉంటూ తుఫాను సందర్భంగా ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థి తులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యు, అగ్ని మాపక శాఖ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి తదితర అనుబంధ శాఖలు సమన్వయము చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వరి పంట కోత దశకు వచ్చినందున కాలు వలలో నీటి ప్రవాహాన్ని మూడు రోజులపాటు తుఫాను నేపథ్యంలో పంటలు ముంపు బారిన పడకుండా నిలుపుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీ లు పూర్తిగా ఓపెన్ చేసి మురికి నీరు పారేలా చర్యలు తీసుకు న్నామన్నారు.తీరప్రాంతాల్లోని సిగ్నల్ అంతరాయం కలగకుం డా సెల్ టవర్ల వద్ద జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నా రు. ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను కూడా ముందస్తుగానే సమకూర్చుకొని ఉంచుకో వాలన్నారు. కంట్రోల్ రూమ్ పనితీరును ఆయన పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఏవో కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన రికార్డ్

### సూపరింటెండెంట్, గైనకాలజిస్టులు, సిబ్బంది కృషి ఫలితం - అభినందించిన చింతూరు ప్రాజెక్ట్ అధికారి





**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ఒక రికార్డు సృష్టించింది. ఆసుపత్రి చరిత్ర లో ఎన్నడూ లేని విధంగా 100 ప్రసవాలు అక్టోబర్ నెల లో అవ్వడం తో ఈ రికార్డు సొంతం చేసుకుంది. పదేళ్ల క్రితం రాష్ట్ర విభజన జరిగాక విలీన మండలాలైన చింతూరు కూనవరం ఎటపాక, వరరామచంద్రాపురం మండలాలకు వైద్య సేవలు అందని ద్రాక్షా గానే మారింది. దీంతో ప్రజలు వైద్య సేవలకోసం నానా రకాలుగా ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి ప్రారంభం నుండి సివిల్ ఆసుపత్రి గా ఉన్న చింతూరు ఆసుప్రత్రి 2018 నుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా అప్ గ్రేడ్ అయ్యింది. 2022 నుండి స్పెషలిస్ట్ వైద్యులను వైద్య ఆరోగ్య శాఖ నియమించడంతో ఈ ఆసుపత్రిలో అన్నీ రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో విలీన మండలాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో కి వచ్చాయి. చింతూరు ఆసుపత్రి లో ఇద్దరు గైనకాలజిస్తులు, ఆర్థోపెడిక్ ఒకరు, జనరల్ ఫిజిషియన్ ఒకరు, చెవి ముక్కు గొంతు వైద్యులు, పిల్లల వైద్యులు, అనస్థిసీ యా(మత్తు డాక్టర్), ఇద్దరు జనరల్ వైద్యులను నియమించడంతో ప్రజలకు మంచి సేవలు అందే అవకాశం వచ్చింది.

**ప్రసవాలపై ప్రత్యేక దృష్టి...**

2023లో డాక్టర్ ఎం.వీ. కోటిరెడ్డి సూపరింటెండెంట్‌గా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో ఆయన ప్రజలకు అన్నీ రకాల వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ప్రసవాలు పెంచడం అన్ని రకాల ఆపరేషన్‌లు చింతూరులో జరిగే విదంగా ప్రయత్నించడంతో ఆసుపత్రిలో రోజు వారి ఔట్ పేషెంట్స్, ఇన్ పేషెంట్స్ సేవలు బాగా పెరిగాయి. ముఖ్యంగా ప్రసవాలు ఎక్కువగా పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు. సూపరింటెండెంట్ డా. ఎం వీ కోటిరెడ్డి, మత్తు డాక్టర్ కావడం, గైనకాలాజిస్టులు డాక్టర్ ఎంవీ రమణారావు, డాక్టర్ శశికళ సమిష్టి తో ప్రసవాల పెంపుకు కృషి చేసారు. దీంతో అక్టోబర్ నెలలో 100 ప్రసవాలా టార్గెట్‌ను సాధించడం జరిగింది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో ఉంది.

**చింతూరు ఆసుపత్రిలో 2025 జనవరి నుండి అయిన ప్రసవాలు..**

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఈ ఏడాది జనవరి నుండి అక్టోబర్ నెల వరకు అయిన ప్రసవాల వివరాలు, జనవరి 64, ఫిబ్రవరి 48,మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50,ఆగష్టు 92, సెప్టెంబర్ 95, అక్టోబర్ 100 అయ్యాయి.

**ఎస్ఎన్సీయూ చిన్న పిల్లల యూనిట్‌లో ప్రత్యేకంగా వైద్య సేవలు**

చింతూరు ఆసుపత్రి లో చిన్న పిల్లల వైద్య సేవలకోసం కోసం ఏర్పాటు నావజాత శిశు కేంద్రం (ఎస్ఎన్సీయూ)లో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఏడాది లోపు ఉన్న చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లల వైద్యాధికారి డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాకుండా శిశు మరణాలను తగ్గించేందుకు ఈ యూనిట్ ఉపయోగ పడుతుంది. చిన్న పిల్లల వైద్య సేవల కోసం పిడియాట్రీషియన్, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండడం విశేషం.

**నాలుగు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి**

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి నాలుగు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, ఛత్తేస్ గడ్ రాష్ట్రాల ప్రజలకు ఇదే ప్రధాన ఆసుపత్రి. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి లో స్పెషలిస్ట్ వైద్యులతో పాటు స్కానింగ్, ఎక్స రే, అన్ని రకాల రక్త పరీక్షలు, డా. ఎన్టీఆర్ వైద్య సేవలు, డయాలసిస్ సేవలు, ఎన్ ఆర్ సీ కేంద్రం, ఎస్ ఎన్ సీ యూ కేంద్రం ఉండడంతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.



జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐటీడీ ఏ ప్రాజెక్టు అధికారి శు భం నొక్వాల్, డీసీ హెచ్ ఎస్ డా. నీలవేణి డిప్యూటీ డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పుల్లయ్య సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుంది.

**ఖాళీ స్పెషలిస్ట్ పోస్టులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలి**

చింతూరు ప్రభుత్వలో ఖాళీ గా ఉన్న స్పెషలిస్ట్ వైద్యాధికారుల పోస్ట్ లు భర్తీ చేయాలి. ప్రస్తుతం జనరల్ ఫిజిషియన్, ఈ ఎన్ టీ, ఆర్థోపెడిక్, పెడియాట్రిక్ వైద్య పోస్టులు భర్తీ చేస్తే ఇంకా ప్రజలకు వైద్య సేవలు అందించవచ్చు.

**100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్**

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ఇటీవల 100 పడకల ఆసుపత్రి గా అప్ గ్రేడ్ గా ప్రభుత్వం మంజూరు చేసింది దీంతో ఇక్కడ ప్రజల కు త్వరలో నే ఇంకా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి

## ఎడిటర్ వాయిస్

# అప్పు చేసి పప్పుకూడు ?

# తెలుగు రాష్ట్రాల ప్రజల స్టైల్

తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 11 ఏళ్లుపూర్తయింది. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఏర్పడగా, ఆంధ్రప్రదేశ్ అప్పులు, కుప్పలు లేని రాష్ట్రంగా ఏర్పడింది. ఈ రెండు రాష్ట్రాలు దేశంలో అప్పుల భారం ఎక్కువగా ఉన్న తొలి స్థానాల్లో నిలిచాయి. ఏది కావాలన్నా ముందు అప్పు చేసెయ్ అన్నట్లుగా మారిపోయింది తెలుగు రాష్ట్రాల ప్రజల లైఫ్ స్టైల్. దేశంలోనే అత్యధికంగా అప్పులు చేస్తున్న ప్రజల్లో తెలుగు రాష్ట్రాల ప్రజల ముందున్నారు. 2020–21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది అప్పుల్లో ఉన్నారు. కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన సర్వే లో ఈ విషయం వెల్లడి అయింది. ఏపీ 1వ స్థానం, తెలంగాణ 2వ స్థానాల్లో నిలిచాయి. అయితే, ఫైనాన్షియల్ ఇన్క్లూజన్లో ఏపీ 92.3% తో రెండో స్థానంలో, కర్ణాటక 95.9% తో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణలో 86.5% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలోకి చేరారు. ఈ విధంగా, దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ 14వ స్థానంలో ఉంది. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే, ఓబీసీలులో 16.6% మంది అప్పుల ఊబిలో ఉంటే, గిరిజనులులో 11% మాత్రమే అప్పుల భారం తేలిందని నివేదిక పేర్కొంది. కుటుంబం పెద్దదైనా, చిన్నదైనా అప్పుల భారం వేరుగా ఉంటుంది. చిన్న కుటుంబాలు ఎక్కువ అప్పుల భారం మోస్తున్నాయి, పెద్ద కుటుంబాలపై అప్పుల ప్రభావం తక్కువగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో సగటున 92.1% మంది ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలో ఉండగా, 31.8% మంది అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి తక్కువ, 80.2% మంది ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలో ఉండగా, 7.4% మందికే అప్పుల భారం ఉంది. హైదరాబాద్‌ను పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ప్రకటించిన ఆంధ్రప్రదేశ్‌కు పెద్దగా ప్రయోజనం కలగలేదు. తెలంగాణ మాత్రం హైదరాబాద్ రాజధాని కారణంగా భారీగా ఆదాయం పొందుతోంది. ఇక ఏపీ రాజధాని లేని రాష్ట్రంగానే మిగిలిపోయింది. అయితే 11 ఏళ్లలో పాలకులు రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమ పథకాల పేరుతో చేసిన అప్పులతో ఇప్పుడు రెండు రాష్ట్రా?టలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇదే సమయంలో తెలుగు ప్రజలు కూడా అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్నా అప్పులు కూడా పెరుగుతన్నాయి. కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన సర్వే ప్రకారం తెలుగు రాష్ట్రాలు దేశంలో అత్యధికంగా అప్పులు ఉన్న రాష్ట్రాలుగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. 2020?21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది అప్పుల్లో చిక్కుకున్నట్లు నివేదిక చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. ఏపీలో 15 ఏళ్లు పూర్తి చేసిన ప్రజలలో 92.3% మంది బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నారు. ఇది కర్ణాటక (95.9%) తర్వాత రెండవ ఉత్తమ స్థాయి. అయితే కర్ణాటకలో అప్పుల శాతం కేవలం 23.2% మాత్రమే ఉంది. అంటే, బ్యాంకింగ్ చేరిక పెరగడం అప్పు భారాన్ని తగ్గించలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక తెలంగాణలో 86.5% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నారు. దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో 14వ స్థానంలో ఉంది. దక్షిణ రాష్ట్రాల సగటు ప్రకారం 92.1% మంది జనాభా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగమయ్యారు. కానీ వారిలో 31.8% మంది అప్పుల బారిన పడినవారే. అంటే ఆర్థిక చేరికతోపాటు వడ్డీ ఆధారిత జీవనశైలి బలపడుతున్న సంకేతమిది. దీని విరుద్ధంగా ఈశాన్యరాష్ట్రాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. అక్కడ 80.2% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, అప్పుల శాతం కేవలం 7.4% మాత్రమే. సర్వే ప్రకారం.. బ్యాంకింగ్ చేరికలో పురుషులు (89.8%) ముందంజలో ఉండగా మహిళలు (84.5%) వెనుకబడ్డారు. మతపరంగా చూస్తే హిందువులలో 88.1% ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కలిగి ఉండగా, ముస్లింలు 80.8% వద్ద ఆగిపోయారు. ఈ వ్యత్యాసం సామాజిక ఆర్థిక అవగాహనలో, ఆదాయ అవకాశాల్లో ఉన్న అసమానతలను చూపుతోంది. అప్పుల విషయంలో ఓబీసీలు (16.6%) ప్రధానంగా బరువును మోస్తుండగా, గిరిజనులు (11%) తక్కువగా ఉన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ సేవల్ని విస్తృత పరిచాయి. యాప్స్ ద్వారా లోన్లు ఇస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ వంటి సంస్థల మార్కెట్ తెలుగు రాష్ట్రాల్లో చాలా ఎక్కువ. చాలా ఈజీగా లోన్లు ఆఫర్ చేస్తూంటారు. అందుకే ఎక్కువ మంది కట్టగలమా లేదా అన్న ఆలోచన లేకుండా అప్పులు చేస్తున్నారు. చివరికి వారిని రుణాల ఊబిలోకి దింపుతోంది. నిజానికి



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# బ్రిక్స్ దూకుడు.. డాలర్ పతనం



షేర్ మార్కెట్ సూచీలు పతన దిశగా పోతున్నప్పుడు విదేశీ మదుపుదారులు, మార్కెట్ నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. అంటే తాము గతంలో కొనుగోలు చేసిన షేర్లను అమ్మేసుకుంటారు. అలా అమ్మినప్పుడు వారికి వచ్చే మొత్తం రూపాయలలో ఉంటుంది. కానీ, ఆ పెట్టుబడిదారులు భారతదేశ రూపాయలను తమ దేశానికి తీసుకువెళ్లరు. అంటే వారు మన రూపాయలను, తిరిగి తమ దేశీయ కరెన్సీ రూపంలోకి మార్చుకుంటారు. ఈ దశలో వారు భారత రూపాయిని అమ్మేసి తమ దేశీయ కరెన్సీ రూపంలోకి మార్చుకుంటారు. ఇక్కడ రూపాయి అమ్మేయబడుతోంది. అంటే, రూపాయికి డిమాండ్ తగ్గిపోయింది. అదీ కథ. వివిధ దేశాల కరెన్సీల విలువలు ఒకదానితో ఒకటి ఏ విధంగా మారకం విలువను నిర్ణయించుకుంటాయో, వాటి వాటి 'డిమాండ్' నిర్ణయించే కథ. ఇక ప్రస్తుత స్థితి అయిన డాలర్ ప్రభావం తగ్గడమనేది ప్రధానంగా 1980ల తర్వాత మొదలైంది. 1980ల అనంతరం అమెరికా ఆర్థిక పరిస్థితులు దిగజారుతూ రావడం దీని వెనుక ఉన్న కారణం. అమెరికా ఆర్థికస్థితిని, తలకిందులు చేసిన ముఖ్యమైన పరిణామాలుగా: 1. ఔట్ సోర్సింగ్, 2. ఆటోమేషన్ ఉన్నాయి. 1980ల అనంతరం అమెరికాలోని సరుకు ఉత్పత్తి పరిశ్రమలు చౌకైన శ్రమశక్తి వేటలో చైనా వంటి ఇతర దేశాలకు తరలివెళ్లడం మొదలయ్యింది. దీని ఫలితంగా అమెరికాలో ప్రజలకు సరుకు ఉత్పత్తి రంగంలో, ఉపాధి అవకాశాలు క్షీణించిపోయాయి. ఇక అలాగే 1990ల అనంతరం, అంటే ఇంటర్నెట్ ఆవిష్కరణ అనంతరం అమెరికాలోని సేవారంగంలోని పరిశ్రమలు కూడా భారతదేశం వంటి ఇతర దేశాలకు తరలివెళ్లడం మొదలయ్యింది. ఈ క్రమంలోనే, అమెరికా సేవారంగంలో కూడా ఆ దేశ ప్రజలకు ఉపాధి అవకాశాలు క్షీణించసాగాయి. ఇక దీనంతటితో పాటుగా, 1980ల అనంతరం మరింత వేగం పుంజుకున్న యాంత్రీకరణ (ఆటోమేషన్) అంటే రోబోట్ల వంటివాటి ఆవిష్కరణ అమెరికాలోనూ, ఇతర ధనిక దేశాల్లోనూ ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. ఉదాహరణకు 1960 %–% 2017 మధ్యకాలంలో అమెరికాలోని సరుకు ఉత్పత్తిరంగంలో ఉపాధి ఆ దేశంలోని మొత్తం ఉపాధిలో భాగంగా 28 శాతం (1960) నుంచి 8 శాతానికి (2017 మార్చి) పడిపోయింది. అలాగే, సేవారంగంలో కూడా జరగడాన్ని మనం గమనించవచ్చు. దీని ఫలితంగానే నేడు అమెరికాలో నెలకొన్న ఉపాధిరాహిత్యం, ఆర్థిక సమస్యల క్రమంలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తోన్న భారతీయుల వంటి వారికి వ్యతిరేకంగా ట్రంప్ నేతృత్వంలో ఆ దేశంలో హెచ్1బీ వీసాలు, గ్రీన్ కార్డులు పౌరసత్వం తదితర అంశాలపై కొత్తగా ఆ దేశంలో స్థిరపడుతోన్నవారికి వ్యతిరేకంగా దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి ఉపాధి, డిమాండ్ రాహిత్య స్థితి, ప్రజల కొనుగోలు శక్తి పతనం నుంచి బయటపడేందుకు 1980ల అనంతరం అమెరికాలో 'క్రెడిట్ బూమ్' వచ్చింది. అంటే, అప్పుచేసి పప్పుకూడు అన్నమాట. క్రెడిట్ కార్డుల మంజూరు, వినియోగం వంటివి పెరిగిపోయాయి. ఈ క్రమంలోనే, అమెరికా ప్రజలు నేడు భారీగా అప్పులపాలై ఉన్నారు. పైగా ఉక్రెయిన్–రష్యా యుద్ధక్రమంలో రష్యా మీద అమెరికా అనేక ఆంక్షలు పెట్టింది. వీటిలో భాగంగానే, రష్యా దేశం తన విదేశీ లావాదేవీల కోసం డాలర్‌ను వినియోగించుకొనే అవకాశం లేకుండా చేసేందుకుగానూ డాలర్ లావాదేవీల కోసం ఏర్పరిచిన 'స్విఫ్ట్' వ్యవస్థ నుంచి రష్యాను అమెరికా బహిష్కరించింది. ఈ బహిష్కరణ ప్రపంచంలోని అనేక దేశాల ఆలోచనలో పెద్దమార్పును తెచ్చింది. ఈ క్రెడిట్ బూమ్ కొనసాగింపుగా 1990లలో 'డాట్‌కామ్ బబుల్' వచ్చిచేరింది. అంటే, 1990లలో మొదలైన సాఫ్ట్‌వేర్, ఇంటర్‌నెట్ విప్లవంతో అమెరికా షేర్ మార్కెట్‌లో టెక్నాలజీ షేర్ల సూచీలు (నాస్క్) విపరీతంగా పెరిగిపోయాయి. అమెరికా ప్రజలలోని అత్యధిక శాతం షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెడతారు. కాబట్టి ఈ టెక్నాలజీ షేర్ల విలువల పెరుగుదల ఆదాయపరంగా వారికి బాగా అనుకూలించింది. అంటే వారు పెట్టిన పెట్టుబడుల విలువ పెరగడంతో అమెరికా ప్రజలకు అదనపు ఆదాయాలు లభించాయి. ఈ రకంగా 1990ల నుంచీ %–% 2001 వరకూ, షేర్ మార్కెట్ల నుంచి లభించే స్పెక్యులేటివ్ ఆదాయం అమెరికా ప్రజల కొనుగోలు శక్తిని కాపాడింది. అయితే, 2001లో డాట్‌కామ్ బబుల్ బద్దలు కావడంతో షేర్ మార్కెట్ సూచీలు పతనమై ప్రజలకు అదనపు ఆదాయవనరుగా ఉన్న షేర్ మార్కెట్ పెట్టుబడులకు గండిపడింది. అంటే కథ మళ్లీ మొదటికి రాసాగింది. సరైన ఉపాధిలేని స్థితి నుంచి ప్రజలను కాపాడుతూ వచ్చిన క్రెడిట్ బూమ్ ప్రభావం సన్నగిల్లుతూ రావడంతో పాటుగా డాట్‌కామ్ బబుల్ బద్దలు కావడంతో అమెరికాలో మరలా మార్కెట్ల పతనం, ఆర్థిక సంక్షోభ వాతావరణం నెలకొనసాగాయి. ఈ క్రమంలోనే, 2003 ప్రాంతంలో అమెరికాలో మరో సరికొత్త బూమ్‌కు తెరలేచింది. అమెరికా ఫెడరల్ బ్యాంక్ గృహ రుణాలపై వడ్డీరేట్లు భారీగా తగ్గించడంతో రియల్ ఎస్టేట్ బూమ్ మొదలయ్యింది. ఈ క్రమంలో, రియల్ ఎస్టేట్ లావాదేవీలు విపరీతంగా పెరిగిపోయి అది ప్రజలకు ఒక ఆదాయవనరుగా మారింది. ఆ రకంగా, ఉపాధిరాహిత్య స్థితి ప్రభావం నుంచి రియల్ ఎస్టేట్ బూమ్ ద్వారా అమెరికా అప్పటికి బయటపడింది. అయితే, ఈ స్థితి కూడా తాత్కాలికమేనని 2008, సెప్టెంబర్‌లో ఈ బుడగ బద్దలు కావడంతో రుజువయ్యింది. ఈ 2003–2008 రియల్ ఎస్టేట్ బూమ్ కాలంలో, ఒకానొక దశను చేరుకునేసరికి రియల్ ఎస్టేట్ రుణాలపై భారీగా లాభాలు సంపాదిస్తోన్న అమెరికా బ్యాంకులు దురాశకు పోయాయి. దానిలో భాగంగానే అవి అడ్డగోలుగా రుణ మంజూరులు చేశాయి. అంటే, లాభాల వేటలో అవి అర్హతలేని, రుణాలను తిరిగి చెల్లించేందుకు తగిన సామర్థ్యం లేనివారికి కూడా రుణాలు మంజూరు చేశాయి. ఈ రుణాలనే 'సబ్‌ప్రైమ్' రుణాలు లేదా నింజా (%చీ×చీజీూ%) రుణాలు అంటారు. నింజా రుణాలు అంటే నో ఇన్‌కమ్ (ఆదాయంలేని), నో జాబ్ (సరైన ఉపాధి లేని), నో ఎసెట్స్ (రుణాల కోసం గ్యారెంటీగా చూపగల ఆస్తులు లేని) వారికి ఇచ్చిన రుణాలు. ఫలితంగా, 2007లో అమెరికా బ్యాంకుల వడ్డీరేట్లు మళ్లీ పెరిగిపోవడం మొదలుకావడంతో ముందుగా ఈ సబ్‌ప్రైమ్ లేదా నింజా రుణాలు, మొండిబకాయిలుగా మారడం మొదలయ్యింది. అనతికాలంలోనే ఇది 2008 చివరి నాటికి ఫైనాన్స్ సంక్షోభంగా అమెరికాను చుట్టుముట్టింది. ఫలితంగా, రాత్రికిరాత్రే అమెరికా జనాభాలోని 50 శాతం మంది వరకూ ఆ దేశ దారిద్ర్యరేఖ దిగువకు పడిపోయారు.

ఇక తర్వాతి కాలంలో సృష్టించేందుకు మరే బుడగా మిగలలేదు. ఈ కారణంతోనే నాడు 2009, జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే బరాక్ ఒబామా అమెరికా ఆర్థికవ్యవస్థ కోలుకునేందుకు సుమారుగా 900 బిలియన్ డాలర్ల ఉద్దీపన పథకాన్ని ప్రకటించారు. అంటే, దివాలా తీసిన అమెరికా బ్యాంకులు, వివిధ కంపెనీలను తిరిగి నిలబెట్టేందుకు అమెరికా ప్రభుత్వమే డాలర్లను ముద్రించి, సాయం అందించింది. అలాగే, అమెరికా ప్రజల కొనుగోలుశక్తిని తిరిగి నిలబెట్టేందుకు కూడా వివిధ రూపాలలో ప్రయత్నించింది. 2009 నాటి నుంచి కూడా సుదీర్ఘకాలం పాటు ఈ ఉద్దీపన పథకాలు, అంటే డాలర్లను ముద్రించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తిని కాపాడే యత్నం కొనసాగుతూనే వచ్చింది. 2020 కొవిడ్ మహమ్మారి కాలంలో ఈ డాలర్ల ముద్రణ పరాకాష్ఠకు చేరింది. నాడు కొవిడ్ లాక్‌డౌన్ల వలన ప్రజలకు పని చేసుకునే అవకాశం, ఆదాయం లేని స్థితి ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ స్థితిలో అమెరికా ప్రభుత్వం ఇతర అనేక దేశాల ప్రభుత్వాల లాగానే తన దేశంలోని ప్రజలకు వారివారి బ్యాంక్ ఎకౌంట్లలో డబ్బును డిపాజిట్ చేయసాగింది. దీనికోసం ఆయా ఇతర దేశాలలో లాగానే అమెరికా కూడా విపరీతంగా డాలర్లను ముద్రించింది. డాలర్ అనేది కాగితం కరెన్సీ అనీ, దాని ముద్రణ లేదా సరఫరా పెరిగిపోయిన కొద్దీ దాని విలువ పడిపోతుందనేది వేరే చెప్పనవసరం లేదు. ఈ సహజతర్కం లో భాగంగానే 2022 నుంచీ ద్రవ్యోల్బణం రూపంలో అనేక ఇతర దేశాల కరెన్సీలతో పాటుగా, అమెరికా డాలర్ విలువ పతనం కూడా వ్యక్తం కాసాగింది. ఇక మరెంత మాత్రమూ అదనంగా డాలర్ల ముద్రణ సాధ్యంకాని స్థితి ఏర్పడింది. అంటే, అమెరికా ప్రజల కొనుగోలు శక్తిని నిలబెట్టుకునేందుకు సరికొత్తగా మరే బుడగలు తేలేని స్థితికి తోడుగా డాలర్ల ముద్రణ ద్వారా ఉద్దీపన పథకాలను ఇచ్చుకునే అవకాశం ఇక లేకుండాపోయింది. దీనికి అదనంగా అమెరికా ప్రభుత్వం అప్పులు 37 లక్షల కోట్ల డాలర్ల పైకి పెరిగిపోవడంతో సరికొత్తగా అప్పులు పుట్టడం కూడా అమెరికాకు కష్టమవుతోంది. మొత్తంగా అమెరికా ఆర్థికవ్యవస్థ, దానిపై ఆధారపడ్డ డాలర్ ప్రాభవం కూడా నేడు వేగంగా సన్నగిల్లడాన్ని ప్రపంచం గమనిస్తోంది. ఫలితంగా నేడు చాలా దేశాలు తమ విదేశీ మారకద్రవ్య నిల్వల్లో ఉన్న డాలర్ల శాతాన్ని తగ్గించుకుంటున్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న అనేక చర్యలు, నిర్ణయాల వలన డాలర్ పతనం మరింత వేగాన్ని పుంజుకుంది. పారిశ్రామికంగా డొల్లగా మారిపోయిన స్థితిలో అమెరికా దేశ మనుగడకు మిగిలిన ఏకైక అస్త్రం దాని డాలర్‌కు ప్రపంచంలో ఉన్న ఆమోదయోగ్యత మాత్రమే! నేడు ఈ ఆమోదయోగ్యతకే ముప్పు వచ్చిపడుతోంది. పైగా ఉక్రెయిన్–రష్యా యుద్ధక్రమంలో రష్యా మీద అమెరికా అనేక ఆంక్షలు పెట్టింది. వీటిలో భాగంగానే, రష్యా దేశం తన విదేశీ లావాదేవీల కోసం డాలర్‌ను వినియోగించుకొనే అవకాశం లేకుండా చేసేందుకుగానూ డాలర్ లావాదేవీల కోసం ఏర్పరిచిన 'స్విఫ్ట్' వ్యవస్థ నుంచి రష్యాను అమెరికా బహిష్కరించింది. ఈ బహిష్కరణ ప్రపంచంలోని అనేక దేశాల ఆలోచనలో పెద్దమార్పును తెచ్చింది.

# డెత్ ట్రావెల్స్



గాల్లో తేలుతున్నదో... రోడ్డుపై ఉరకలెత్తుతున్నదో తెలియనంత పెనువేగంతో దూసుకు పోయే ట్రావెల్స్ బస్సు శుక్రవారం వేకువజామున కర్నూలు సమీపాన ప్రమాదంలో చిక్కుకుని 19 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. ఇటీవల ఈ రకం బస్సులు తరచూ ప్రమాదాలకు లోనవుతున్నాయి. పదిరోజుల క్రితం రాజస్థాన్‌లో కూడా ఇలాంటి బస్సే తగలబడి 20 మంది మరణించారు. ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో తాజా ప్రమాదం జరిగిందంటున్నారు. చూడటానికి భారీగా కనిపిస్తూ మెరిసే అద్దాలతో, సకల హంగులతో, స్లీపర్ కోచ్‌లుగా ఉండే ఈ బస్సులు తక్కువ వ్యవధిలో గమ్యాన్ని చేరుస్తా యని ఆశిస్తారు. అంత వేగంతో పోవటానికి అవసరమైన ఏర్పాట్లున్నాయో లేదో ఎవరూ గమనించుకోలేరు. ఇవి రోడ్డెక్కింది మొదలుకొని పాదచారుల నుంచి వాహనదారుల వరకూ అందరినీ హడలెత్తిస్తాయి. డిజైన్ రీత్యా చూసినా, బస్సు అంతర్నిర్మాణం అందంగా కనబడటానికి వాడే మెటీరియల్ గమనించినా అవి ఏమాత్రం సురక్షితం కాదని తెలిసిపోతుంది. సీట్ల మధ్య తక్కువ స్థలం ఉండటంవల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులకు తప్పుకునే వ్యవధి ఉండదు. ఇవి ఎక్కువగా రాత్రివేళల్లో వెళుతుంటాయి కాబట్టి ప్రయాణికులు నిద్రలోకి జారుకుంటారు. మెలకువ వచ్చి ఏదో జరిగిందనిగుర్తించేలోపే మంటలు చుట్టుముడతాయి. కనీసం పక్కవారిని అప్రమత్తం చేయటం మాట అటుంచి, గమనించినవారు తప్పుకోవటమే అసాధ్యమవుతుంది. గందరగోళం ఏర్పడి తోపులాట చోటుచేసుకుంటుంది. ఇక సురక్షితంగా బయటపడేదెక్కడ? సుదూర ప్రయాణాల్లో డ్రైవర్లకు తగిన విశ్రాంతికి సమయం చిక్కకపోతే, అలసటకు లోనయితే కునుకుతీసే ప్రమాదం ఉంటుంది. రాత్రివేళ ప్రమాదాలకు ఇదొక కారణం. దానికితోడు బస్సు లోపల సర్వసాధారణంగా బెర్త్‌ల కోసం వాడే ఫైబర్, రెగ్జిన్, తెరల కోసం ఉపయోగించే పాలియెస్టర్, సిల్క్ వగైరాలు మండే స్వభావం ఉండేవి. చిన్న నిప్పురవ్వ చాలు... సెకన్ల వ్యవధిలో భగ్గున మండటానికి! నిప్పంటుకున్నప్పుడు కేబుళ్లు దగ్ధమై ఎమర్జెన్సీ డోర్‌లు సైతం మొరాయిస్తాయి. అదృష్టవశాత్తూ తెరుచుకునే సందర్భా లున్నా కనీసం 8,9 అడుగుల ఎత్తులో స్లీపర్‌లపై ఉన్నవారు వాటివద్దకు చేరుకోవటం అయ్యే పనేనా? అద్దాలైనా అంత సులభంగా బద్దలుకావు. ఇవన్నీ ముప్పును మరింత పెంచేవే. ఈ రకం బస్సుల సంక్లిష్ట నిర్మాణం వల్ల ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు బయటి వారు సాయపడాలన్నా అసాధ్యమే. రోడ్డు ప్రమాదాలు సహజంగా జరిగేవికాదని, మనుషుల తప్పిదాల వల్లా, నిర్లక్ష్యంవల్లా అవి చోటుచేసుకుంటాయని గతంలో ఫార్ములా వన్ ఛాంపియన్‌షిప్ గెలిచిన వ్యాపారి మారియో గాబ్రియెల్ అన్నారు. తాజా ప్రమాదం విషయంలో కూడా అది అక్షరాలా నిజం. స్లీపర్ బస్సులు సాధారణంగా ఏసీ సదుపాయంతో ఉంటాయి. సాధా రణ బస్సులతో పోలిస్తే ఈ బస్సుల్లో అధిక విద్యుత్ అవసరమవుతుంది. ఏసీని కనీసం 24 డిగ్రీల వద్ద ఉంచాలి. కానీ అంతకన్నా తగ్గిస్తే చల్లదనం పెరగొచ్చుగానీ దానివల్ల విద్యుత్ వినియోగం ఎక్కువవుతుంది. ఆ మేరకు కేబుళ్లపై ఒత్తిడి పెరిగి అవి త్వరగా వేడెక్కుతాయి. కంప్రెసర్ గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. దానికి మధ్యమధ్యలో విరామం ఇవ్వకపోతే పనితీరు దెబ్బతింటుంది. వీటన్నిటినీ ఎప్పటికప్పుడు తనిఖీ చేసు కుంటూ అవసరాన్నిబట్టి మారుస్తుండాలి. లేనట్టయితే షార్ట్ సర్క్యూట్‌కు దారితీస్తుంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు వీటిని నిశితంగా గమనిస్తున్నారా? ప్రమాదానికి లోనయిన బస్సు ఫిట్‌నెస్ బాగానే ఉందని రవాణా అధికారులు చెబుతున్నారు. అందులోని నిజానిజాల సంగతటుంచి అంతటి పెనువేగంతో వెళ్లేందుకు అనువుగా మన రోడ్లు ఉంటున్నాయా? అధిక వేగంతో పోయే వాహనాలను నడిపేవారి సామర్థ్యాన్ని కొలిచేందుకు విడిగా పరీక్షలుంటున్నాయా? ఎంతో చురుగ్గా ఉండేవారు చోదకులుగా ఉంటే క్లిష్ట సమయాల్లో తక్షణం స్పందించగలుగుతారు. లేనట్టయితే పెను ప్రమాదాలకు కారణమవుతారు. అసలు ఈ మాదిరి బస్సులపై రెండు దశాబ్దాల క్రితంనుంచే చైనా, జర్మనీ వంటి దేశాల్లో నిషేధం అమలవుతోంది. మన దేశం కూడా ఆ దిశగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైనట్టే ఉంది.



# సురక్షితంగా ఉండండి - అప్రమత్తతే మన భద్రత

**మొంథా తుఫానుతో.. రెడ్ అలర్ట్ - అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులు - అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశాలు**
**కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు సూచించారు. భారత వాతావరణ శాఖ సూచనల మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల క్షేమం కోసం ఈనెల 28,29 తేదీల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారని, తుఫాను ప్రభావాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లతోనూ, కృష్ణా జిల్లా కలెక్టర్ తోనూ మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని మంత్రి సుభాష్ అన్నారు.

### తుఫాను హెచ్చరికల నేపథ్యంలో

# అందరూ అప్రమత్తంగా ఉండాలి

**అధికారులంతా సమన్వయం చేసుకోవాలి : ఎంపీ హరీష్ బాలయోగి**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వాసులంతా అప్రమత్తంగా ఉండాలని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి కోరారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేసిందని తెలిపారు.అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసే విధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం, తీవ్రవాయుగుండంగా కేంద్రీకృతమైందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొందన్నారు. రాబోయే 24 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేశారన్నారు.కనుక విపత్తుల నిర్వహణ సంస్థ మరియు ప్రభుత్వ సూచనలు ప్రజలంతా పాటించాలన్నారు. ప్రస్తుతం కార్తీకమాసం సందర్భంగా విహార యాత్రలకు వెళ్లే అల్లవరం మండలం ఓడలరేవు, ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాం, కాట్రేనికోన మండలం తదితర ప్రాంతాల్లో సముద్రతీర ప్రాంతాలకు ప్రస్తుతం ఎవరూ వెళ్లవద్దని ఎంపీ హరీష్ కోరారు.

### ఘనంగా వైస్సార్సీపీ కో-ఆర్డినేటర్

# పినిపే శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు

**శ్రీకాంత్ పుట్టినరోజుకి ముఖ్య అతిథిగా బైరెడ్డి సిద్దార్థ రెడ్డి**




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైస్సార్సీపీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ పుట్టినరోజుకు హాజరైన రాష్ట్ర వైఎస్ఆర్సిపి యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, పినిపే విశ్వరూప్, చిర్ల జగ్గిరెడ్డి, బొమ్మి ఇజ్రాయిల్,కర్రీ పాపారాయుడు,పిల్లి సూర్య ప్రకాష్ రావు, దవులూరి దొరబాబు, జక్కంపూడి గణేష్, పితాని బాలకృష్ణ, పాముల రాజేశ్వరి దేవి, గన్నవరపు శ్రీనివాస్, ధర్మవరపు కృష్ణ, చైతన్య, చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు,ఇళ్ల శేష గిరి రావు, కొనుకు గౌతమీ, పందిరి శ్రీహరి, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి భరత్ భూషణం, గుత్తుల చిరంజీవి, ఉంద్రు వెంకటేష్, దొంగ నాగసుధా చిన్న, కొల్లటి దుర్గబ్బాయి, నాతి శ్రీనివాస్,పోగాకు శ్రీను, సరెళ్ల రామకృష్ణ, జాన గణేష్,వంగా గిరిజా కుమారి,కొనుకు బాపూజీ, పులుసుగంటి రాజేశ్వరి,తోరం గౌతమ్,దెంతులూరి రోహిత్ వర్మ, స్వర్ణ, రజని తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా పశువులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



**16 ఎద్దులు, 14 చిన్న దూడలను తరలిస్తున్న నిందితులు**
**పోలీసుల అదుపులో నిందితులు, వ్యాన్ సీజ్**
**పశువులను సామర్లకోట గోశాలకు తరలించిన పోలీసులు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో అర్ధరాత్రి అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వ్యాన్ ను సీజ్ చేసినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అక్టోబర్ 26 ఉదయం 01.30 గంటల సమయంలో రామచంద్రపురం పట్టణానికి చెందిన కొత్తూరు సంసేను, తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు కు చెందిన డ్రైవర్ వెట్రివేల్‌లు ఎన్ 66 ఎబి 8740 నెంబర్ గల ఐచర్ వ్యాన్ లో 16 ఎద్దులు, 14 చిన్న దూడలను జగ్గంపేట సంత నుండి రామచంద్రపురం కు, అక్కడ నుండి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తమిళనాడు కు చెందిన ఐచర్ వ్యాన్ వాహనాన్ని సీజ్ చేసి, వ్యాన్ లో ఉన్న 16ఎద్దులు,14 చిన్న దూడలను సామర్లకోట గోశాల కు తరలించినట్లు రాయవరం ఎస్సై సురేష్ బాబు తెలిపారు.

### 28న అమలాపురంలో

# ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

## కోనసీమ ప్రజలకు సేవలందించనున్న ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కార మార్గమని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్, జె.వి. సత్యనారాయణ మూర్తి అన్నారు. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ముస్లిం వీధి, శ్రీదేవి మార్కెట్, జై శ్రీరాం జంక్షన్ నందు బ్యాంకు 88వ నూతన శాఖను తేదీ 28-10-2025న ప్రారంభించనున్న సందర్భంగా సోమవారం బ్యాంకు ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జె.వి. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజంలో కోటీశ్వరుల జాబితా పెరుగుతుంటే.. మరో వైపు సామాన్యుల ఆర్థిక స్థితిగతులు రోజు రోజుకు దిగజారడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ఈ దేశంలో పేద, మధ్య తరగతి వర్గ ప్రజల ఆర్థిక అవసరాలకు సహకార అర్బన్ బ్యాంకులు బాసటగా నిలుస్తున్నాయన్నారు. విశాఖ నగరంలో 1916 ఫిబ్రవరి 6వ తేదీన కార్యకలాపాలు ప్రారంభించిన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ నేడు తెలుగు రాష్ట్రాల్లో 57 బ్రాంచ్‌ల ద్వారా బహుళ రాష్ట్రాల అర్బన్ బ్యాంకుగా ప్రజలకు సేవలు అందిస్తున్నదన్నారు. భారత దేశ సహకార చిత్రపటంలో నాన్ షెడ్యూల్డ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల్లో అతిపెద్దదిగా, సహకార సూత్రాలను త్రికరణశుద్ధిగా పాటిస్తూ ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. డిపాజిటర్లను సభ్యులుగా చేర్చడం ద్వారా బ్యాంకు పాలకవర్గం నిర్ణయాల్లో వారిని కూడా భాగస్వాములను చేస్తూ నూతన ఒరవడితో ముందుకు సాగుతున్నదన్నారు. వాణిజ్య బ్యాంకుల నుంచి ఎటువంటి తోడ్పాటు పొందలేని ప్రజలకు 'విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు' ప్రత్యామ్నాయ బ్యాంకుగా గుర్తింపు సాధించిందన్నారు. 2025 సెప్టెంబర్ నాటికి డిపాజిట్లు రూ.4,508.34 కోట్లు, రుణాలు రూ.3,561.63 కోట్లు కలిపి మొత్తం రూ.8,069.97 కోట్ల ఆర్థిక కార్యకపాలతో దేశంలోని 1,472 అర్బన్ సహకార బ్యాంకుల్లో గుజరాత్, మహారాష్ట్ర మినహా అతిపెద్ద సహకార బ్యాంకుగా ఆవిర్భవించిందన్నారు. దేశంలోని అర్బన్ బ్యాంకుల పనితీరును విశ్లేషిస్తూ 'అవుట్ బుక్ ఆన్ 'అర్బన్ బ్యాంక్స్' పేరుతో ప్రతి సంవత్సరం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) విడుదల చేసే నివేదిక ఈ సంవత్సరం ఏప్రియల్ 23వ తేదీన విడుదల చేయగా, దాని ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశంలో మొదటి 16. బ్యాంకుల్లో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు ఒకటిగా నిలిచిందన్నారు. 1,15,378 మంది సభ్యులు సమకూర్చిన రూ. 406 కోట్ల మూలధనంతో దేశంలోనే అర్బన్ బ్యాంకులలో మూడవ స్థానంలో ఉందని చెప్పారు. బ్యాంకునకు రూ.470.62 కోట్లు రిజర్వు నిధులు ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది మార్చి నాటికి రూ.71.77 కోట్ల నిరక లాభం ఆర్జించగా, సభ్యులకు 12 శాతం చొప్పున రూ.43.60 కోట్లను డివిడెండ్ రూపంలో చెల్లించినట్టు తెలిపారు. గత 43 ఏళ్ళుగా ఒక్క కరోనా ఏడాది 2019-20 ఆర్థిక సంవత్సరం మినహా (ఆర్బీఐ ఆదేశాల మేరకు) ప్రతి సంవత్సరం సభ్యులకు కనిష్టంగా 10% తగ్గకుండా డివిడెండ్ పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. బ్యాంకు పాలకవర్గం యొక్క నిబద్ధతను దృష్టిలో ఉంచుకొని, గడిచిన 42 సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతున్నాయని, అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగానే జరిగాయని, తెలిపారు. ఇప్పటి వరకు 15 సొంత భవనాలు కలిగిన విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో విశాఖలోని గాజువాక, గోపాలపట్నం, విజయవాడలో నూతన సొంత భవనాల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. 58వ బ్రాంచ్‌గా అమలాపురం శాఖను ప్రారంభించుకోవడంతో పాటు త్వరలో హైదరాబాద్, విశాఖపట్నంలలో నూతన శాఖలను ప్రారంభించడం ద్వారా బ్రాంచీల సంఖ్య 60కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు జె.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. అమలాపురం ప్రాంతంలో సహకార ఉద్యమ పురులను పటిష్టపరిచే ఉద్దేశ్యంతో బ్యాంకు అమలాపురం బ్రాంచ్ ద్వారా రానున్న ఐదేళ్ళలో రూ. 100 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భవిష్యత్లో అమలాపురం ప్రజల జీవన ప్రమాణాల మెరుగురల ఈ ప్రాంత అభివృద్ధిలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు తన వంతు పాత్ర నిర్వహిస్తుందని జె.వి. సత్యనారాయణమూర్తి వివరించారు.

**110 ఏళ్ళ ప్రస్థానంలో నాలుగు దశాబ్దాల్లో సరికొత్త ప్రగతి, విస్తరణ**

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు 110 ఏళ్ళ ప్రస్థానంలో గత నాలుగు దశాబ్దాల్లో సాదించిన ప్రగతి ప్రత్యేకంగా నిలుస్తున్నారు. 1983లో కార్మికోద్యమ నాయకులు, సామ్యవాది మానం అంజనేయులు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ గా ఎన్నికైన వేళ బ్యాంకు కార్యకలాపాలు కోటి రూపాయల లోపు ఉండేవన్నారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మూడు దశాబ్దాలపాటు 2013వ సంవత్సరం వరకు బ్యాంకు చైర్మన్గా అద్వితీయ సేవలు అందిస్తూ ప్రగతి బాటలు వేశారన్నారు. ఆ తర్వాత ఆయన మార్గదర్శకత్వంలో పాలకవర్గం సమిష్టి కృషితో నేడు ఈ స్థాయికి.. చేరిందన్నారు. 1984-85 ఆర్థిక సంవత్సరంలో రూ.2.91 కోట్ల కార్యకలాపాలతో ఉన్న బ్యాంకు నేడు రూ.8,000 కోట్లకు పైగా చేరిందని తెలిపారు. 3,361 మంది సభ్యులతో రూ.9 లక్షలు మాత్రమే షేర్ క్యాపిటల్ కలిగిన బ్యాంకు నేడు రూ. 1,15,378 మంది సభ్యులు, రూ.406 కోట్లతో దేశంలోనే ప్రత్యేక స్థానంలో నిలిచిందన్నారు.

**'సహకార' సంక్షేమానికి నూతన ఒరవడి**

నాటి వ్యవస్థాపకుల నుంచి నేటి పాలకవర్గం వరకు సహకార స్ఫూర్తితో నూతన ఆలోచనలతో ఈ సంస్థ పురోభివృద్ధికి బాటలు చేశారన్నారు. అంకిత భావం కలిగిన సిబ్బంది, నిజాయితీ కలిగిన సభ్యులు, ఖాతాదారులు ఈ సంస్థ పురోభివృద్ధిలో మూల స్తంభాలుగా నిలిచారని చెప్పాడు. సహకార సంస్థకు నిజమైన యజమానులైన సభ్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్బన్ రాంగ్ రంగంలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. పలు రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పాడు.

**సంక్షేమ పథకాలు**

(1) వైద్య ఖర్చులు తిరిగి చెల్లింపు పథకం (2).మరణించిన సభ్యుల కుటుంబాలకు వారి షేరుధనానికి సమానంగా కనిష్టంగా రూ.5 వేలు, గరిష్టంగా రూ. లక్ష వరకు ఉచిత జీవిత బీమా సౌకర్యం(షరతులకు లోబడి)

(3)ప్రమాదంలో మరణించిన సభ్యుల కుటుంబానికి రూ.50 వేలు అదనపు చెల్లింపు

(4 )సభ్యుల పిల్లలకు విద్యా ప్రతిభా పురస్కారాలు: సభ్యుల కుటుంబాల్లోని ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేలా ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ ఎంట్రన్స్ టెస్టుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి ప్రతి సంవత్సరం విద్యా ప్రతిభా పురస్కారాలు' అందిస్తున్నామన్నారు. టెన్త్ విద్యార్థికి రూ.5 వేలు, ఇంటర్కు రూ.7,500, ఎంసెట్, ఐఐటీ, నీట్ ర్యాంకర్స్ కు రూ. 10 వేలు అందిస్తూ సహకార రంగం ద్వారా తన సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నదని తెలిపారు. ఈ పథకాల ద్వారా 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి గడచిన 10 సంవత్సరాలలో 20,054 మందికి రూ.39,77 కోట్లు చెల్లించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.5.92 కోట్లను సభ్యుల సంక్షేమానికి వినియోగించినట్లు వివరించారు. అంతర్జాతీయ సహకార సంవత్సర స్ఫూర్తిని చాటుదాం, సహకార వ్యవస్థ బలోపేతంతో సమాజ పురోభివృద్ధి సాధిస్తుందన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2025వ సంవత్సరాన్ని రెండవ సారి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని జె.వి. సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 30. లక్షల సహకార సంస్థల్లో 100 కోట్ల మంది సభ్యులుగా తమ జీవన ప్రమాణాల మెరుగుదలకు సమిష్టిగా కృషి చేస్తూన్నారని. రాఘవేంద్రరావు తెలిపారు. ప్రపంచ మానవాళిలో 12 శాతం మంది ప్రజలు సహకార సంస్థల్లో సభ్యులుగా కొనసాగుతున్నట్టు చెప్పారు. వీటిలోని 300 అతి పెద్ద సహకార సంస్థలు రూ.208 లక్షల కోట్ల టర్నోవర్తో 28 కోట్ల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సంపద సృష్టిలో సహకార సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. అంతర్జాతీయ సాధనలో భాగంగా సహకార వ్యవస్థపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ది విశాఖపట్నం కోపరేటి బ్యాంక్ ఏడాది అంతా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వివిధ ప్రాంతాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, మేధావులతోపాటు వివర వర్గాల ప్రజలతో సదస్సులు, సభలు, ర్యాలీలు, విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడం ద్వారా సహకార వ్యవస్థ ప్రాధాన్యతను తెలియజేయాలని నిర్ణయించినట్టు సత్యనారాయణమూర్తి చెప్పారు.ఈ సమావేశంలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు, సీఈవో వి.వి.టి. వరలక్ష్మి, కాకినాడ జోనల్ మేనేజర్ టి.ఆర్. ఠాగూర్, బ్రాంచ్ మేనేజర్ శాంతికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

### కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం నందు

# కంట్రోల్ రూమ్

**ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే బండారు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మార్పుచెందింది. నేడు, రేపు తుపానుగా మారి మంగళవారం రాత్రి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉండటంతో కొత్తపేట నియోజకవర్గ అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తుఫాన్ తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులుతో పాటు రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి మరీ ముఖ్యంగా విద్యుత్ శాఖ వినియోగదారులు, రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు వారికి తగిన సమాచారం అందించాలి. ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. విద్యుత్ శాఖకు సంబంధించి జిల్లాలో అమలాపురం, రామచంద్రపురంలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు.ప్రభుత్వ అధికారులు సూచనలు పాటించాల్సిందిగా కోరుచున్నాను.కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం నందు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 08855-244299, 8500238258 నెంబర్లను సంప్రదించ వచ్చు అని తెలియజేశారు.

# మండల వ్యాప్తంగా పునరావాస కేంద్రాల ఏర్పాటు

**తీవ్ర తుఫాను దృష్ట్యా పలు జాగ్రత్తలు తప్పనిసరి - సచివాలయ అధికారుల పర్యవేక్షణలో 35 పునరావాస కేంద్రాలు**
**రెవెన్యూ, సివిల్ సప్లయ్, పంచాయతీ రాజ్ శాఖల సంయుక్త నిర్వహణ - రాయవరం మండల తహశీల్దార్ భాస్కర్**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండల వ్యాప్తంగా మంథా తుఫాను ప్రభావం దృష్ట్యా, తీవ్ర తుఫాన్ గా మారిందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా 35 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాయవరం మండల తహసిల్దార్ భాస్కరరావు తెలిపారు. తీవ్ర తుఫాను ప్రభావం వలన బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు సూచనలు హెచ్చరికలను ఆయన చేశారు. పాడుబడిన పెంకుటిల్లు, పూరిపాకల లో నివాసం ఉండేవారు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్ణయించిన పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. తమ ప్రాంతంలో పరిస్థితులను సమీక్షిస్తూ, బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంలో ప్రభుత్వానికి సహకరించాలని స్థానిక యువతను ఎమ్మార్వో భాస్కర్ కోరారు. ముఖ్యంగా నెలలు నిండిన గర్భిణీ స్త్రీలు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని, తుఫాను ప్రభావం పెరిగాక ఇబ్బంది ఏర్పడవచ్చని ఆయన సూచించారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు వృద్ధులు నిత్యవసర వైద్య పరికరాలను, మందులను ముందుగానే సమకూర్చుకోవాలని హెచ్చరించారు. రాయవరం మండల వ్యాప్తంగా చెల్లూరు గ్రామంలో 10, వెంటూరు గ్రామంలో 7, పసలపూడి గ్రామంలో 4, మాచవరం గ్రామంలో 4, సోమేశ్వరం గ్రామంలో 3, నదురుబాధ, కూర్మాపురం, లొల్ల,కురకాలపల్లి, రాయవరం, వెదురుపాక, వి.సావరం గ్రామాలలో ఒక్కొక్క పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా విద్యాశాఖాధికారులు అన్ని పాఠశాలలకు బుధవారం వరకూ, సెలవులు ప్రకటించడంతో మండల వ్యాప్తంగా 25 పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పునరావాస కేంద్రం వద్ద ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకూ, మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 నుండి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టులుగా సచివాలయ ఉద్యోగులు, విధులు నిర్వహిస్తారని అత్యవసర వైద్య నిమిత్తం ఏఎన్ఎం లు అందుబాటులో ఉంటారని తెలిపారు. పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వారికి ప్రభుత్వమే ఆహారాన్ని అందిస్తుందని ఈ ఏర్పాట్లను రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నట్లు రాయవరం మండల తహశీల్దార్ భాస్కర్ రావు తెలిపారు.

# కార్తీకమాస వేడుకలను విజయవంతం చెయ్యాలి

## రత్నగిరి ముఖద్వారం ఆకర్షణీయంగా ఉండాలి - బుక్కింగు వద్ద దళారులను నియంత్రించాలి
## రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ - దేవస్థానం పారిశుద్ధ్యంపై కమిషనర్ అసహనం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నవరం రత్నగిరి శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నవంబర్ 20 గురువారం వరకు నిర్వహించే కార్తీకమాస వేడుకలను దేవస్థానం అన్ని శాఖల సిబ్బందీ సమిష్టి సమన్వయ సహకారంతో విజయవంతంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్ ఆదేశించారు. కార్తీకమాసం నేపథ్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం రత్నగిరిని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవస్థానం వివిధ విభాగాల్లో కలియదిరిగి, కార్తీక మాస ఉత్సవం ఏర్పాట్లను, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన ఆసాంతం క్షుణ్ణంగా పరిశీలించారు. కార్తీకమాస ఉత్సవాల ఏర్పాట్ల సన్నాహాలపై సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ రాజా ఐవి రోహిత్, ఇఓ వీర్ల సుబ్బారావు, అందరు ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అధికార్లతో కమాండ్ కంట్రోల్ సిస్టం ప్రాంతంలో సమీక్షా సమన్వయ సమావేశాన్ని కమిషనర్ రామచంద్రమోహన్ నిర్వహించారు. కార్తీక మాసం ఏర్పాట్లను చాలా పకడ్బందీగా చేపట్టాలని, భక్తులకు ఎక్కడా ఏవిధమైన అసౌకర్యం కలుగకూడదని ఆదేశించారు. శని, ఆది,సోమ, దశమి, ఏకాదశి, పౌర్ణమి, తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ వంటి ముఖ్యమైన రోజుల్లో అన్ని విభాగాల అధికారులు అందరూ సమన్వయంతో సమిష్టి కృషి చేసి కార్తీకమాసాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. పర్వదినాల్లో అర్ధరాత్రి ఒంటి గంట నుండి వ్రతాలు, దర్శనాలు ప్రారంభించాలనీ, దర్శనం వరుసల్లో భక్తులు ఎక్కువ సమయం నిరీక్షించకుండా త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయాలనీ ఆదేశించారు. ఇక్కడ వృద్ధులు, పిల్లలకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కత్తుల పొట్లాలను అందించాలని సూచించారు. సేవా సిబ్బంది సేవలు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. వచ్చే నెల 5వ తేదీన జరిగే గిరిప్రదక్షిణ రోజున ఉదయం 8 గంటల నుండి పల్లకీ సేవ ద్వారా, మద్యాహ్నం 2 గంటల నుండి సత్యరథం ద్వారా భక్తులు రెండు విడతలుగా గిరిప్రదక్షిణ చేయవచ్చని, రద్దీ దృష్ట్యా రెండు విడతల ప్రణాళిక ద్వారా గిరిప్రదక్షిణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగదు అన్నారు.

**రత్నగిరి ముఖద్వారం ఆకర్షణీయంగా ఉండాలి...**

ఈ సమీక్షా సమావేశానికి ముందు ఆయన పలు విభాగాలను క్షణ్ణంగా పరిశీలించారు. ఎప్పటి కప్పుడు ఎక్కడికక్కడ పలు సూచనలను, ఆదేశాలను జారీ చేశారు. రత్నగిరి ముఖద్వారాన్ని భక్తులకు, చూపరులకు ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా అలంకరించాలని కమిషనర్ ఆదేశించారు. కొండ దిగువ జూనియర్ కళాశాల మైదాన ప్రాంతాన్ని, డార్మెంటరీలు, టూరిస్ట్ బస్సుల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కళాశాల మైదానంలో బస్సుల పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చెయ్యాలి అన్నారు. కొండపైకి వెళ్ళే టోల్ గేట్ ప్రారంభం నుండే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేలా రోడ్డుకి ఇరువైపులా తుప్పలు తొలగించి, పచ్చదనాన్ని పరిరక్షించాలి అన్నారు.

**కొత్త మెట్ల మార్గం, రత్నగిరి, సత్యగిరి పరిశీలన...**

కొండపైకి వచ్చే టోల్ గేటు ప్రాంతం నుండి రత్నగిరిపై గల సెంటినరీ కాటేజ్ సత్రాల సముదాయం వరకూ సుమారు రూ. 90 లక్షలతో నిర్మిస్తున్న నూతన మెట్ల మార్గాన్ని రామచంద్ర మోహన్ పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో త్వరగా భక్తులకు ఈ మార్గాన్ని సిద్ధం చెయ్యాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రత్నగిరి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం, ప్రకాష్ సదన్, సీతారామసత్రం పార్క్ ప్రాంతాలను, సత్యగిరి హరిహరసదన్, విష్ణుసదన్ సత్రం ప్రాంతాలను పరిశీలించి చుట్టూ పెరిగిపోయిన తుప్పలను తొలగించి, అక్కడ డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని శానిటరీ అధికారులను ఆదేశించారు.

**పారిశుధ్యంపై అసహనం ...**

కొండ దిగువ నుండి రత్నగిరి, సత్యగిరి ప్రాంతాల్లో పర్యటించిన ప్రతీచోటా కమిషనర్ శానిటేషనుపై అసహనం వ్యక్తం చేసారు. రోడ్ల కిరువైపులా బ్లీచింగ్ చల్లక పోవడం, పలు చోట్ల తుప్పలు తొలగించక పోవడం ప్రతీ సత్రాలు, డార్మెంటరీ మరుగుదొడ్ల వద్ద డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం గమనించిన కమిషనర్ శానిటరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు.

**దళారులను దరి చేరనీయొద్దు ....**

రత్నగిరి, సత్యగిరి సత్రాల గదులను అద్దెకిచ్చే సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం వద్ద కమిషనర్ ఎక్కువ సమయం గడిపారు. ఇటీవల దళారుల వల్ల మోసపోయిన భక్తుల నుండి ఫిర్యాదులు రావడంతో ఈ ప్రాంతం వద్దకు దళారులను ధరి చేరనీయొద్దని ఇఓను ఆదేశించారు. దళారులపై ఇప్పటికే పోలీసు ఘ పెట్టినట్లు కమిషనర్ కు ఇఓ వీర్ల సుబ్బారావు వివరించారు. సిఆర్వో భవంతిని ఆదునీకరించాలని ఇంజనీరింగ్ అధికారులకు కమీషనర్ సూచించారు. ఇక్కడ భద్రతా సబ్బందిని కట్టుదిట్టం చెయ్యాలనీ సెక్యూరిటీ ఆఫీసరును ఆదేశించారు.

**ఆలయ ప్రాకారం చుట్టూ ప్రత్యేక సౌకర్యాలు ...**

స్వామివారి ఆలయ ప్రాకారం చుట్టూ పరిశీలించిన కమిషనర్ ఇక్కడ ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చెయ్యాలని ఇఓకు సూచించారు. ప్రాకారం చుట్టూ పచ్చదనం పరిమళించాలని, రంగు రంగుల రంగవల్లులు ఉండాలని, భక్తులకు ఎల్లప్పుడూ త్రాగు నీరు అందుబాటులో ఉండాలనీ, దర్శనం, వ్రతం వరుసల్లో భక్తులకు కూడా త్రాగునీటి కొరత రాకూడదని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీర్ల సుబ్బారావు, చైర్మన్ రాజా ఐవి రోహిత్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# యాళ్ల జగదీష్ దంపతులు ప్రత్యేక పూజలు



**ప్రత్తిపాడు, విశ్వం వాయస్ న్యూస్ :** ఈయన అంటే ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెలియని వారు ఉండరు. స్వర్గీయ డాక్టర్.వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ఆత్మ ఎవరంటే కేవీపీ రామచంద్ర రావు అని టక్కున ఎలా గుర్తుకొస్తాదో. ఆలాగే ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే కాదు కాకినాడ జిల్లా లోనే దివంగత నేత,వరుపుల రాజా ఆత్మ ఎవరంటే టక్కున గుర్తుకు వచ్చే ఏకైక పేరు.యాళ్ళ జగదీశ్. 20 ఏళ్లుగా రాజా రాజకీయ ప్రస్థానంలో ఆయన వెన్నంటే ఉండి ముఖ్య అనుచరుడుగా రాజా కి ఆత్మ బంధువుగా పేరు తెచ్చుకున్నారాయన. ప్రత్తిపాడు నియోజకవర్గ సి.బి.యన్.ఆర్మీ.కో ఆర్డినేటర్,నియోజకవర్గ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ యాళ్ల జగదీష్, నియోజకవర్గ ప్రజలు ఎంతో సుఖశాంతులతో ఉండాలని కోరుతూ ఆదివారం ప్రత్తిపాడు లోని తన స్వగృహములో శ్రీ లక్ష్మీ గణపతి హెూమం,రుద్ర హెూమం,చండీ హెూమంతో పాటు నవగ్రహ హెూమం,సుదర్శన హెూమం,మహా మృత్యుంజయ హెూమం వంటి అనేక పవిత్ర యజ్ఞాలు వేద పండితులతో మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన యాళ్ల జగదీష్ దంపతులు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో పాటు పాల్గొన్న పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు. కార్యకర్తలు ఆయన అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో ఫేక్ ఎరుకుల సర్టిఫికెట్స్‌ను రద్దు చేయాలి

## నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మానుపాటి అంజిబాబు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మానుపాటి అంజిబాబు విలేకరులకు తెలియజేస్తూ తూర్పు గోదావరి జిల్లాలో ఫేక్ ఎరుకుల క్యాస్ట్ సర్టిఫికెట్ల ద్వారా కొందరు (బిసి - ఏ) సామాజిక వర్గానికి చెందిన కొందరు ఎరుకుల అని క్యాస్ట్ సర్టిఫికెట్లు సంపాదించి అసలైన ఎరుకుల కులానికి చెందిన ఎస్టీ వారికి రావలసిన ఉద్యోగాలను లాక్కుంటున్నారని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్,రెవిన్యూ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన వారికి పూర్తిస్థాయి న్యాయం చేయాలని కోరుతున్నానని అంజి బాబు అన్నారు. కొన్ని మండలాల్లో కొందరు అధికారులు వేరే సామాజిక వర్గాలకు చెందిన వారికి డబ్బులకు ఆశపడి ఎరుకుల ఎస్టీ అని నకిలీ క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్టుగా పలు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. అలాంటి వారినందర్నీ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పు శ్రీనివాస్,తిమ్మశెట్టి నాగేశ్వరరావుల ప్రోత్సాహంతో కనిపెట్టి నకిలీ క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిని విధుల నుంచి తొలగించేందుకు పోరాటం చేస్తామని అన్నారు. ఇటీవల కాలంలో విజయవాడ



నందు ఎరుకుల సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందంటూ ఫేక్ ఎరుకుల కాస్ట్ సర్టిఫికెట్ల సమావేశం జరిగిందని ఆ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నాయకులు పాల్గొన్నారని ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర నాయకులు ఎరుకుల సామాజిక వర్గానికి న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన వారికి మాత్రమే ప్రత్యేకంగా క్యాస్ట్ సర్టిఫికెట్లు అందించాలని కోరుతున్నానని అంజిబాబు అన్నారు. అసలైన ఎరుకుల సామాజిక వర్గానికి రావలసిన రిజర్వేషన్లు అన్యాక్యాంతం అవుతున్నాయని అంజిబాబు ఆవేదన వవ్యక్తం చేశారు.మా సామాజిక వర్గానికి అన్యాయం జరగకుండా రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి,ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి మాకు ఎలాంటి అన్యాయం జరగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. తప్పుడు సమాచారం ఆధారంగా లేదా తప్పుడు క్యాస్ట్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను పొందితే వారిని ఉద్యోగాల్లో కొనసాగించకూడదనేది ప్రస్తుతం ఉన్న నిబంధనలు చెబుతున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్టీ రిజర్వేషన్ల సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలను పొందినవారు ఎవరెవరున్నారు వారు సమర్పించిన సర్టిఫికెట్లు సక్రమమేనా అనే కోణంలో ఆరాతీయాలని కోరుతున్నానని అన్నారు. పల్లీలు అమ్మినంత ఈజీగా ఫేక్ సర్టిఫికెట్ల దందా సాగుతోందని అలాంటి ముఠా భరతం పట్టాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నానని అంజిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ మానుపాటి సూర్యనారాయణ,మాదగాని నాగేశ్వరరావు,కూతాడి పీరుగాని పోసియ్య,కూతాటి శ్రీను,మాదగాని నాగేశ్వరరావు రావు తదితరులు పాల్గొన్నారని అన్నారు.

# మొంథా తుఫానుకు అప్రమత్తంగా ఉండండి

## ప్రజల భద్రత, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం : ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా జిల్లాల్లో హై అలర్ట్‌ను ప్రభుత్వం ప్రకటించింది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 27, 28, 29 తేదీల్లో తుఫాన్ తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. గంటకు 80 నుండి 100 కిలో మీటర్ల కవేగంతో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. వసతి గృహాల్లోని విద్యార్థులను సురక్షితంగా వారి ఇళ్లకు తరలించేందుకు విద్యా శాఖ, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా, అవసరమైతే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో లేదా సురక్షిత శిబిరాల్లో తాత్కాలికంగా నివసించాలని ప్రభుత్వం సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో పాడుబడిన ఇండ్లు పడిపోయే అవకాశం ఉంది. అందువల్ల అలాంటి కుటుంబాలు తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులకు సూచనలు చేసామని ఎమ్మెల్యే వివరించారు. విద్యుత్తు శాఖ సమాచారం ప్రకారం, తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరా 3 నుండి 4 రోజులు అంతరాయం కలగవచ్చని అంచనా. కాబట్టి ప్రజలు త్రాగునీరు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు ముందుగానే నిల్వ చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేసారు. బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ తీగల దగ్గరకి ప్రజలు వెళ్లకూడదని ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. రైతులు తమ పంటలను, ఎరువులు, విత్తనాలను తుఫాన్ కారణంగా నష్టపోకుండా సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు తీసుకోవాలి. నియోజవర్గ అధికారులకు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, రెవెన్యూ అధికారులకు నేనుద్ధ ఆదేశాలు జారీ చేసాను. అందువల్ల వారంతా తుఫాన్ నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. నియోజకవర్గ ప్రజల భద్రత, ఆరోగ్యం మాకు అత్యంత ప్రాధాన్యం. ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకొని, భద్రతా చర్యలు పాటించాలని కోరుచున్నాను. ప్రజలకు ఏ అవసరం వచ్చిన కూటమి శ్రేణులు, తెలుగు దేశం పార్టీ కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఎలాంటి సమాచారం, సహాయం కోసమైనా 90006 98569, 9658585566 నంబర్లకు ఫోన్ చేయాలని శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆ ప్రకటనలో కోరారు.

## గంటా సత్యనారాయణ 6వ వర్ధంతి సందర్భంగా

# నివాళులర్పించిన కుటుంబ సభ్యులు



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలం లంపకలోవలో మాజీ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్ ఆధ్వర్యంలో స్వర్గీయ గంటా సత్యనారాయణ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంపకలోవ సర్పంచిగా 2 పర్యాయాలు, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడిగా 3 పర్యాయాలు పనిచేసి గ్రామ అభివృద్ధికి, రైతుల అభివృద్ధికి ఎనలేని కృషిచేసి, ప్రజా నాయకుడిగా పేరుపొంది, ఉత్తమ సేవలు అందించిన దివంగత నేత గంటా సత్యనారాయణ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో దివంగత నేత గంటా సత్యనారాయణ కుటుంబ సభ్యులు గంటా మహాలక్ష్మిరావు, గంటా రాంబాబు, గంటా శ్రీను, గంటా గంగబాబుతో పాటు పలువురు అభిమానులు పాల్గొని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించి స్మరించుకున్నారు.

# ధారపల్లి, తోటపల్లి జలపాతాల మూసివేత ...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా యాత్రా స్థలాల సందర్శకులకు కూడా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు ఉత్తర్వుల మేరకు అటవీశాఖ పరిధిలోని యాత్రా స్థలాల సందర్శనంపై కూడా తాత్కాలిక నిషేధం విధించారు. ప్రత్తిపాడు మండలంలోని వెంకటనగరం గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో తోటపల్లి గ్రామం శివారున కొండల మాటున తోటపల్లి జలపాతం ఉంది. ఈ జలపాత ప్రదేశం ధారా మల్లికార్జునస్వామిగా శివలింగం జలపాతాలను అభిషేకిస్తూ ప్రసిద్ధి పొందింది. కార్తీక మాసం మహాశివరాత్రి పర్వదినాలతోపాటు వేసవిలో కూడా ఈ ప్రదేశం జనసందోహంగా కళకళలాడుతూ ఉంటుంది. వన సమారాధనల పేరుతో నిత్యం ఇక్కడ అన్నసంతర్పణలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఇక రెండవదిగా ఇదే మండలంలో పెద్దిపాలెం గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ధారపల్లి జలపాతం ఉంది. ప్రత్తిపాడు మండల కేంద్రానికి ఈ జలపాతం 25 కిలోమీటర్లు ఉంటుంది. బురదకోట కొండల్లోంచి ఈ జలపాతం ప్రవహిస్తూ ధారపల్లివద్ద ఎత్తయిన కొండల నుంచి జాలువారుతుంది. ఈ జాలువారే ప్రదేశంవద్ద జలక్రీడలు ఆడేందుకు సందర్శకులు, పర్యాటకులు ఎంతో ఉత్సాహం కనబరుస్తారు. మండు వేసవిలోను కూడా ఈ జలపాతం ప్రవహిస్తూ ఉంటుంది. ఇటీ వల కార్తీకమాసంలో ఈ జలపాతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలు మూలల నుంచి సందర్శకులు తరలివచ్చారు. ఇక్కడి కొండల మాటున సందర్శకులకోసం చిన్నపాటి కుటీరాలు మాదిరిగా దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో స్నానాలు ఆచరించి ఇష్టదేవతలను పూజిస్తూ పర్యాటకులు ప్రకృతి ఒడిలో సేదతీరు తున్నారు. కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు ఉత్తర్వుల మేరకు ఈ రెండు జలపాతాల సందర్శనంపై తాత్కాలిక నిషేధం విధించినట్టు ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గారామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జలపాతాల దారులను 27 నుండి 29 తేదీ వరకూ తాత్కాలికంగా మూసివేశామని, పర్యాటకుల భద్రతా కారణాల రీత్యా ఇక్కడకు పర్యటనలను అనుమతించమని రేంజర్ స్పష్టం చేశారు. ఈ రెండు చోట్లా ప్రభుత్వ నిషేధానికి పర్యాటకులు సహకరించాలని ఈ ప్రకటనలో పర్యాటకులకు ముందస్తు సూచనగా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గారామ్ ప్రకటించారు.



## రాజమండ్రి కార్పొరేట్ కప్ 2025 - సీజన్ 3

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

### శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి - ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్, నగర ప్రముఖులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహద పడతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమండ్రి జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న క్రికెట్ గ్రౌండ్స్ లో టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజమండ్రి కార్పొరేట్ కప్ 2025 - సీజన్ 3 టోర్నమెంట్ ను మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి కార్పొరేట్ కప్ సీజన్ 3 టోర్నమెంట్ ను బాలాజీ వారి మిత్ర బృందం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని అన్నారు. కొన్ని సంస్థ పెద్ద పెద్ద టోర్నమెంట్లు నిర్వహించి కనుమరుగవుతాయి అయితే బాలాజీ ప్రతి ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి నిలువెత్తు నిదర్శనం జిల్లా ఏ. ఎస్.పి చెంచు రామయ్య అని కొనియాడారు. ప్రతి ఒక్కరితో ఆయన స్నేహభావంతో మెలుగుతారని వివరించారు. ప్రముఖ సినీ ప్రొడ్యూసర్, సోనస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో జేమ్స్ వాట్స్ కొమ్ము టోర్నమెంట్ కు స్పాన్సర్ చేయడం సంతోషదాయకమని అన్నారు. రాజమహేంద్రవరానికి క్రీడలతో ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించారని వారిలో సుంకర స్వామి నాయుడు, పోతుల వీరభద్రరావు, చాముండేశ్వరి నాథ్ తదితర క్రీడాకారులు రాణించారని అన్నారు. క్రికెట్ సెలక్టర్ ఎం.వి ప్రసాద్ రాజమండ్రిలో జరిగిన క్రీడలలో పాల్గొన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు . రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ నియోజకవర్గం కు ఒక స్టేడియం నిర్మించాలని సంకల్పంతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న బాలాజీ ఆయన మిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టోర్నమెంట్ స్పాన్సర్ ప్రముఖ సినిమా ప్రొడ్యూసర్, సోనస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో జేమ్స్ వాట్స్ కొమ్ము మాట్లాడుతూ తన అభిమాన నాయకుడు మంత్రి కందుల దుర్గేష్ అని తెలిపారు. ఆయన వాక్ చాతుర్యంతో ఉన్నత స్థాయి కి ఎదుగుతారని 6 సంవత్సరాల క్రితమే గుర్తించానని పేర్కొన్నారు. ప్రస్తుతం టూరిజం శాఖ మంత్రిగా ఆయన ఉన్నత స్థాయికి చేరుకున్నారని వివరించారు. ఈ టోర్నమెంట్ లో డాక్టర్స్ టీమ్, రాజకీయ నాయకులు టీములు లేకపోవడం వెలితిగా ఉందని వచ్చే టోర్నమెంట్లో రాజకీయ నాయకులు, డాక్టర్స్, విలేకరుల తో టీమ్ లు ఏర్పాటు చేసి టోర్నమెంట్ నిర్వహించాలని సూచించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ శతవసంతాలు కొనసాగించాలని మంత్రి ఆకాంక్షించారు. టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు కందుల దుర్గేష్ బిజీ షెడ్యూల్లు లో కూడా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో జరుగుతాయని, గత ఏడాది 8 టీములు పాల్గొంటే, ఈ ఏడాది 15 టీములు పాల్గొంటున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ చెంచు రెడ్డి,జనసేన నగర అధ్యక్షులు వై.శ్రీనివాస్, గురునాథం,డాక్టర్ కృష్ణ తేజ,సాయి, కొండవీటి ప్రభాకర్,జామి సత్య నారాయణ,బాలాజీ, సాయి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల్లో ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేయాలి : జీవి హర్ష కుమార్

### పార్టీలకు అతీతంగా దళితులంతా ఏకం కావాలి - దళిత వాడల్లో హిందూ దేవాలయాలా..?



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మండలంలోని గాడాలలో దళితుడిపై అగ్ర కులాల దాడి కేసులు నలుగురిని మాత్రమే అరెస్టు చేశారని మిగిలిన ఐదుగురిని తక్షణమే అరెస్టు చేయాలని లేకుంటే మూడు రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు జీవి హర్ష కుమార్ ప్రభుత్వాన్ని పోలీసులను తీవ్రంగా హెచ్చరించారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజానగరం నియోజకవర్గ మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం, రాజానగరం నియోజకవర్గం దళితులు పాముల శ్రీనుకు సంఘీభావం తెలుపుతూ, తదుపరి కార్యాచరణ నిమిత్తం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హర్ష కుమార్, నక్క డొక్కా రాంబాబు, పిట్ట కృష్ణ, జీవి శ్రీరాజ్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హర్ష కుమార్ మాట్లాడుతూ గత వైసిపి, నేటి ఎన్డీఏ పాలనలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. దళితులంతా పార్టీలకు అతీతంగా ఏకం కాకపోతే భవిష్యత్తులో దళితులకు అంధకారం తప్పదన్నారు. గాడాలలో అగ్రకులాల వ్యక్తులు దళితున్ని స్తంభానికి కట్టి, విచక్షణ రహితంగా కొట్టడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. పోలీసులు మిగిలిన ఐదుగురు నిందితులను మూడు రోజుల్లో అరెస్టు చేయకపోతే, కార్యాచరణ చేపట్టి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని పోలీసుల్ని, ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. టీవీ ఫైవ్, ఏబీఎన్ చానల్లో దళితులపై దాడులను ఎందుకు చూపించలేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత వాడల్లో హిందూ దేవాలయాల నిర్మాణాన్ని తప్పుపడుతూ, దళితవాడలో నిర్మాణానికి అధికారము ఎవరిచ్చారని ప్రశ్నించారు? అనంతరం కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించి, హర్ష ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నక్కా రాంబాబు, పిట్ట కృష్ణ, గొల్లవిల్లి ప్రవీణ్, పండా అబ్బులు, గొంతు లక్ష్మణ్, గుల్ల ఏడుకొండలు, వరసాల ప్రసాద్, దాసి వెంకటరావు, జువ్వల రాంబాబు, కోరుకొండ చిరంజీవి, బండి రాముడు, గుర్రాల జోత్స్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 16న దేవాంగ సంఘీయుల కార్తీక వనసమారాధన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవాంగ సంఘీయుల కార్తీక వనసమారాధన నవంబర్16వ తేదీన నిర్వహిస్తున్నట్లు రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రొబ్బి విజయ శేఖర్,కాలెపు సత్యనారాయణ లు అన్నారు. ఆదివారం రాజమండ్రి జాంపేట శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు రొబ్బి విజయ శేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా కార్తీకవనసమారాధన వన భోజనాల గురించి చర్చించి నవంబర్ 16వ తేదీన బ్రెస్ట్ ఫ్రైస్ పక్కన ఉన్న చెరుకూరి వారి తోటలో కార్తీకవనసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణ మూర్తి, గంపా సోమ లింగేశ్వరరావు, కొమ్మన వెంకటేశ్వరరావు, కాలెపు రామచంద్రరావు, బత్తుల రాజేశ్వరరావు, అల్లంకి సాంబ, బళ్ళా సత్యనారాయణ, ద్వారా పార్వతి సుందరి, బీరా శ్యామలరావు, బళ్ళా శ్రీనివాసరావు, పూర్ణిమ ప్రసాద్, ముప్పన శ్రీనివాస్, గుమ్మడి రాజారావు, మయూరి శ్రీనివాస్, పిచ్చిక అనిల్ కుమార్, గంపా గిరి, నల్లా శంకరరావు, చప్పటి సత్యనారాయణ, మావూరి బాబూరావు, ఆశపు మల్లిబాబు, మోరా వీరభద్రరావు, బీరా పద్మనాభరావు, అల్లంకి మణికంఠ, బొమ్మన గౌరి, బళ్ళా వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మనసున్న మంచి నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్

### అనుశ్రీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి జన్మదిన వేడుకలు
### కేకు కట్ చేసి ఆదిరెడ్డికి పలువురు జనసైనికులు శుభాకాంక్షలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగర జనసేన పార్టీ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజమండ్రి సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డికి నగర జనసేన పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాబోయే రోజుల్లో ఉన్నతమైన పదవి పొందాలని మేమంతా ఆకాంక్షిస్తున్నామని అన్నారు. అనుశ్రీ వెంట చైర్మన్లు, డైరెక్టర్స్, వీర మహిళలు, అభిమానులు, నగర జనసేన పార్టీ నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐవిఫ్ ఏపి యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస శివకుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐ.వి.ఫ్) ఆంధ్రప్రదేశ్ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజమండ్రికి చెందిన రొటేరియన్ పద్మనాభుని శ్రీనివాస శివకుమార్‌ని నియమించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోన శ్రీనివాస్ ప్రతిష్టత్మకమైన ఆర్గనైజషన్‌లో నన్ను గుర్తించి నాకు ఈ పదవి లభించడం చాలా గర్వకారణం, ఆర్య వైశ్య సంఘం అభ్యున్నతికి ఐ.వి.ఫ్ ద్వారా తనవంతు సేవ చేసే అవకాశం కలిపించినదుకు డాక్టర్ కోన శ్రీనివాస్‌కి, గోంట్ల మోహనరావు, చైర్మన్ అడ్వైసర్ బోర్డు సెంట్రల్ బోర్డు సభ్యులు గంజి రాజమౌళి గుప్తా, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త నా ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నాను. ఐ.వి.ఫ్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, కెనడా, జపాన్, దుబాయ్, సింగపూర్ మరియు థాయిలాండ్ వంటి దేశాలలో తమ సేవలను విస్తరించి ఉంది. ప్రస్తుతం శివకుమార్ క్రియేటివ్ ఈవెంట్స్ ఆర్గనైజషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లో ఆటో ఎక్సపో, ఫుడ్ ఇండస్ట్రీ, ఫర్నిచర్ ఎక్సపో, ఎడ్యుకేషన్ ఫెయిర్ సోలార్ లాంటి పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. శివకుమార్ నియామకం పట్ల పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

# రాజమండ్రి ఆర్యవైశ్య జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్‌కు ఘన సన్మానం







**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ వాసవి క్లబ్ భవనంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ ఆధ్వర్యంలో కలం కౌంటర్ దినపత్రిక అధినేత, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రవికుమార్ స్ఫూర్తితో ఆర్యవైశ్య జర్నలిస్టులందరని ఘనంగా సన్మానించారు. దీనిలో భాగంగా రాజమండ్రికి చెందిన సీనియర్ జర్నలిస్టులు వెలుగూరి రవి కుమార్, అత్తులూరి కిషోర్, ఫోటోగ్రాఫర్ నల్లమిల్లి సుబ్బారావు ఘన సన్మానం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విశిష్టత అతిథిగా పాల్గొన్న పరమ పూజ్య శివ స్వామీజీ ఆర్యవైశ్య సోదరులను తన ప్రసంగం ద్వారా ఉత్తేజపరిచారు.ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు శిద్దా సూర్య ప్రకాష్, వాసవి క్లబ్ నాయకులు ఆర్యవైశ్య జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు.

### మేడపాటి సీతారామి రెడ్డి, కర్రి చిన్నఅప్పరెడ్డి

# విగ్రహా ఆవిష్కరణలో టీకే కుటుంబం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం రాజమండ్రి స్థానిక తిలక్ రోడ్లోని ది రెడ్డిస్ కల్చరల్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో నగర రెడ్డి ప్రముఖులు స్వర్గీయులు కర్రి చిన్నఅప్పరెడ్డి, మేడపాటి సీతారామి రెడ్డి విగ్రహల ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ షాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విచ్చేసి విగ్రహావిష్కరణ చేసినారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీ.కే. విశ్వేశ్వర రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ రాజమండ్రి మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్ జైన్,స్వర్గీయ కర్రీ చినప్ప రెడ్డి అబ్బాయి కర్రి సురేందర్ రెడ్డి,కుమార్తె నిమ్మకాయల మాధురి గారు, సీతారామ రెడ్డి అబ్బాయిలు మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, మేడపాటి అనిల్ రెడ్డి, కోడలు మేడపాటి షర్మిల రెడ్డి, తేతలి స్వరూపరెడ్డి, తేతలి సత్య సౌందర్య, మితాక్షి మేఘన రెడ్డి, విగ్రహాలకి పూల దండలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ది రెడ్డిస్ కల్చరల్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్, సభ్యులు పాల్గొన్నారు.

# బూటకపు వ్యవసాయ ప్రణాళికతో రైతాంగానికి నష్టం

## మోదీ విధానాలను వెనక్కి తీసుకోవాలి - ఏఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు పి.టాన్యా




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు టీ.ప్రకాష్ అధ్యక్షతన 2025 అక్టోబర్ 25,26 తేదీలలో రెండు రోజుల పాటు రాజమహేంద్రవరంలో స్థానిక మావోభవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు పి.టాన్యా మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా అమలు చేస్తోందని, అంబానీ, అదానీ వంటి కార్పోరేట్ శక్తుల ప్రయోజనాలే పరమావధిగా మారాయని విమర్శించారు. కార్మిక రంగం, వ్యవసాయ రంగంలో నేటి వరకు అమలు జరుగుతున్న 36 కేంద్ర,రాష్ట్ర,స్థానిక ప్రభుత్వాల పథకాలను రద్దు చేసి ఒకే ఒక ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పేరుతో బూటకపు వ్యవసాయ ప్రణాళికను తీసుకు రావడం రైతాంగానికి నష్టకరమని, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమనీ అన్నారు. అంతేకాకుండా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న అధిక సుంకాలతో వ్యవసాయ, పౌల్ట్రీ,పాడి, ఆక్వా రంగాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని అన్నారు. ట్రంప్ బెదిరింపులకు మోదీ సర్కార్ లొంగి పోవడం సిగ్గు చేటని విమర్శించారు. ఆదివాసీ ప్రాంతాల్లోని సహజ వనరులను, ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్ ను తీసుకు వచ్చి లక్షలాది మంది పారా మిలటరీ బలగాలతో మావోయిస్టులపై దాడులు చేస్తుందని దుయ్య బట్టారు. సుమారు 500 మందిని బూటకపు ఎన్కౌంటర్ పేరుతో హత్య గావించి, నరమేధం సాగిస్తుందని అన్నారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపి వేసి, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని టాన్యా డిమాండ్ చేశారు. ఏఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టీ.ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములను కారుచౌకగా కట్టబెట్టడు తుందని ఆరోపించారు. విశాఖ జిల్లా పెద్ద గంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం, మసానా పుట్టిలో 32 వేల మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం,పశ్చిమ గోదావరి జిల్లా జీలుగు మండలం వంకావారి గూడెంలో 1160 ఎకరాల భూములను ఇండియన్ నేవీ, అణ్వాయుధాల ఫ్యాక్టరీ నిర్మాణానికి బలవంతంగా భూసేకరణ చేయడాన్ని తీవ్రంగా ప్రతిఘటించాలని అన్నారు. పర్యావరణాన్ని, ప్రజల జీవితాలను ధ్వంసం చేసే రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలు, తుపాన్లు కారణంగా పంటలు నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అధిక వర్షాలు, తుపాన్లు కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని, వరి, ప్రత్తి, మొక్కజొన్న, మిర్చి, పొగాకు తదితర పంటలకు మద్దతు ధరలు కల్పించి కొనుగోలు చేయాలని, కౌలు రైతులు అందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు, అన్నదాత సుఖీభవ పథకం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5 నుంచి 12 వరకు వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆందోళనలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు నిచ్చింది.ఈ సమావేశంలో ఏఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.దూలయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.కూర్మారావు, కోశాధికారి వి.చిట్టిబాబు రాష్ట్ర నాయకులు కె.బాలు దొర, బాల్ రెడ్డి, ఎన్.పోతురాజు, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి మార్గాలు చూపించండి

## విద్యా ప్రాంగణాల్లో మెరుగైన భద్రతా సౌకర్యాలు కల్పించండి
## రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ నేత సిమ్మా దుర్గారావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధి లేని యువత వద్ద కూడా లంచం తీసుకోవటం తప్పు..వారిని కౌన్సిలింగ్ చేసి పంపండి అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి ) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి సీనియర్ సెక్యులర్ సిమ్మా దుర్గారావు పేర్కొన్నారు. దుర్గారావు ఉభయ గోదావరి జిల్లాలో 65 శాతం యువతకు ఉపాధి అవకాశాలు లేక వ్యర్థ జీవితాలతో బ్రతుకుతున్నారు.పట్ట బద్రులు సైతం రోజు కూలీలుగా శ్రమ దోపిడి కూలితో రోజు గడిపేస్తున్నారు.ఉబయ గోదావరి జిల్లాల్లో ఉపాధి లేక రాజకీయ కిరాయి కూలీలుగా ఉపాధి పొడుతున్నారు.ఈ తరహా స్వయం ఉపాధి మార్గాల్లో ఆ కులం కానివారు కూడా అద్దె కులాలను భుజాన ఎత్తుకుని కొంతమంది నేతల కోసం రాజకీయ అల్లర్లు సృష్టిస్తున్నారు. కేసులు నమోదు కాబడిన వారు న్యాయస్టానాల్లో అసలు ఆ కులాలకు ఆరోపణలుఎదుర్కొంటున్న ముద్దాయిలకు ఎటువంటి సంబంధం లేదని , పోలీసులు అక్రమ కేసులు బనాయించారని న్యాయస్థానాలు కేసులు కొట్టేసున్నారు.అనేక కుల సంఘాల ఉద్యమాల్లో ఆ కులాలకు సంబంధం లేనివారు అల్లర్లు సృష్టిస్తు శాంతి భద్రతల సమస్యలకు కారణం అవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ -తెలంగాణా రాష్ట్రాల్లో తాత , ముత్తాతల కులాలు వేరుగానుఈ తరం వారి వారసుల కులాలు వేరుగాను అసలు కులాలను మరిచిపోయి బ్రతికేస్తున్నారు.ఈ పరిస్థితులకు కారణం ప్రధానంగా ఉపాధి మార్గాలు లేక దారి తప్పి కుల ఉద్యమాలను, అల్లర్లను స్వయం ఉపాధిగా మార్చుకుంటున్నారు.ఒక తరంలో జరిగిన కుల పొరపాట్లు మరో తరం కొనసాగింపే జరుగుతుంది. తప్పును మాత్రం సరిదిద్దలేక పోతున్నారు. కొన్ని తరహా నేరాలు సైతం ఉపాధిగా మారుతుండటం ఈ తరం దురదృష్టంగా బావించాలి. పాలకుల స్వార్థం ,కొంతమంది అవినీతి యువత బంగారు భవిష్యత్ ను దోచుకుంటున్నారని, ఒక మెరుగైన మంచి సంస్కరణల తోనే యువతకు మంచి రోజులు వస్తాయని, ఉపాధి మార్గాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతాయని ఆయన ధీమా వ్యక్తం చేసారు. తెలంగాణా - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్య ముసుగులో కార్పొరేట్ మాఫియా సాశిస్తుందని , ప్రైవేట్ , కార్పొరేట్ విద్యా ప్రాగణాలు అన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నవే ననటంలో ఏ మాత్రం సందేహం లేదు . టాయిలెట్స్ పారిశుధ్యం నుండి శుభ్రమైన త్రాగునీరు కూడా లభించని స్థితిలో విద్యార్థులు కొట్టు మిట్టాడుతున్నారు. విద్యార్థుల సమస్యలు చెప్పుకోవటానికి ఎవరు వుండరు. పరిష్కరించే ప్రభుత్వ యంత్రాంగం అవినీతి ముడుపుల మత్తులో జోగుతున్నారు. స్వేచ్ఛ లేని నిర్బంద విద్యతో ప్రతి విద్యార్థి ర్యాంకుల సంఖ్యలతో పోటి పడుతున్నారు. ప్రపంచంతో పోటి పడలేని కుత్రిమ విద్యను బట్టి బట్టి ర్యాంకులు సంపాదిస్తు అదే ఉత్తమ విద్య అంటున్నారు. కొన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులు బలవంతపు మరణాలకు గురవుతున్నారు. ఎందుకోసం, ఎలా మరణిస్తున్నారో కూడా సరైన కారణాలు వుండవు . విద్యా సంస్థల మాఫియా అవినీతి ముడుపులకు ఫిదా అవుతున్న పోలీస్ యంత్రాంగం విధులు మరిచి పోతున్నారు. ఖాకి యూనిఫామ్ అంటే కాపలా దారుడుగా బ్రతికేయటానికి అలవాటు పడిపోతున్నారు. ఒకరిద్దరు నిజాయితీ అధికారులు వున్నా అవినీతి పాలకుల ముందు నిలవలేక పోతున్నారు . అనేక రాజకీయ ప్రాబల్యాలతో నడుస్తున్న విద్యా సంస్థల్లో కొన్ని వర్గాలుగా విభజించి ప్రోత్సహిస్తున్నది కూడా కొన్ని విద్యా సంస్థల యజమాన్యలే నని ఆయన తీవ్ర ఆరోపణ చేసారు. ఈ పాలన ముసుగులో నేరాలు, నేరస్తులు, అవినీతి అధికారులు ఒక నేర కూటమి వలే ఐక్యతగా ముందుకు సాగుతున్నారు. నేరాలను కట్టడి చేయాలి అనే చిత్తశుద్ధి గల పాలకులు లేనన్నాళ్ళు, రానన్నాళ్ళు నేరస్తులదేపై చేయిగా ఉంటుంది. ప్రభుత్వ శాఖల అన్ని బోర్డులకు బూజులు దులుపుకునే పనే ప్రభుత్వ విధులు అనే భ్రమలో రిటైర్ అవుతూ పెన్షన్ తీసుకుంటుంటారని అర్పిసి సీనియర్ సెక్యులర్ ఏద్దేవా చేసారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ డివి రమణమూర్తి, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, వాడపల్లి జ్యోతిష్, దోషి నిషాంత్, సుంకర వెంకట భాస్కర రంగారావు,చల్లా సాంబశివరావు, చల్లా వంశీ, అడపా శేషగిరి, మేకల కిరణ్, మాసా ప్రవీణ్, నాగూరు అన్నపూర్ణ, బోడపాటి నిర్మల, మాసా శుభాస్, నాగూరు దుర్గ, గెద్దాడ సుందరి, మాసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులలో దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ నేర్పించడం

# స్కౌట్ అండ్ గైడ్ ప్రధాన ఉద్దేశ్యం

## 935 పీఎం శ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లు
## విద్యార్థి జీవితానికి స్కౌట్ అండ్ గైడ్ దిశా నిర్దేశం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా 935 పి.ఎం.శ్రీ పాఠశాలలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు స్కౌట్ అండ్ గైడ్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్, టీచర్స్ క్యాంప్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పిఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులతో స్కౌట్ ప్రూఫ్ లు ఏర్పాటు చేశామని సూచిస్తూ, బాల బాలికలకు వేర్వేరుగా స్కౌట్ ట్రూపు లు ఏర్పాటు చేయడం ద్వారా వారికి క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ నిమిత్తం సమగ్ర శిక్ష కార్యాలయం ద్వారా ప్రతి పాఠశాలకు రూ 50 వేల రూపాయలు మంజూరైనట్లు ఆయన వివరించారు. విద్యార్థి జీవితానికి స్కౌట్ అండ్ గైడ్ నిర్దేశం చేస్తుందని విద్యార్థుల్లో నైతిక విలువలు, సేవా భావం, పెంపొందించడం, దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చడం స్కౌట్ అండ్ గైడ్ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా క్రమశిక్షణతో కూడిన సమాజాన్ని రూపొందించ వచ్చునన్నారు. తరగతి గదుల్లో స్కౌట్ అండ్ గైడ్స్‌కు సమయమిస్తూ పీరియడ్లు కూడా కేటాయించినట్లు తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లు సమర్థవంతంగా పనిచేసే విధంగా పర్యవేక్షణ జరుగుతుందన్నారు. శిక్షణ శిబిరం కోఆర్డినేటర్ పి రాంబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన 77 మంది కౌంట్ మాస్టర్ లకు బేసిక్, అడ్వాన్స్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న తీరును రాంబాబు వివరించారు. ఈ శిక్షణ శిబిరంలో కాకినాడ జిల్లా సెక్రెటరీ ఎంవి సత్యనారాయణ, ఎల్వోసి నారాయణ, జెఎన్‌వి గోపాలకృష్ణ కట్ట కృష్ణ ప్రసాద్, బ్రహ్మేశ్వరరావు, అజారుద్దీన్, శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. అనంతరం కాకినాడ జిల్లాలో బేసిక్ ట్రైనింగ్ పొందిన స్కౌట్ మాస్టర్స్‌కు శ్రీనివాస్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

## కోటి సంతకాల ఉద్యమంలో చైర్ పర్సన్ రాణి



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్థాపించిన 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు.ఆదివారం మండపేట పట్టణం 20వ వార్డు వైస్సార్ కాలనిలో ఆమె ఇంటి ఇంటికి తిరుగుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.ప్రైవేటీకరణ జరిగితే కలిగే నష్టాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రవేటికరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారే అవకాశం ఉందని, పేదలకు నడ్డి విరిచే దిశగా ఫీజుల భారం మోగుతాదని పేర్కొన్నారు.పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత సూపర్ స్పెషాల్టీ సేవలు దూరమయ్యి ప్రజా ఆరోగ్య వ్యవస్థ క్షీణిస్తుందన్నారు.ప్రభుత్వం ఈ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైస్సార్ కాలనీ కార్యకర్తలు బత్తిన దొరబాబు, గనిపే నాగ భూషణం,గనిపే ఆనంద్,కాకాడ నూక రాజు,షేక్ మస్తాన్,కొమ్మోజు నాగేశ్వరరావు,కాకాడ సురేంద్ర,పెందుర్తి జాన్, తదితరులు పాల్గొన్నారు.

### మొంథా తుఫాన్ దృష్ట్యా

### 27,28,29 తేదీలలో

# పాఠశాలలకు సెలవు

## మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా 27,28,29 తేదీలలో మండ పేట పట్టణ మరియు మండల పరిధిలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు మం డల విద్య శాఖ అధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. తుఫాన్ ప్రభా వం అధికంగా ఉండుటచే డా. బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు గమనించాలని కోరారు. తుఫాన్ దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రామచంద్రరావు కోరారు.

### మొంథా తుఫాన్ దృష్ట్యా

# కొత్తపేట నందు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావం వలన అక్టోబర్ 27,28,29 రోజులలో తీవ్రమైన భారీ వర్షములు కురుస్తాయని, బలమైన గాలులు వీస్తాయని, 28, 29, తేదీలలో ఈ తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా అత్యవసర పరిస్థితులలో తప్ప ప్రజలెవ్వరూ బయటకు రాకుండా ఇండ్లలోనే ఉండాలని, పైన చెప్పిన తేదీలలో దూర ప్రయాణాలు చేయరాదనీ, మత్స్యకారులు ఎవ్వరు సముద్ర వేటకు వెళ్ళరాదని ఇందుమూలముగా తెలియజేయడమైనది. లోతట్టు ప్రాంత ప్రజలను అవసరమైనచో తుఫాన్ షెల్టర్లకు తరలించాలని అధికారులను ఆదేశించడమైనది తుఫాన్ దృష్ట్యా రెవిన్యూ డివిజనల్ కార్యాలయం, కొత్తపేట నందు 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనది. ప్రజలు వర్షములకు సంబంధించి ఏ విధమైన సమస్యలు ఉన్నా కంట్రోల్ రూమ్ నెంబరుకు కాల్ చేసి తమ సమస్యను తెలుపవచ్చును కంట్రోల్ రూమ్ నెంబర్లు ౦08855 244299, 8500238258 అని రెవిన్యూ డివిజనల్ కార్యాలయం వారు తెలియజేశారు.

### వ్యాధులు ప్రబలకుండా

# ప్రజలను అప్రమత్తం చేయాలి

## పాఠశాల, హాస్టల్‌లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించాలి
## విద్యార్థులకు త్రాగునీరు, టాయిలెట్ అవసరాలపై అవగాహన కల్పించాలి
## తప్పనిసరిగా లేబర్ మూమెంట్ రిజిస్టర్ ను మెయింటైన్ చేయాలి
## హెల్త్ అసిస్టెంట్‌లకు మండపేట సబ్ యూనిట్ ఆఫీసర్ పిడిడి బిషప్ సూచనలు





**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హెల్త్ అసిస్టెంట్స్ అందరూ తమ పరిధిలో గల హాస్టల్స్ ను సందర్శించి ఆ పరిస్థితులను విజిటర్ బుక్స్ లో నమోదు చేయాలని మండపేట సబ్ యూనిట్ ఆఫీసర్ పి డి డి బిషప్ సూచించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట యూనిట్ పరిధిలో గల గొల్లపుంత అర్బన్ హెల్త్ సెంటర్ నందు సబ్ యూనిట్ ఆఫీసర్ పి డి డి బిషప్ ఆధ్వర్యంలో శనివారం హెల్త్ అసిస్టెంట్స్ కు ఎన్.వి.బి.డి.సి.పి యాక్టివిటీస్ గూర్చి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల వలన లార్వా ప్రభలే అవకాశం ఉన్నందున, ప్రతి హెల్త్ అసిస్టెంట్ హౌస్ టు హౌస్ విజిట్ చేసి ఇన్ అండ్ అరౌండ్ పరిశీలించి లార్వాను కనుగొని నిర్మూలన చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్స్ తమ పరిధిలో గల హాస్టల్స్ ను సందర్శించి హాస్టల్ గదుల కిటికీలకు దోమల మెస్ లు ఉన్నవి,లేనివి గుర్తించి ఆ వివరాలను విజిటర్ బుక్స్ లో వ్రాయాలని సూచించారు. డైనింగ్ హాల్, వాష్ రూమ్స్, బాత్రూమ్స్ శుభ్రంగా ఉన్నవా? లేవా? అనేది పరిశీలించి రూట్ చేయాలని వివరించారు. మంచినీరు సౌకర్యాలను పరిశీలించి త్రాగునీరు ఆర్వో వాటరా ? లేక ఎలాంటి త్రాగునీరు వారు త్రాగుచున్నారో విద్యార్థులకు తెలపాలన్నారు. అలాగే హెల్త్ అసిస్టెంట్ లు వారి పరిధిలో గల పాఠశాలలన్నిటిని సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సీజన్లో సాధారణ సరణములు మలేరియా, డెంగ్యూ జ్వరాల పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారిని అప్రమత్తం చేయాలని వారి యొక్క వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత మీద వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అధిక వర్షాలు కారణంగా నీరు కన్టాబరేటెడ్ అవ్వడంతో డయేరియా,టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకునేలా నేర్పించాలన్నారు. వాటర్ హెడ్ ట్యాంక్ లను క్లోరినేషన్ చేయించాలని, వాటర్ క్లోరినేషన్ ట్యాంక్ క్లీనింగ్ ఎ ప్పుడెప్పుడు జరుగుతున్నది క్లోరినేషన్ రిజిస్టర్ పెట్టి అందులో నోట్ చేయించాలని సూచించారు. గడిచినా 15 రోజుల క్రితం జ్వరము వచ్చిన వారికి సైతం బ్లడ్ స్మియర్ తీసి ల్యాబ్ కు పంపించాలపని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ లు అందరూ ఇన్ టైంలో రిపోర్ట్స్ సబ్మిట్ చేయాలని హెచ్చరించారు. అనంతరం సబ్ యూనిట్ ఆఫీసర్ హెల్త్ అసిస్టెంట్ రికార్డ్స్ ను పరిశీలించి, తగు సూచనలు చేశారు. లేబర్ మూమెంట్ రిజిస్టర్ అనగా ఇతర ప్రాంతంలో నుండి బట్టీ లలో పని చేయుటకు వచ్చిన వారి యొక్క వివరములు పూర్తిగా తెలుసుకుని రిజిస్టర్ మెయింటైన్ చేయాలని సూచించారు. అదేవిధంగా స్కూల్ హెల్త్ స్కూల్ స్టాప్ పర్టికులర్స్ వివరాలకు పూర్తిగా రిజిస్టర్ మెయింటైన్ చేయాలని వివరించారు. ప్రత్యేకంగా డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా హెల్త్ అసిస్టెంట్స్ అంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవ చేయాలని మండపేట సబ్ యూనిట్ ఆఫీసర్ పిడిడి బిషప్ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి మండపేట యూనిట్ పరిధిలో గల హెల్త్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

మొంథా తుఫాన్ పట్ల

# అధికారులు అప్రమత్తత వహించండి

## సచివాలయం సిబ్బంది సెలవులు రద్దు - ప్రత్యేక అధికారి విజయలక్ష్మి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సహాయక చర్యల్లో అలసత్వం వహించరాదని మండపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయం లో ఆదివారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను పై అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుండి 29 వరకు అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. తీవ్రమైన గాలులు వీచే ప్రమాదం వుందన్నారు. గాలుల వల్ల ఇంటి పైకప్పులు ఎగిరే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపద్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం పశు నష్టం జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు గ్రామ రెవెన్యూ అధికారులతో అనుసంధానం చేసుకొని పనిచేయాలని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బందికి సెలవులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. వారికి కేటాయించిన విధులలో పనిచేయాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం పై గ్రామాలలో దండోరా మైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. త్రాగునీరు ఇబ్బంది లేకుండా వాటర్ ట్యాంక్ నింపుకొని నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని కోరారు. అవసరమైన సందర్భంలో జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మండపేట మండల అభివృద్ధి అధికారి కే సత్యనారాయణ మూర్తి , డిప్యూటీ ఎంపీడీవో డి.శ్రీనివాస్ కపిలేశ్వరపురం ఎంపీడీవో హెచ్ భానోజీ రావు, కపిలేశ్వరపురం తహసిల్దార్ శ్రీనివాస్ రాయవరం ఎంపీడీవో కే కీర్తి స్పందనగా, తహసిల్దార్ బివి భాస్కర్, డిప్యూటీ ఎంపీడీవో పి.వెంకటరత్నం మండపేట డిటి మెహర్ బాబా, కే.శ్రీనివాస్ ఎలక్ట్రికల్ ఏఈ, కే సుబ్రహ్మణ్యం ఎఈ డ్రైన్స్, తదితర అధికారులు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవ & గోపాల స్వామి

# అన్నదాన పథకమునకు విరాళం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జగన్మోహిని కేశవ & గోపాల స్వామి అన్నదాన పథకమునకు విశాఖపట్నం జిల్లా దువ్వాడ వాస్తవ్యులు ఎస్.రాం బాబు అరుణా కుమారి దంపతులు దర్శించుకొని రూ.5,016/-లు విరాళంగా సమర్పించియున్నారు. దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించడమైనది వీరికి ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించ డమైనది అని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

# ఓడలరేవులో ఘనంగా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో మాజీ మంత్రి తనయుడు, అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ కుమారుడు కొనుకు రమేష్ గ్రామ వైసీపీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి శ్రీకాంత్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సన్మాల ధనరాజుకు వైసీపీ నాయకుల పరామర్శ



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండపేట పట్టణ కమిటి ఉపాధ్యక్షులు సన్మాల ధనరాజును మారేడుబాక గ్రామం సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, మండపేట సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్, నియోజకవర్గం వైసీపీ ఐటి వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబులు పరామర్శించారు. స్థానిక 11వ వార్డులో ఉన్న వారి స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో నకిలీ మద్యానికి చెక్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నకిలీ మద్యాన్ని విక్రయిస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన రామచంద్రపురంలో బస్టాండ్ సమీపంలోని ఆర్‌ఆర్ వైన్ షాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక మద్యం విధానాన్ని తీసుకువచ్చి, నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ముఖ్యంగా, అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టేందుకు, నాణ్యతను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను రూపొందించిందని తెలిపారు. మద్యాన్ని కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈ యాప్ ద్వారా స్కాన్ చేసి, తాము కొనుగోలు చేసేది నకిలీ మద్యమా లేక నాణ్యమైనదా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చని మంత్రి వివరించారు. ఈ యాప్ వినియోగంపై ప్రతి గ్రామంలోనూ ప్రజలకు విధిగా అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.

## బీహార్ ప్రచారానికి చంద్రబాబు..

# ఉప ముఖ్యమంత్రి పవన్ కూడా వెళ్తారా?



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. 2024 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరిన చంద్రబాబు ఘన విజయం సాధించారు. ఆ తర్వాత జరుగుతున్న పలు రాష్ట్రాల ఎన్నికల్లో చంద్రబాబు ఎన్డీఏ తరపున ప్రచారం చేస్తున్నారు. గతంలో ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో చంద్రబాబు ప్రచారం చేయాల్సివుండగా, వ్యక్తిగత కారణాల వల్ల మహారాష్ట్రలో ప్రచారం చివరి నిమిషంలో రద్దైంది. ఇక బిహార్ వెళ్లనున్నట్లు చంద్రబాబు స్వయంగా ప్రకటించడంతో ఆయన షెడ్యూల్ పై ఆసక్తి నెలకొంది. గత మూడు రోజుల నుంచి దుబాయ్ తోపాటు అరబ్ దేశాల్లో పర్యటించిన చంద్రబాబు శనివారం స్వదేశానికి చేరుకుంటారు. మళ్లీ వచ్చేవారం అంటే నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు బ్రిటన్ లో పర్యటిస్తారు. నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ సదస్సు కోసం పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించేందుకు చంద్రబాబుతోపాటు ఆయన మంత్రివర్గంలోని ఎంపిక చేసిన నేతలు విదేశాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు బిహార్ పర్యటన ఉంటుందని ఆయనే స్వయంగా ప్రకటించడం విశేషంగా చెబుతున్నారు. బిజీ షెడ్యూల్ నడుమ చంద్రబాబు బిహార్ ఎప్పుడు వెళ్తారనేది ఉత్కంఠ రేపుతోంది. బిహార్‌లో వచ్చే నెలలో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 6వ తేదీన తొలివిడత ఎన్నికలు జరగనుండగా, 11న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్నారు. బిహార్ లో కచ్చితంగా ఎన్డీఏ గెలుస్తుందని చంద్రబాబు ఎక్కడెక్కడ పర్యటిస్తారనేది తెలియాల్సివుంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తో చంద్రబాబుకు ముందు నుంచి సాన్నిహిత్యం ఉంది. ప్రస్తుతం ఎన్డీఏలో ఈ ఇద్దరు క్రియాశీలంగా ఉన్నారు. బిహార్ లో నితీశ్ నేతృత్వంలోని ప్రభుత్వం మరోసారి గెలిస్తే అది ప్రధాని మోదీ పాలనకు మరింత శక్తినిస్తుందని చంద్రబాబు చెబుతున్నారు. దీంతో తానే స్వయంగా చొరవ తీసుకుని ప్రచారం చేస్తానని చెప్పడం విశేషమంటున్నారు. గతంలో ఢిల్లీలో ఎన్నికల ప్రచారం చేసిన చంద్రబాబు.. బీజేపీ విజయంలో పాలుపంచుకున్నారని, ఇప్పుడు బిహార్ లో కూడా అదే జోష్ చూపాలని ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. బిహార్ లో తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం తెలుగు ఎక్కువగా మాట్లాడేవారు బిహార్ లో తక్కువే అయినప్పటికీ, ఇక్కడి నుంచి దశాబ్దాల క్రితమే బిహార్ వెళ్లి అక్కడ పారిశ్రామిక వాడల్లో జీవిస్తున్నవారు గణనీయంగా ఉన్నట్లు అనధికార సమాచారం. అదే సమయంలో బిహార్ నుంచి ఎక్కువ మంది వలస కార్మికులు ఏపీ, తెలంగాణకు వస్తుంటారు. దీంతో చంద్రబాబు ప్రచారం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు చంద్రబాబు తోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రచారంపైనా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాదిలో బీజేపీ తరపున ఉధృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న పవన్ ఉత్తర భారతంలో కూడా అడుగుపెడతారా? అనే ఆసక్తి కనిపిస్తోంది. ఏదిఏమైనా చంద్రబాబు బిహార్ పర్యటన రాజకీయంగా ఉత్కంఠ రేపుతోందని అంటున్నారు.

# కింజరాపు ఫ్యామిలీలో కొత్త సంబరం... పిక్స్ వైరల్!



కింజరాపు ఫ్యామిలీలోకి ఇటీవల వారసుడొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మరోసారి తండ్రయ్యారు. రామ్మోహన్ నాయుడు, శ్రావ్య దంపతులకు పండంటి మగబిడ్డ జన్మించాడు. శ్రావ్య ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఆగస్టు 13న పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఆ బిడ్డకు నామకరణ వేడుక జరిగింది. అవును... రామ్మోహన్ నాయుడికి తొలి సంతానంగా పాప ఉండగా.. రెండో సంతానంగా బాబు పుట్టిన సంగతి తెలిసిందే. కింజరాపు ఫ్యామిలీలోకి వారసుడు రావడంతో ఎర్రన్నాయుడు మళ్లీ పుట్టారంటూ కింజరాపు కుటుంబ అభిమానులు సంతోషంలో ఉన్నారు. వారి సంతోషాన్ని రెట్టింపుచేస్తూ అన్నట్లుగా.. ఎర్రన్నాయుడు గౌరవార్థం ఆ బిడ్డకు ప్రేమగా శివన్ ఎర్రన్నాయుడు అని పేరు పెట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి అనేక మంది నాయకులు హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో పాటు రామ్మోహన్ నాయుడి బాబాయ్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు హాజరయ్యారు. వీరితోపాటు సన్నిహితులు, శ్రేయోభిలాషులు, రాజకీయ సహచరులు హాజరై చిన్నారికి ఆశీస్సులు అందించారు. కాగా... రామ్మోహన్ నాయుడు, శ్రావ్యల వివాహం 2017లో జరిగింది. వీరికి తొలి సంతానంగా పాప ఉండగా.. రెండో సంతానంగా బాబు పుట్టాడు. రామ్మోహన్ నాయుడు 2014,2019, 2024 ఎన్నికల్లో వరుసగా టీడీపీ తరఫు ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం కేంద్రమంత్రి వర్గంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు.

**రామ్మోహన్ నాయుడు కుమారుడికి లోకేష్ ఆశీస్సులు!:** రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష.. గత నెల మొదటివారంలో ఢిల్లీలోని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా... రామ్మోహన్ నాయుడు, శ్రావ్య దంపతులకు జన్మించిన కుమారుడిని ఆయన ఆశీర్వదించారు. బాబును ఎత్తుకొని ముద్దాడారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మాజీమంత్రి బండారు సత్యనారాయణ మూర్తి సతీమణి మాధవీలతని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

# పవన్ అపాయింట్మెంట్ ఇస్తే భీమవరం గుట్టు రట్టు చేస్తా..!

భీమవరం డీఎస్పీ ఇష్యూ గోదావరి జిల్లాలలో ఇపుడు హాట్ టాపిక్ గా మారింది. పవన్ ఏ ముహూర్తాన ఆయన పైన సీరియస్ అయ్యారో తెలియదు కానీ అది రాజకీయంగానూ ప్రకంపనలు సృష్టిస్తోంది. డీఎస్పీ మీద నివేదిక ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కోరారు. ఆ మీదట హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ పవన్ ఈ విషయంలో జోక్యం చేసుకోవడంలో తప్పులేదని అన్నారు. ఇక భీమవరం డీఎస్పీ మంచి వారే అని ఉప సభాపతి రఘురామ క్రిష్ణం రాజు కూడా చెప్పారు. ఇపుడు ఈ ఇష్యూలోకి భీమవరం నుంచి 2019లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి పవన్ ని ఓడించిన గ్రంధి శ్రీనివాస్ ఎంట్రీ ఇచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ భీమవరం డీఎస్పీ విషయంలో రఘురామ చెప్పిందే నూరు శాతం నిజం అని చెప్పడం విశేషం అయితే భీమవరంలో చాలానే జరుగుతున్నాయని వాటి మీద మొత్తం గుట్టుమట్లు అన్నీ పవన్ ని స్వయంగా కలిసి అన్ని విషయాలు తానే స్వయంగా వివరిస్తారు అంటున్నారు.

**గుట్టు రట్టు చేస్తా :**

భీమవరంలో ఏమి జరుగుతోంది పేకాట జూదాల వెనక ఏమిటి అసలు మ్యాటర్ ఎవరేంటి ఈ దందా వెనక ఎవరున్నారు అన్న దాని మీద మొత్తం గుట్టుని తాను విప్పుతాను అని గ్రంధి శ్రీనివాస్ అంటున్నారు. ఇక డీఎస్పీ జయసూర్య మీద కూటమిలో కొందరు మద్దతుగా మాట్లాడుతూంటే మరికొందరు వ్యతిరేక గళం వినిపిస్తున్నారు. ఈ నేపధ్యంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం డీఎస్పీకే మద్దతుగా మాట్లాడడం విశేషంగా అంతా చూస్తున్నారు. అంతే కాదు ఆయన కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గడచిన పదిహేడు నెలల కాలంలో పద్నాలుగు నెలల పాటు సాగిన పేకాట దందాలను ఉక్కు పాదంతో డీఎస్పీ అణచివేశారు అని చెప్పారు. అందుకే ఇపుడు ఆయన మీద పనిగట్టుకుని కొంతమంది పవన్ కి ఫిర్యాదు చేశారు అని హాట్ కామెంట్స్ చేశారు. దీంతో ఇది ఒక్కసారిగా కూటమిలోనూ సీరియస్ చర్చకు తావిస్తోంది.



**స్పందించడం అభినందనీయం :**

భీమవరంలో పేకాట జూదం వంటి విషయంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ స్పందించడం అభినందనీయం అని అంటున్నారు. అయితే అసలు విషయాలు చాలానే ఉన్నాయని గ్రంధి శ్రీనివాస్ చెప్పడం గమనార్హం. భీమవరంలో ఏమి జరుగుతోంది అన్నది పవన్ కి పూర్తిగా తెలియచేయాలన్నది తన ఉద్దేశ్యం అన్నారు. అందుకే తానే స్వయంగా పవన్ కి తొందరలో కలసి అసలు భీమవరంలో ఏమి జరుగుతోంది అన్నది పూర్తి స్థాయిలో వివరిస్తాను అని సంచలన ప్రకటన చేశారు. భీమవరంలో జూద శిబిరాల లోగుట్టు ఏంటో పవన్ కే అన్ని విషయాలు చెప్పి లోగుట్టు పూర్తిగా బట్టబయలు చేస్తాను అని గ్రంధి శ్రీనివాస్ అంటున్నారు. అయితే తనకు పవన్ అపాయింట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని ఆయన చెబుతున్నారు.

**మామూళ్ళు ఆగిపోయాయనే :**

ఇంతటితో గ్రంధి శ్రీనివాస్ ఊరుకోలేదు. మామూళ్ళు ఆగిపోయాయనే కొందరు పనిగట్టుకుని భీమవరం డీఎస్పీ మీద లేని పోనివి పవన్‌కి చెప్పారు అని ఆయన అంటున్నారు. క్లబ్ ల ద్వారా భారీగా అక్రమార్జన గత పద్నాలుగు నెలలుగా కొందరికి దక్కిందని గడచిన మూడు నెలలుగా అది ఆగిపోవడంతోనే వారు ఈ రకంగా చేస్తున్నారు అని అన్నారు. ఇంతకీ ఎవరు వారు అని మీడియా ప్రశ్నించగా ఎవరేమిటో భీమవరం ప్రజలు అందరికీ తెలుసు అన్నారు. ఒక్కసారి వారిని అడిగితే అంతా తెలుస్తుందని అన్నారు. ఈ విషయంలో పూర్తి సమాచారం తన దగ్గర ఉందని కూడా గ్రంధి చెప్పడం విశేషం.

**అసలు మ్యాటర్ ఏంటో :**

భీమవరం డీఎస్పీ విషయం, అలాగే జూద శిబిరాల వెనక దందాలు అసలు గుట్టు ఏమిటి అన్నది తనకు తెలుసు అని మాజీ ఎమ్మెల్యే చెప్పడం విశేషం. ఇవన్నీ కూడా పవన్ కే పూర్తి సమాచారం ఇస్తామని ఆయన చెప్పారు. అంతే కాదు ఆయన పవన్ ని కలిస్తే కేవలం భీమవరం పేకాట జూదం గురించే కాకుండా మొత్తం రాజకీయాల గురించి కూడా పూర్తి సమాచారం ఇచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. ఎవరేమిటి అన్నది కూడా ఆయన వివరిస్తారు అని అంటున్నారు.

**గ్రంధి రాజకీయమేంటి :**

ఇదిలా ఉంటే గ్రంధి శ్రీనివాస్ ఒకనాడు పవన్ ని ఘాటుగా విమర్శించారు. ఆయన వైసీపీలో అయిదేళ్ళ పాటు ఎమ్మెల్యేగా ఉన్నపుడు పవన్ మీద తీవ్ర స్థాయిలోనే విమర్శలు చేసేవారు. అయితే 2024లో ఓటమి పాలు అయ్యాక ఆయన నెమ్మదిగా వైసీపీకి దూరం అయ్యారు. ఆయన కుదిరితే టీడీపీ లేకపోతే జనసేనలో చేరాలని చూస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇంతవరకూ ఆయన గ్రీన్ సిగ్నల్ అయితే ఏ వైపు నుంచి రాలేదని అంటున్నారు. ఈ క్రమంలో భీమవరంలో పేకాట జూదం ఇష్యూ హైలెట్ కావడంతో దానిని ముందు పెట్టుకుని పవన్ ని కలిసే ప్రయత్నం చేస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. భీమవరంలో అంగబలం అర్ధబలం కలిగిన నేతగా బలమైన నాయకుడిగా ఉన్న గ్రంధి శ్రీనివాస్ కి పవన్ కనుక అపాయింట్మెంట్ ఇస్తే భీమవరం రాజకీయం మొత్తంగా మారుతుంది అని అంటున్నారు. అయితే తాను ప్రస్తుతం రాజకీయాల నుంచి దూరంగా ఉన్నాను అని ఆయన చెప్పారు. తాను ఏ పార్టీలో చేరేది అన్నది ఇపుడే ఏమీ అనుకోలేదని చెప్పడం విశేషం.

# స్వేచ్ఛా వాణిజ్యం బలోపేతం

కౌలాలంపూర్/న్యూఢిల్లీ

ఇష్టారీతిగా వ్యవహరిస్తూ అన్ని దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల సుత్తితో మోదుతున్న వేళ ఆసియాన్ దేశాలతో బంధంపై భారత్ దృష్టిసారించింది. ఆసియాన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం బలోపేతమే లక్ష్యంగా భారత్ ముందుకెళు తుందని ప్రధాని మోదీ ప్రకటించారు. అనిశ్చిత పరిస్థితుల్లోనూ ప్రపంచ సుస్థిరతకు, ప్రగతికి భారత్%–%ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం శక్తివంతమైన పునాదిగా మారుతోందని మోదీ వ్యాఖ్యానించారు. మలేసియాలోని కౌలాలంపూర్ నగరంలో ఆదివారం ప్రారంభమైన ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో మోదీ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ శాంతిభద్రతలకు ఉగ్రవాదం పెను ముప్పుగా పరిణమించిందని, దీనిని ఎదుర్కొనేందుకు అందరం సమైక్యంగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందని మోదీ అన్నారు. ఆసియాన్%–%ఇండియా ట్రేడ్ ఇన్ గూడ్స్ అగ్రిమెంట్(ఏఐటీఐజీఏ)ను వీలైనంత త్వరగా సమీక్షించాలని మోదీ అభిలషించారు.
మోదీ ప్రసంగ వివరాలను తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. "ఏఐటీఐజీఏ ఒప్పందం 15 ఏళ్ల క్రితం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు భారత్%–%ఆసియాన్ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతమైతే ఇరు దేశాల ప్రజలు ఎంతో ప్రయోజనం పొందుతారు. ప్రాంతీయ సహకారం సైతం ఇనుమడిస్తుంది"అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా ఆసియాన్, భారత్‌ల ఆర్థిక ప్రగతికి బాటలువేసే కీలకమైన సుస్థిర పర్యాటకంపై ఇరువర్గాలు ఒక ప్రకటన విడుదలచేశాయి. "ఇండో%–%పసిఫిక్‌లో ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య(ఆసియాన్) కూటమికి భారత్ గట్టి మద్దతుదారుగా నిలుస్తోంది. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం(2026%–%2030) అమలు కోసం ఆసియాన్%–%భారత్ ప్లాన్ ఆఫ్ యాక్షన్‌కు మద్దతు పలుకుతున్నాం. త్వరలో రెండో ఆసియాన్%–%భారత్ రక్షణ మంత్రుల సమావేశం, రెండో ఆసియాన్%–%భారత్ నౌకావిన్యాసాలు జరుపుదాం"అని మోదీ అన్నారు.

**నాలుగో వంతు మనమే**

"విశ్వమానవాళిలో నాలుగో వంతు జనాభాకు భారత్, ఆసియాన్ దేశాలే ప్రాతినిధ్యంవహిస్తున్నాయి. జనాభాను మాత్రమే కాదు మనం అత్యంత చరిత్రాత్మకమైన ఒప్పందాలు, విలువల బంధాలతో పెనవేసుకుపోయా. గ్లోబల్ సౌత్‌లో మనం కలిసి ముందడుగువేస్తున్నాం. కేవలం వాణిజ్య భాగస్వాములం కాదు సాంస్కృతిక సహచరులం. భారత్ అవలంభిస్తున్న యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ అనేది పునాదిరాయి. ఆసియాన్ లక్ష్యాలకు, ఇండో%–%పసిఫిక్ విషయంలో ఆసియాన్ వైఖరికి భారత్ ఎల్లవేళలా పూర్తిస్థాయిలో మద్దతు పలుకుతోంది.
ఒడిదుడుకుల కాలంలోనూ భారత్%–%ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం అనేది సుస్థిరాభివృద్ధిని కొనసాగించింది. ఈ బలమైన బంధమే యావత్ ప్రపంచ సుస్థిరాభివృద్ధి, ప్రగతికి కొత్త అంకురార్పణ చేస్తోంది. భారత్, ఆసియాన్ రెండూ విద్య, పర్యాటకం, శాస్త్రసాంకేతిక, ఆరోగ్య, శుద్ధ ఇంధనం, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో మరింత బలమైన పరస్పర సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయి. ఇకమీదట సైతం సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకునేందుకు కలిసి పనిచేస్తాం. భారత, ఆసియాన్ ప్రజల మధ్య సత్సంబంధాలను పెంచుతాం. ఇందుకోసం భుజం భుజం కలిపి పనిచేసేందుకు భారత్ కట్టుబడి ఉంది. ఆసియాన్ పవర్ గ్రిడ్ కార్యక్రమం కోసం 400 నిపుణులకు పునరుత్పాదక ఇంధన రంగంలో శిక్షణనిప్పిస్తాం "అని మోదీ అన్నారు.

**సవాళ్లు ఎదురవుతున్నా..**

అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నా డిజిటల్ సమ్మిళిత వృద్ధి, ఆహార భద్రత, సరకు రవాణా గొలుసు వంటి అంశాల్లో ఆసియాన్ దేశాలు సమష్టిగా పోరాడుతూ ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు ఇతివృత్తమైన 'సమ్మిళిత సుస్థిరత'భావనను శిఖరాగ్రాలపై నిలిపాయి. ఆసియాన్ దేశాల ప్రాధాన్యతలను మద్దతు పలుకుతూనే ఆసియాన్ దేశాలను ఇలాగే సమష్టిగా కలిపి ఉంచేందుకు భారత్ కృషిచేస్తుంది. ఆపత్కాలంలో ఆసియాన్ దేశాలను ఆదుకునేందుకు భారత్ సదా ఆపన్నహస్తం అందించింది. మానవతా సాయం, విపత్తు సాయం, సముద్రయాన భద్రత, సాగరసంబంధ వాణిజ్యాభివృద్ధికి భారత్ అండగా నిలబడుతుంది. 2026 ఏడాదిని 'ఆసియాన్%–%భారత్ సముద్ర సహకార సంవత్సరం'గా ప్రకటిస్తున్నాం"అని మోదీ చెప్పారు.

# కుమ్రం భీమ్ పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకం

న్యూఢిల్లీ/ఆసిఫాబాద్

నిజాం దురాగతాలపై యోధుడు కుమ్రం భీమ్ పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. కుమ్రం భీమ్ తన ధైర్యం, త్యాగంతో లక్షలాది మంది హృదయాలపై ముఖ్యంగా గిరిజన సమాజంపై చెరగని ముద్ర వేశారన్నారు. కుమ్రం భీమ్ 40 సంవత్సరాలు మాత్రమే జీవించినా.. ఆయన జీవితం ఎన్నో పాఠాలను నేర్పుతుందని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రధాని తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 127వ ఎపిసోడ్‌లో 'జల్, జంగల్, జమీన్ హమారా' నినాదం కోసం ప్రాణాలర్పించిన ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం గురించి ప్రస్తావించి నివాళులర్పించారు. "నేను ఇప్పుడు మిమ్మల్ని గతకాలపు జ్ఞాపకాల్లోకి తీసుకెళతాను. 20వ శతాబ్ద ప్రారంభాన్ని ఊహించుకోండి! అప్పుడు స్వాతంత్ర్యం వస్తుందనే ఆశ కనుచూపు మేరలో లేదు. బ్రిటీషవారు భారతదేశం అంతటా అడ్డూఅదుపు లేకుండా దోపిడీ సాగిస్తున్నారు. హైదరాబాద్ ప్రజలకు అణచివేత కాలం మరింత భయంకరం. క్రూరమైన, నిర్దయుడైన నిజాం దురాగతాలను కూడా వారు భరించవలసి వచ్చింది. పేదలు, అణగారిన వర్గాలు, ఆదివాసీలపై దౌర్జన్యాలు వర్ణనాతీతం. వారి భూములను లాక్కున్నారు. భారీగా పన్నులు విధించారు. ఈ అన్యాయాన్ని నిరసించిన వారి చేతులను నరికివేశారు. ఈ దురాగతాలకు వ్యతిరేకంగా 20 ఏళ్ల యువకుడు నిలబడ్డాడు. ఆ పేరు చెప్పే ముందు అతని ధైర్యం గురించి నేను మీకు చెబుతాను. నిజాంకు వ్యతిరేకంగా ఒక్కమాట మాట్లాడటం కూడా నేరంగా పరిగణించే ఆ రోజుల్లో సిద్ధిఖీ అనే నిజాం అధికారిని ఆ యువకుడు బహిరంగంగా సవాలు చేశాడు. రైతుల పంటలను జప్తు చేయడానికి సిద్ధిఖీని నిజాం పంపాడు. కానీ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సిద్ధిఖీని ఆ యువకుడు చంపాడు. నిజాం ప్రభుత్వ పోలీసుల నుంచి తప్పించుకుని వందల కిలోమీటర్ల దూరంలోని అసోంకు చేరుకున్నాడు. 1940లో ఆయనను నిజాం మనుషులు హత్య చేశారు. ఆ గొప్ప వ్యక్తి పేరు కుమ్రం భీమ్. ఈ నెల 22న ఆయన జయంతిని జరుపుకున్నాం. కుమ్రం భీమ్ ఎక్కువ కాలం జీవించలేదు. కానీ తన జీవితకాలంలో అసంఖ్యాక ప్రజల హృదయాలపై.. ముఖ్యంగా ఆదివాసీ సమాజంపై చెరగని ముద్ర వేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో కొత్త శక్తిని నింపారు" అని ప్రధాని అన్నారు. వచ్చే నెల 15న మనం 'ఆదివాసీ గౌరవ దినోత్సవం' నిర్వహించుకోనున్నామని చెప్పారు. "ఇది భగవాన్ బిర్సా ముండా జయంతి శుభ సందర్భం. దేశ స్వాతంత్ర్యం కోసం, ఆదివాసీ సమాజ హక్కుల కోసం ఆయన చేసిన కృషి సాటిలేనిది" అంటూ నివాళు లర్పించారు.

**వందేమాతర గీతం 150 ఏళ్ల వేడుకలు**

వందేమాతర గీతం భారతీయుల్లో నిరంతరం దేశభక్తిని, ఐక్యతను నింపుతూ ఉంటుందని, అది భారతీయతకు శక్తిమంతమైన చిహ్నమని మోదీ అన్నారు.
వందేమాతరం అనే ఒక్కపదమే మన గుండెల్లో ఎన్నో భావోద్వేగాలను కలిగిస్తుందని, శక్తినిచ్చి భరతమాత బిడ్డలుగా మన బాధ్యతలను గుర్తుచేస్తుందని చెప్పారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతర గీతం వచ్చే నెల 7వ తేదీతో ఈ ఏడాది 150వ ఏట అడుగిడుతుందని, ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఆపరేషన్ సిందూర్'తో ఈ ఏడాది పండుగలు మరింత ఘనంగా జరిగాయన్నారు. భారతీయ కాఫీ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ సంపాదించుకుంటోందన్న మోదీ.. ఒడిసాలోని కోరాపుట్ సహా అనేక ప్రాంతాలను ప్రస్తావించారు.

**21వ శతాబ్దం భారత్-ఆసియాన్ దేశాలదే**

ఇరవైఒకటో శతాబ్దం భారత్–ఆసియాన్ దేశాలదేనని మోదీ చెప్పారు. ఆసియాన్ దేశాల విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు ఒకటేనన్నారు. రాబోయే తరాలకు సమృద్ధికరమైన, ఉజ్వలమైన భవిష్యత్ అందించే దిశగా చర్యలు తీసుకుందామన్నారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియాన్ దేశాల సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ జనాభాలో నాలుగో వంతు ఆసియాన్ దేశాల్లోనే ఉన్నారని, భారత్–ఆసియాన్ దేశాలు భౌగోళికంగానే కాక ఉమ్మడి చారిత్రక విలువలు, కలిగి ఉన్నాయన్నారు. భారత్–ఆసియాన్ దేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందడుగు వేస్తున్నాయని, ఈ భాగస్వామ్యం ప్రపంచ సుస్థిర అభివృద్ధికి బలమైన పునాదిగా మారుతుందని మోదీ చెప్పారు. ప్రతి విపత్తులోనూ ఆసియాన్ దేశాలకు భారత్ అండగా ఉందన్నారు.

# మణిపూర్‌లో పలు ఇళ్లు దగ్ధం

## సరిహద్దు దాటి మంటలార్పిన మయన్మార్ అగ్నిమాపక సిబ్బంది





**ఇంఫాల్:** సరిహద్దు ప్రాంతంలో పలు ఇళ్లు దగ్ధమయ్యాయి. మంటలు మరింతగా వ్యాపించడంతో ఫైర్ సిబ్బందికి కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మయన్మార్ అగ్నిమాపక సిబ్బంది సరిహద్దులు దాటి వచ్చారు. మంటలు ఆర్పేందుకు సహకరించారు. భారత్, మయన్మార్ సరిహద్దు సమీపంలో ఉన్న మణిపూర్‌లోని టెంగ్నౌపాల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం మోరే నగరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ముస్లిం బస్తీలో పది ఇళ్లు దగ్ధమయ్యాయి. మంటలు, పొగలు దట్టంగా వ్యాపించాయి. కాగా, మణిపూర్ రాష్ట్ర అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, కమాండోలు, అస్సాం రైఫిల్స్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. స్థానికులతో కలిసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు మరింతగా వ్యాపించడాన్ని మయన్మార్ అగ్నిమాపక దళం సిబ్బంది గమనించారు. అగ్నిమాపక వాహనాలతో అంతర్జాతీయ సరిహద్దు దాటి మోరే చేరుకున్నారు. దగ్ధమవుతున్న ఇళ్ల మంటలను అదుపు చేసేందుకు సహకరించారు. మరోవైపు మయన్మార్ అగ్నిమాపక సిబ్బంది సహకారాన్ని మణిపూర్ పోలీస్ అధికారి కొనియాడారు. ఆ దేశ ఫైర్ బృందాలు సకాలంలో చేరుకోకపోతే పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని అన్నారు. ఇలా ఆకస్మికంగా సరిహద్దులు దాటి సహకరించడం అరుదైన సంఘటన అని పేర్కొన్నారు. అగ్ని ప్రమాద బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. ఈ భారీ అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వివరించారు. కాగా, ఇండో–మయన్మార్ ఫ్రెండ్‌షిప్ గేట్ వెంబడి ఉన్న మోరే నగరం ఇరు దేశాల మధ్య కీలకమైన వాణిజ్య కేంద్రం. అయితే కరోనా మహమ్మారి, మయన్మార్‌లో నెలకొన్న అశాంతి కారణంగా 2020 మార్చి నుంచి అక్కడ వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోయాయి.

## ఇస్రో ఎల్‌వీఎం రాకెట్ సిద్ధం

బెంగళూరు

అత్యంత బరువైన ఉపగ్రహాలను మోసుకెళ్లే ఇస్రో వారి ఎల్‌వీఎం–3 రాకెట్ మరోసారి ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని ప్రయోగవేదిక మీదకు సీఎంఎస్–03 ఉపగ్రహాన్ని అమర్చిన ఎల్‌వీఎం–3 రాకెట్‌ను ఆదివారం తరలించారు. నవంబర్ రెండో తేదీన ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నామని ఇస్రో ఆదివారం వెల్లడించింది.
భారత్‌సహా విశాలమైన సముద్రప్రాంతంలో కమ్యూనికేషన్ సేవలు అందించే లక్ష్యంతో మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్‌ను ఎల్‌వీఎం3–ఎం5 రాకెట్ సాయంతో కక్షలో ప్రవేశపెట్టాలని నిర్ణయించడం తెల్సిందే. ఈ ఉపగ్రహం బరువు ఏకంగా 4,400 కేజీలు. భారత గడ్డ మీద నుంచి భూస్థిర కక్షలోకి ఇంతటి బరువైన ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించడం ఇదే తొలిసారికావడం గమనార్హం. గతంలో చంద్రయాన్%–%3 మిషన్ కార్యక్రమం కోసం ఎల్‌వీఎం%–%3 రాకెట్‌ను వినియోగించారు. ఈ రాకెట్‌ను ఇప్పటిదాకా నాలుగుసార్లు ఉపయోగించారు. పౌర, వ్యూహాత్మక, నావికా సేవలను సీఎంఎస్%–%03 ఉపగ్రహం అందివ్వనుంది.

## సల్మాన్‌పై పాక్ ఉగ్ర ముద్ర

**బలూచిస్తాన్‌ను దేశమంటూ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం**




న్యూఢిల్లీ

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ను పాకిస్తాన్ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇటీవల సౌదీ అరేబి యాలోని రియాద్‌లో జరిగిన కార్యక్రమంలో సల్మాన్ ఖాన్ బలూచిస్తాన్‌ను ప్రత్యేక దేశంగా ప్రస్తావించిన దగ్గర్నుంచి ఆ దేశం తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో ఆయన్ను ఉగ్రవాదిగా పేర్కొంటూ ఆదివారం ఒక ఉత్తర్వు విడుదల చేసింది. ఉగ్రవాద వ్యతిరేక చట్టం%–%1997లోని నాలుగో షెడ్యూల్ ప్రకారం ఉగ్రవాదంతో సంబంధాలున్నట్లుగా అనుమానం ఉన్న వ్యక్తులను ఉగ్రవాదులుగా పేర్కొనవచ్చు. ఈ చట్టం ప్రకారం సల్మాన్‌ను పాక్ ఉగ్రవాదిగా పేర్కొంది. ఈ మేరకు అక్టోబర్ 16వ తేదీన బలూచిస్తాన్ ప్రభుత్వ హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తాజాగా పాక్ ప్రభుత్వం ధ్రువీకరించింది. ఆయన్ను స్వతంత్ర బలూచిస్తాన్ దోహదకారి (ఆజాద్ బలూస్తాన్ ఫెసిలిటేటర్)గా అందులో పేర్కొంది. దీని ప్రకారం ఆయనపై నిఘా, కదలికలపై నియంత్రణ. చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు అవకాశముంటుందని చెబుతున్నారు. మధ్యప్రాచ్యం భారతీయ సినిమాకు పెరుగుతున్న ఆదరణపై చర్చించేందుకు జోయ్ ఫోరం%–%2025 అక్టోబర్ 17న రియాద్‌లో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. బాలీవుడ్ ఖాన్ త్రయం సల్మాన్, షారూక్, ఆమిర్ ఖాన్ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సల్మాన్ మాట్లాడారు. 'హిందీ సినిమాను సౌదీ అరేబియాలో విడుదల చేస్తే సూపర్ హిట్టవడం ఖాయం. తమిళం, తెలుగు, మలయాళ సినిమాలతో ఇక్కడ కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. బలూచిస్తాన్, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్.. ఇంకా ఈ ప్రాంతంలోని చాలా దేశాల వారు ఇక్కడ పని చేస్తున్నారు'అంటూ చేసిన ప్రసంగం సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.

## దేశవ్యాప్త ఎస్ఐఆర్ తొలి విడతపై ఈసీ సమావేశం




న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు భారత ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం 4.15 గంటలకు ఎన్నికల కమిషన్ మీడియా సమావేశం ఏర్పాటు చేస్తోంది. 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలతో సహా 10 నుంచి 15 రాష్ట్రాల్లో తొలి విడత ఎస్ఐఆర్ నిర్వహించే తేదీలను ఈసీ ఈ సందర్భంగా ప్రకటించే అవకాశం ఉంది.

**తొలి విడత ఎస్ఐఆర్ రాష్ట్రాల్లో..**

ఈసీ వర్గాల సమాచారం ప్రకారం, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సాధ్యమైనంత త్వరగా ఎస్ఐఆర్‌ను పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరిలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున తొలి విడత ఎస్ఐఆర్‌లో ఆ రాష్ట్రాలు చోటుచేసుకోనున్నాయి. అయితే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్న, జరగడానికి సిద్ధంగా ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల అధికారులు తలమునకలై ఉంటారు కావున వాటి జోలికి వెళ్లరాదని భావిస్తోంది.
బిహార్‌లో ఇటీవలే ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ పూర్తి చేసి ఓటర్ల జాబితాను ప్రచురించింది. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి తుది జాబితాలో 7.42 కోట్ల ఓటర్లు చోటుచేసుకున్నారు. నవంబర్ 6,11 తేదీల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి.

## మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ

రాయ్‌పూర్: మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ. ఆదివారం మరో 21 మంది మావోలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. బస్తర్ రేంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లొంగిపోయిన మావోయిస్టులు కేశ్‌కాల్ డివిజన్ కుమారి, కిస్కోడా ఏరియా కమిటీ మావోయిస్టులని.. లొంగిపోయిన వారిలో కేశ్‌కాల్ డివిజన్ కమిటీ కార్యదర్శి ముకేష్, మావోయిస్టులు కుయెమారి/కిస్కోడో ఏరియా కమిటీ, కేశ్కల్ డివిజన్ (నార్త్ సబ్ జోనల్ బ్యూరో)కు చెందినవారు. వీరిలో డివిజన్ కమిటీ కార్యదర్శి ముకేశ్ ఉన్నారు. ఆయుధాలతో సహా లొంగిపోయిన మావోయిస్టుల్లో నాలుగు మంది డివిజన్ స్థాయి కమాండర్లు, తొమ్మిది మంది ఏరియా కమిటీ సభ్యులు ,ఎనిమిది మంది పార్టీ సభ్యులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక 21 మంది మావోయిస్టుల్లో 13 మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు మూడు ఏకే–47 రైఫిళ్లు ,నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఆరోనంబర్ 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, ఒక బీజీఎల్ ఆయుధాన్ని సరెండర్ చేసినట్లు బస్తర్‌రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీ సుందర్‌రాజ్ వెల్లడించారు.

## బిజినెస్ వాయిస్

# నవంబరు 1 నుంచి బ్యాంకుల్లో వచ్చే మార్పులివే..




బ్యాంకుల్లో ఖాతాదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు వచ్చే నెల 1వ తేదీ నుంచి చెక్ పడనుంది. ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాదారుడికి జరగరానిది ఏమైనా జరిగితే.. వారసులు ఆ ఖాతా సెటిల్ చేసుకోవడం పెద్ద సమస్యగా ఉండేది. లాకర్ల వస్తువుల సెటిల్‌మెంట్‌లోనూ ఇదే సమస్య. అయితే నవంబరు 1 నుంచి ఈ కష్టాలకు తెరపడనుంది. వీటి పరిష్కారానికి వీలు కల్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి సంబంధించిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం, 2025'ను పార్లమెంట్ ఇప్పటికే ఆమోదించింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ ఏడాది నవంబరు 1 నుంచి బ్యాంకింగ్ చట్టాల్లో కింది మార్పులు చోటు చేసుకోనున్నాయి. అవేమిటంటే? నలుగురి వరకు

నామినీలు: బ్యాంకు డిపాజిటర్లు ఇక నలుగురి వరకు నామినీలను నామినేట్ చేయవచ్చు. ఈ నలుగురిని ఒకేసారి లేదా ఒకరి తర్వాత ఒకరిని నామినేట్ చేయవచ్చు. ఈ మార్పు వల్ల డిపాజిట్ ఖాతాదారుడికి జరగరాని అనర్థమేదైనా జరిగితే, డిపాజిట్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేలికవుతుంది.

లాకర్లలోని వస్తువులకు నామినేషన్: లాకర్లు, సేఫ్ కస్టడీలోని వస్తువుల విషయం లో నామినేషన్‌కు అవకాశం ఉంటుంది. అంతేకాదు వరుస క్రమం ప్రకారం మాత్రమే నామినీలకు లాకర్లను నిర్వహించే అధికారం ఉంటుంది.

వాటాల విభజన: కొత్త చట్టంతో ఖాతాదారు తన తదనంతరం తన డిపాజిట్ లేదా లాకర్‌లోని వస్తువుల్లో ఏ నామినీకి ఎంత మొత్తం లేదా ఎంత శాతం చెల్లించాలనే విషయాన్ని ముందుగానే బ్యాంకుకు తెలియజేయవచ్చు. ఈ సదుపాయం ఒకేసారి నలుగురు నామినీలను నామినేట్ చేసే కేసుల్లో మాత్రమే వర్తిస్తుంది.

ఎవరెవరికి: బ్యాంకుల్లో డిపాజిట్లు, లాకర్లు, సేఫ్ డిపాజిట్ వాల్ట్‌లు ఉన్న వ్యక్తిగత/జాయింట్ లేదా సోల్ ప్రొప్రైటరీ ఖాతాదారులు అందరూ.. ఇక తమకు నచ్చిన నలుగురిని తమ నామినీలుగా నామినేట్ చేయవచ్చు. ఒకేసారి లేదా వరుస క్రమంలో తమ ప్రాధాన్యత ప్రకారం నామినీలను నామినేట్ చేయవచ్చు. అయితే ఎవరో ఒక ఖాతాదారుడికి ప్రతినిధిగా ఉన్న వ్యక్తులు మాత్రం ఎవరినీ నామినేట్ చేసేందుకు అవకాశం లేదు.

తేలిగ్గా క్లెయిమ్స్ పరిష్కారం: కొత్త నిబంధనలతో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరగనుంది. దీంతో క్లెయిమ్‌ల పరిష్కారంలో ఆలస్యం, వివాదాలకు కూడా అవకాశం ఉండదు.

ఒకే దరఖాస్తు: కొత్త చట్టం ప్రకారం నామినీల నామినేషన్ల కోసం ఇక బ్యాంకులన్నీ ఒకే ప్రామాణిక అప్లికేషన్‌ను అనుసరిస్తాయి. దీనివల్ల క్లెయిమ్స్ సెటిల్‌మెంట్, డాక్యుమెంటేషన్ కూడా సులభమవుతుంది.

జాయింట్ ఖాతాల్లో పారదర్శకత: జాయింట్ ఖాతాదారులు పరస్పర అంగీకారంతో నామినీల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయవచ్చు. దీని వల్ల ఖాతాదారుడు చనిపోయినప్పుడు క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత తేలికవుతుంది.

మరింత రక్షణ: నామినీల ప్రక్రియ సులభతరం కావడంతో డిపాజిట్లకు, లాకర్లకు చట్టపరంగా మరింత రక్షణ ఏర్పడుతుంది. దీనివల్ల ఖాతాదారుడు మరణించినప్పుడు.. అతని నామినీలకు ఖాతాలోని సొమ్ము పంపిణీ త్వరగా, సులభంగా పూర్తవుతుంది.

క్రమబద్ధీకరణ: మారిన నిబంధనలతో వరుస క్రమంలో ఉన్న నామినీలు మాత్రమే, లాకర్లలోని వస్తువులు, సేఫ్ డిపాజిట్లను ఖాతాదారుడు సూచించిన నిష్పత్తిలో అందుకోగలుగుతారు.

రికార్డుల నిర్వహణ: ఈ మార్పులతో బ్యాంకులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నామినీల రికార్డులు అప్‌డేట్ చేయాలి. దీనివల్ల మానవ తప్పిదాలకు తావు ఉండదు. బ్యాంకుల మీదా జవాబుదారీతనం పెరుగుతుంది.

## ఏడేళ్ల తర్వాతే ఐఈపీఎఫ్‌నకు బదిలీ చేయాలి



దిల్లీ: మార్పిడి రహిత డిబెంచర్లు (ఎన్‌సీడీ) లేదా బాండ్లకు సంబంధించి క్లెయిమ్ చేసుకోని నిధులను కాలావధి (మెచ్యూరిటీ) ముగిసిన తేదీ నుంచి ఏడేళ్ల తర్వాతే ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)కు బదిలీ చేయాలని సెబీ ప్రతిపాదించింది. ఈ మేరకు కంపెనీల చట్టం, ఐఈపీఎఫ్ నిబంధనలకు తగ్గట్లుగా లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్ (ఎల్‌ఓడీఆర్) నిబంధనల్లో సవరణలు చేయనున్నట్లు తన చర్చా పత్రంలో వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీల చట్టంలోని సెక్షన్ 125 ప్రకారం.. బాండ్ల డబ్బులను మదుపర్లు క్లెయిమ్ చేసుకోని పక్షంలో, వడ్డీతో కలిపి ఆ పూర్తి మొత్తాన్ని కాలావధి ముగిసిన తేదీ నుంచి ఏడేళ్ల తర్వాతే ఐఈపీఎఫ్‌నకు బదిలీ చేయాలి. ఐపీఈఎఫ్ నిబంధనల్లో నిబంధన 3(3) కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. అయితే ఎల్‌ఓడీఆర్ నిబంధనల్లోని 61ఏ నిబంధన ప్రకారం.. ఎస్క్రో ఖాతాలో ఏడేళ్ల పాటు క్లెయిమ్ చేసుకోని వడ్డీ ఏదైనా ఉంటే, బాండ్ల కాలావధి ముగింపుతో సంబంధం లేకుండా ఆ మొత్తాన్ని ఐఈపీఎఫ్ లేదా ఐపీఈఎఫ్‌నకు బదిలీ చేయాలి. కంపెనీల చట్టం, ఐపీఈఎఫ్ నిబంధనలకు ఇది భిన్నంగా ఉన్నందున.. ఎల్‌ఓడీఆర్ నిబంధనను కూడా వాటికి తగ్గట్లుగా సవరిస్తూ నిబంధన 61ఏ(3)తో కొత్త నిబంధనను తీసుకొని రావాలని సెబీ ప్రతిపాదించింది. దీని ప్రకారం.. బాండ్ల కాలావధి ముగిసిన రోజు నుంచి, ఏడేళ్ల తర్వాతే అన్‌క్లెయిమ్డ్ నిధులను ఐఈపీఎఫ్‌నకు బదిలీ చేయాలి. కంపెనీల చట్టం కిందకు రాని సంస్థలకూ ఇదే నిబంధన వర్తిస్తుందని సెబీ తెలిపింది. దీని వల్ల మదుపర్లకూ ప్రయోజనం ఉంటుందని.. కాలావధి ముగిశాక ఏడేళ్ల వరకు అన్‌క్లెయిమ్డ్ డబ్బుల రిఫండ్ కోసం ఐపీఈఎఫ్/ ఐఈపీఎఫ్‌ను కాకుండా బాండ్లు జారీ చేసిన సంస్థలను ఆశ్రయించే వెసులుబాటు ఉంటుందని సెబీ వివరించింది.

## నగరంలో 'దుబాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2.0'




నగరంలో ఏఎక్స్ ప్రీమియం ప్రాపర్టీస్ 'దుబాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2.0'ను నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎక్స్ ప్రాపర్టీస్ సేల్స్ డైరెక్టర్ సమీక్ష దావులూరి, డమక్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ అనిల్ మాట్లాడుతూ.. మన దేశ పెట్టుబడిదారులకు దుబాయ్‌లో పన్ను రహిత వాతావరణం, అధిక రాబడి, అనుకూలమైన విధానాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ ఎక్స్‌పో ద్వారా హైదరాబాద్ పెట్టుబడిదారులలో దుబాయ్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం యొక్క ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. దుబాయ్‌లో పెట్టుబడులు పెట్టే తెలుగు వారికి అన్నిరకాల ప్రయోజనాలు కల్పిస్తామని, ముఖ్యంగా పన్నుల రాయితీ కల్పిస్తామన్నారు.

## కంపెనీల ఆదాయం వృద్ధి: రంగాల వారీ పనితీరు ఇలా..

భారత కంపెనీల ఆదాయం, సెప్టెంబర్ త్రైమాసికంలో.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 5 - 6 శాతం పెరగొచ్చని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది. లాభదాయకత అర శాతం వరకు తగ్గొచ్చని తన తాజా నివేదికలో పేర్కొంది. నిర్వహణ మార్జిన్లు 0.60 శాతం తక్కువ నమోదు కావొచ్చని తెలిపింది. విద్యుత్, బొగ్గు, ఐటీ సేవలు, ఉక్కు రంగాల్లో మెరుగైన పనితీరు ఆదాయ వృద్ధికి అనుకూలిస్తుం దని పేర్కొంది. 600 కంపెనీల పనితీరును విశ్లేషించి అనంతరం క్రిసిల్ రేటింగ్స్ ఈ వివరాలను విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ త్రైమాసికంతో పోల్చి చూస్తే కంపెనీల ఆదాయం ఒక శాతం మేర పెరగొచ్చని అంచనా వేసింది.

### రంగాల వారీ పనితీరు అంచనా..

ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్స్, అల్యూమినియం రంగాల్లో పెరిగిపోయిన ముడిపదార్థాల వ్యయాలను కస్టమర్లకు పూర్తిగా బదిలీ చేసే విషయంలో కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో నిర్వహణ లాభాల మార్జిన్ 0.50–1 శాతం వరకు తగ్గొచ్చు. ఐటీ రంగంపై భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం కొనసాగుతోంది. ప్రాజెక్టులు వాయిదా పడుతుండడంతో ఆదాయ వృద్ధి ఒక శాతం మించకపోవచ్చు. స్టీల్ రంగంలో ఆదాయం 4 శాతం వరకు పెరగొచ్చు. ధరలు తగ్గడంతో అమ్మకాల పరిమాణం 9 శాతం అధికంగా ఉండొచ్చు. విద్యుత్ రంగంలో కంపెనీల ఆదాయం ఒక శాతం మెరుగుపడుతుంది. అధిక వర్షపాతంతో జలవిద్యుత్ తగినంత ఉత్పత్తి కావడం, పునరుత్పాదక విద్యుత్ 10 శాతం



పెరగడం ఆదాయ వృద్ధిని పరిమితం చేయొచ్చు. దీంతో బొగ్గు రంగం ఆదాయం ఫ్లాట్‌గా ఉండొచ్చు. అమ్మకాలు 31 శాతం పెరగడంతో ట్రాక్టర్ల తయారీదారుల ఆదాయం 36 శాతం అధికం కావొచ్చు. ద్విచక్ర వాహన కంపెనీల ఆదాయం 9 శాతం (అమ్మకాలు 6 శాతం పెరగడం వల్ల) పెరగొచ్చు. టెలికం కంపెనీలు 7 శాతం వరకు ఆదాయంలో వృద్ధిని చూపించొచ్చు. చందాదారుల వృద్ధి ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, అధిక టారిఫ్‌లతో కూడిన ప్లాన్లు ఇందుకు అనుకూలిస్తాయి. సిమెంట్ అమ్మకాలు 6–7 శాతం వృద్ధి చెందడంతో.. కంపెనీల ఆదాయం 8 శాతం వరకు పెరుగుతుంది. ఫార్మాస్యూటికల్ కంపెనీల మార్జిన్లు 1.5–2 శాతం వరకు, అల్యూమినియం కంపెనీల మార్జిన్లు 1–1.5 శాతం వరకు తగ్గుతాయి. సిమెంట్, స్టీల్, టెలికం కంపెనీల మార్జిన్లు మెరుగుపడతాయి.

### గ్రామీణ ప్రాంతాల్లో సానుకూలత

"జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణతో కొత్త ఉత్పత్తులు తక్కువ ధరలకే అందుబాటులోకి వస్తాయన్న అంచనాలు నెలకొన్నాయి. దీంతో ప్యాసింజర్ వాహనాలు, ఎఫ్ఎంసీజీ రంగంలో తాత్కాలిక అవరోధాలు నెలకొన్నాయి. రిటైలర్లు, పంపిణీదారులు ఎఫ్ఎంసీజీ కొనుగోళ్లను వాయిదా వేసుకున్నారు.

# ఇంగ్లండ్ సునాయాస విజయం




మహిళల వన్డే ప్రపంచకప్‌లో (అక్టోబర్ 26) ఉదయం జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ సునాయాస విజయం సాధించింది. తొలుత బౌలర్లు, స్వల్ప ఛేదనలో బ్యాటర్లు సత్తా చాటడంతో ఆడుతూ పాడుతూ గెలుపుతీరాలు చేరింది. ఇదివరకే సెమీస్‌కు అర్హత సాధించిన ఇంగ్లండ్, ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఇదివరకే సెమీస్ రేసు నుంచి నిష్క్రమించిన న్యూజిలాండ్ ఓటమితో టోర్నీ నుంచి వైదొలిగింది.

చెలరేగిన బౌలర్లు

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 38.2 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటైంది. లిండ్సే స్మిత్ 3, కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, అలైస్ క్యాప్సీ తలో 2, ఛార్లీ డీన్, సోఫీ ఎక్లెస్టోన్ చెరో వికెట్ పడగొట్టి కివీస్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జార్జియా ప్లిమ్మర్ (43) టాప్ స్కోరర్‌గా నిలువగా.. అమేలియా కెర్ (35), కెప్టెన్ సోఫీ డివైన్ (23) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. సూజీ బేట్స్ 10, బ్రూక్ హ్యాలీడే 4, మ్యాడీ గ్రీన్, ఇసబెల్లా గేజ్, జెస్ కెర్ 10, రోస్‌మేరీ మైర్ డకౌట్, లియా తహుహు 2 పరుగులకు ఔటయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్.. ఓపెనర్ యామీ జోన్స్ (86 నాటౌట్) సత్తా చాటడంతో 29.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ట్యామీ బేమౌంట్ (40), హీథర్ నైట్ (33) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్, లియా తహుహు తలో వికెట్ పడగొట్టారు. కాగా, ప్రస్తుత ప్రపంచకప్‌లో సెమీస్ బెర్తులు ఇదివరకే ఖరారయ్యాయి. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, భారత్ ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించాయి. అక్టోబర్ 29న జరిగే తొలి సెమీఫైనల్లో ఇంగ్లండ్, సౌతాఫ్రికా (గౌహతి).. 30వ తేదీ జరిగే రెండో సెమీస్‌లో భారత్, ఆస్ట్రేలియా (నవీ ముంబై) తలపడతాయి. ఈ మెగా టోర్నీ ఫైనల్ (నవీ ముంబై) నవంబర్ 2న జరుగుతుంది.

## ప్రపంచ కప్‌తో వన్డేలకు వీడ్కోలు..

## న్యూజిలాండ్ దిగ్గజానికి 'గార్డ్ ఆఫ్ ఆనర్'..!




మహిళల వన్డే ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్ ప్రయాణం ముగిసింది. ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టిన వైట్ ఫెర్న్స్ లీగ్ దశలో ఓటమితో ఇంటిదారి పట్టింది. టీమిండియా చేతిలో ఓడిన తర్వాత సెమీస్ చేరలేకపోయామనే బాధ ఆ జట్టు సభ్యుల్లో స్పష్టంగా కనిపించింది. కానీ, ఆదివారం ఇంగ్లండ్ దెబ్బకు ఆ జట్టుకు దారుణ పరాజయం ఎదురైంది. కానీ, అంతకంటే మరొక విషయం కివీస్ క్రికెటర్లను ఎంతగానో బాధిస్తోంది. అదేంటంటే.. ఇన్నాళ్లు తమను నడిపించిన.. పెద్దక్కలా వ్యవహరిస్తూ వచ్చిన కెప్టెన్ సోఫీ డెవైన్ కెరీర్ ముగించనుంది. ప్రపంచకప్ ఆరంభానికి ముందే దేశం తరఫున నేను ఆడబోయే చివరి టోర్నీ ఇదే అని ఈ ఆల్‌రౌండర్ వెల్లడించింది. నిరుడు న్యూజిలాండ్‌ను తొలిసారి టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిపిన ఆమె వన్డే వరల్డ్ కప్‌ను ముద్దాడాలనుకుంది. కానీ, అమె ఈసారి టీమ్‌తో అద్భుతం చేయలేకపోయింది. ఫలితంగా.. ఏడు మ్యాచుల్లో ఒకేఒక విజయంతో సెమీస్ అవకాశం చేజార్చుకుంది. చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి సంతృప్తిగా స్వదేశం వెళ్దామనుకుంటే.. ఇంగ్లండ్ స్పిన్నర్లు ముప్పతిప్పలు పెట్టి.. ఘోర పరాభవాన్ని అందించారు. వైజాగ్‌లో ఓటమితో అంతర్జాతీయంగా వన్డేల్లో డెవైన్ ప్రస్థానం ముగిసిపోయింది. ఇక కివీస్ లెజెండ్ తానే స్వయంగా నేను వీడ్కోలు పలికాను అని మరో ప్రకటన చేయడమే తరువాయి. అందుకే.. మ్యాచ్ ముగియగానే ఇంగ్లండ్ క్రికెటర్లు 'గార్డ్ ఆఫ్ ఆనర్' (%+ఖబతీఁ వాట ఎశీఅశీబతీ%)తో డెవైనెకు వీడ్కోలు పలికారు. ఇరుజట్ల క్రికెటర్లు. ఇరువైపులా నిలబడి.. చప్పట్లు కొట్టారు. ఆలింగనం చేసుకొని.. సుదీర్ఘ కెరీర్ గొప్పగా సాగినందుకు అభినందనలు తెలిపారు.

### పేస్ ఆల్‌రౌండర్‌గా..

క్రికెట్‌కు ఏమంత ఆదరణ లేని న్యూజిలాండ్‌లో యువతరానికి స్ఫూర్తిగా నిలిచింది సోఫీ డెవైన్. 2006 అక్టోబర్ 22న తొలి వన్డే ఆడిన ఆమె.. అనతికాలంలోనే జట్టులో కీలకమైంది. పేస్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ.. ఓపెనర్‌గా శుభారంభాలు ఇస్తూ ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమైంది డెవైన్. 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్లో 159 వన్డేలు ఆడిన తను.. 9 శతకాలు, 18 హాఫ్ సెంచరీలతో కలిపి 4,279 పరుగుల చేసింది. బంతితోనూ సత్తా చాటి 111 వికెట్లు పడగొట్టింది. అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన.. 3/24.

## క్రీడా వాయిస్

## అప్పుడు రియాగ్.. ఇప్పుడు ఉమా ఛెత్రీ..

## భారత జట్టులో అస్సాం యువకెరటాలు!




భారత క్రికెట్ జట్టులో ఢిల్లీ, ముంబై, పంజాబ్.. రాష్ట్రాల ఆటగాళ్లదే హవా. మహిళల జట్టులో మాత్రం పలు రాష్ట్రాల క్రికెటర్లు ప్రాతినధ్యం వహించేవారు. క్రికెట్‌కు ఆదరణ పెరగడంతో ఈశాన్య రాష్ట్రాల నుంచి కొత్త తారలు దూసుకొస్తున్నారు. నిరుడు రియాన్ పరాగ్ టీమిండియాకు ఆడగా.. ఇప్పుడు ఉమా ఛెత్రీ వన్డేల్లో అరంగేట్రం చేసింది. ఫుట్‌బాల్, బాక్సింగ్ వంటి ఆటలకు పాపులర్ అయిన ఈశాన్య రాష్ట్రం అస్సాం నుంచి టీమిండియా జెర్సీ వేసుకున్న రెండో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది ఉమ. పదమూడో సీజన్ వన్డే ప్రపంచకప్‌లో వికెట్ కీపర్ రీచా ఘోష్ గాయపడడంతో ఛెత్రీకి అవకాశం దక్కింది. ఆదివారం బంగ్లాదేశ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌కు ముందు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నుంచి డెబ్యూట్ క్యాంప్ అందుకుందీ యంగ్‌స్టర్. తద్వారా మహిళల వన్డేల్లో ఎంట్రీ ఇచ్చిన 157వ ప్లేయర్‌గా ఛెత్రీ నిలిచింది. ఆమె కంటే ముందు అస్సాం నుంచి రితూ ధ్రుబ్ 2013–14లో వన్డే, టీ20ల్లో తొలి మ్యాచ్ ఆడింది. ఐపీఎల్‌లో చెలరేగి ఆడుతున్న రియాన్ పరాగ్ పురుషుల జట్టు తరఫున 2024లోనే అరంగేట్రం చేశాడు. శ్రీలంకపై తొలి వన్డే ఆడాడీ అస్సామీ క్రికెటర్.

### చిన్నప్పటి నుంచి..

గోలాఘట్ జిల్లాలోని కండులిమరి ఉమ సొంతూరు. చిన్నప్పటి నుంచి క్రికెటర్ అవ్వాలనే లక్ష్యం పెట్టుకున్న ఆమె భారత 'ఏ' జట్టుకు ఆడింది. దేశవాళీ క్రికెట్‌లో బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్‌లోనూ అదరగొట్టింది. అంతటితోనే ఆగకుండా సీనియర్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించాలని కలలు కనేది. అనుకున్నట్టే వన్డేల్లో ఎంట్రీ ఇచ్చేసింది అస్సామీ. అది కూడా వన్డే ప్రపంచ కప్‌లో అరంగేట్రం అంటే మామూలు విషయం కాదు. అంతేకాదు మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఫ్రాంచైజీల దృష్టిలో పడిందీ యువకెరటం. డబ్ల్యూపీఎల్‌లో యూపీ వారియర్స్ తరఫున మెరిసింది.

### దక్షిణాఫ్రికాపై టీ20ల్లో

వికెట్ కీపర్ అయిన ఉమా ఛెత్రీ ఇదివరకే దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో అరంగేట్రం చేసింది. రెగ్యులర్ వికెట్ కీపర్ యస్తికా భాటియా గాయపడడంతో సెలెక్టర్లు ఉమకు అవకాశమిచ్చారు. ఈశాన్య రాష్ట్రమైన అస్సాం క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలికిన ఆమెకు సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ఎక్స్ వేదికగా ఉమకు కంగ్రాట్స్ చెప్పారు. అయితే.. ఉమ తుది జట్టులో చోటు దక్కించుకున్న మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.



# ఎంత అలసిపోయినా అది చేస్తే మాత్రం.. ఎనర్జీ వచ్చేస్తుంది

ఇటీవల కాలంలో దక్షిణాదిన అతి తక్కువ సమయంలో 'స్టార్‌డమ్' సంపాదించిన హీరోయిన్లలో శ్రీలీల టాప్‌లో ఉంది. తెలుగులో బిజీగా ఉంటూనే, మరోవైపు బాలీవుడ్‌లోనూ ఎంటరవుతోందీ డ్యాన్సింగ్ క్వీన్. మాస్ మహారాజ్ రవితేజ సరసన 'మాస్ జాతర 'తో అలరించేందుకు సిద్ధమైన ఈ వైరల్ వయ్యారి పంచుకున్న కొన్ని ముచ్చట్లివి..

సెట్లో నిశ్శబ్దంగా ఉండటం నాకు నచ్చదు. సెట్ అంతా కలియతిరుగుతూ, అందర్నీ పలకరిస్తూ సందడిగా ఉంటా. కో–స్టార్స్ మీద సరదాగా ప్రాంక్స్ చేస్తా. సెట్ నుంచి బయటకి రాగానే ఆ రోల్ నుంచి స్విచాఫ్ అయిపోతా. అందుకే ఒకేసారి రెండు మూడు సినిమాలు చేస్తున్నా. షూటింగ్‌తో ఎంత అలసిపోయినా... పుస్తకం తెరిస్తే మాత్రం ఆసక్తిగా చదువుతా. బుక్ రీడింగ్ చాలా ఇష్టం. కొత్త భాష నేర్చుకోవడం అంటే భలే ఆసక్తి. ఆరు భాషల్లో గలగలా మాట్లాడతా. ఇంట్లో అందరం తెలుగులోనే మాట్లాడతాం. బెంగళూరులో పెరిగాను కాబట్టి కన్నడ వచ్చు. భాష మీద ఇష్టంతో తమిళం నేర్చుకున్నా. మెడిసిన్ ముంబాయిలో చేయడం వల్ల హిందీ వచ్చేసింది. ఇక స్కూల్‌లో సెకండ్ లాంగ్వేజ్ ఫ్రెంచ్ కాబట్టి అది కూడా వచ్చు. ఇంగ్లీషు ఎలాగూ మాట్లాడేస్తా. చిన్నప్పటి నుంచీ మేకప్ వేసుకోవడమంటే సరదా. అమ్మ హ్యాండ్‌బ్యాగ్ నుంచి లిప్‌స్టిక్ దొంగిలించి మరీ వేసుకునేదాన్ని. ఓసారి దొరికిపోయి అమ్మతో అట్లకాడ దెబ్బలు కూడా తిన్నా. అమ్మ చేసిన అన్నం, ముద్దపప్పు అంటే ఇష్టం. వాటికి నెయ్యి, ఆవకాయ జోడించి.. లొట్టలేసుకుంటూ లాగించేస్తా. పనీర్ మండీ అంటే చాలు... ఎనర్జీ వచ్చేస్తుంది. నిద్ర లేవగానే స్ట్రెచెస్ చేసి.. ఫోన్ చెక్ చేసుకుంటా. తర్వాత బ్లాక్ కాఫీ తాగి, కాసేపు వ్యాయామం చేస్తా. ఆపై కాసేపు ప్రశాంతంగా నచ్చిన సంగీతం వింటా. మ్యూజిక్ వింటే నాకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చేస్తుంది. రోజంతా హైపర్‌గా ఉంటా. నేను మాట్లాడడం మొదలుపెడితే పాజ్ బటన్ ఉండదు. వస పిట్టలా వాగుతా. అందుకే 'నువ్వు గోడలతో కూడా మాట్లాడగలవు లీలా' అంటారు ఫ్రెండ్స్. నాకు కాబోయేవాడికి ముచ్చటగా మూడు లక్షణాలుండాలి. మొదటిది... కొన్ని విషయాల్లో నన్ను భరించడం కష్టం. అయితే ఆ కష్టాన్ని కూడా ఇష్టంగా భరించాలి. రెండోది... చక్కని హాస్య చతురతతో నవ్వించే వాడై ఉండాలి. మూడోది.. ఫ్యామిలీమ్యాన్ వుండాలి. ఈ మూడు గుణాలుంటే కళ్లు మూసుకుని ఓకే చేస్తా. కాకపోతే పెళ్లి చేసుకునేందుకు బోలెడు సమయం ఉంది. ఇప్పటికీ అన్ని విషయాల్లోనూ అమ్మ మీదే ఆధారపడతా. అమ్మ లేకుండా ఒంటరిగా నిద్రపోలేను. నాకు భయం. అందుకే ఔట్‌డోర్ షూటింగ్‌లకు అమ్మను వెంట తీసుకెళ్తా. కోపం వస్తే అమ్మ మీద అరిచేస్తా. కోపం చల్లారాక అమ్మను తిట్టినందుకు ఏడుస్తా.



# అప్పుడు నీడ పోయింది.. ఇప్పుడు గేదె దెయ్యం

తెలుగులో ఇప్పటివరకు చాలా హారర్ సినిమాలు వచ్చాయి. దాదాపుగా ప్రతిదానిలోనూ పెద్దవాళ్లు లేదంటే ఓ వయసు ఉండే పిల్లలు చనిపోయి దెయ్యాలుగా మారడం చూస్తుంటాం. కానీ 9 నెలల పిల్లాడు దెయ్యమై పగ తీర్చుకుంటే ఎలా ఉంటుంది? అనే కాన్సెప్ట్‌తో టాలీవుడ్‌లో ఓ మూవీ తీస్తున్నారు. అదే 'నెపోలియన్ రిటర్న్స్'. గతంలో నీడ పోయింది సర్ అనే స్టోరీతో మూవీ తీసిన ఆనంద్ రవి అనే దర్శకుడు.. ఇప్పుడు ఈ మూవీతో వస్తున్నాడు. దర్శకత్వం వహించడంతో పాటు హీరోగానూ ఆనంద్ రవి నటిస్తున్నాడు. ఆటో రాంప్రసాద్, దివి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతానికైతే గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఇందులో గేదె దెయ్యం వచ్చింది, నన్ను పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేయమంది అనే డైలాగ్స్ చెప్పారు. కానీ ఆదివారం జరిగిన ఈవెంట్‌లో దర్శకహీరో ఆనంద్ రవి మాట్లాడుతూ.. మెయిన్ ప్లాట్ ఏంటో చెప్పాడు. 9 నెలల వయసు అంటే సరిగా నిలబడం, నడవడమే రాదు. అలాంటిది పిల్లాడు దెయ్యంగా మారి పగ తీర్చుకోవడం అనే పాయింట్ బాగానే ఉంది. కానీ దాన్ని ప్రెజెంట్ చేస్తారో చూడాలి?



# రష్మిక ముఖానికి సర్జరీ.. అసలేమైంది

ఇండస్ట్రీ .. ఒక గ్లామర్ ప్రపంచం. ఇక్కడ అందం అనేది చాలా ముఖ్యం. హీరోయిన్లకు అయితే అదే కెరీర్ అని చెప్పొచ్చు, అందుకే హీరోయిన్లు పొట్ట మాడ్చుకొని ఫిట్ గా ఉండడానికి జిమ్ చేస్తారు. ఇక అందాన్ని పెంచుకోవడానికి సర్జరీలు అని, ఫేస్ ట్రీట్ మెంట్స్ అంటూ చేయిస్తునే ఉంటారు. అయితే ఈ మధ్య ప్రతి ఒక్కరు కూడా ఫేస్ ట్రీట్ మెంట్ చేయించుకుంటున్నారు. లిప్ ఫిల్లర్లు వేయిస్తున్నారు. కొంతమందికి అవి సెట్ అవుతున్నా ఇంకొంతమందికి అస్సలు సెట్ అవ్వడం లేదు. ఇక ఇప్పుడు ఈ ఫేస్ ట్రీట్ మెంట్లు, సర్జరీల సంగతి ఎందుకు అంటే నేషనల్ క్రష్ రష్మిక మందన్నా సైతం ఆమె ముఖానికి ట్రీట్ మెంట్ చేయించింది. ఈ విషయాన్నీ రష్మికనే స్వయంగా చెప్పుకొచ్చింది. తాజాగా ఆమె ఎయిర్ పోర్ట్ లో ముఖానికి మాస్క్ తో కనిపించింది. సాధారణంగా సెలబ్రిటీలు అందరూ ముఖానికి మాస్క్ తోనే కనిపిస్తారు. కానీ, మీడియాకు ఫోటోలు ఇవ్వడానికి కచ్చితంగా మాస్క్ తీస్తారు. నిన్న రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కోసం హైదరాబాద్ కు వస్తూ ఎయిర్ పోర్టులో దర్శనమిచ్చింది. బ్లాక్ అండ్ బ్లాక్ అవుట్ ఫిట్ లో బ్లాక్ మాస్క్ తో కనిపించింది. అక్కడ ఉన్న కెమెరా మ్యాన్స్.. రష్మికను మాస్క్ తీయమని కోరగా.. ఫేస్ ట్రీట్ మెంట్ అయ్యింది గయ్స్.. తీయలేను అని చెప్పింది. దీంతో రష్మిక ముఖం అందంగానే ఉంటుంది కదా.. పేస్ ట్రీట్మెంట్ ఎందుకు.. ? అని ఆరాలు తీయడం మొదలుపెట్టారు. ఇక ముందు ముఖానికి ఇప్పటి రష్మిక ముఖానికి కొద్దిగా తేడా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆమె లిప్స్ దగ్గర సర్జరీ చేయించుకుందని నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు. ఆమె పై పెదవి ఉబ్బినట్లు కనిపిస్తుంది. ఇక పెళ్ళిలో కొత్తగా కనిపించడానికి అమ్మడు రెడీ అవుతుండొచ్చు అని మరికొందరుచెప్పుకొస్తున్నారు . ఏదిఏమైనా ఇలాంటివి మంచిది కాదు.. రష్మిక నేచరల్ గానే బావుంటుంది అని అభిమానులు చెప్పుకొస్తున్నారు.

# 2026లో చిరు ఫ్యాన్స్‌కి సూపర్బ్ ట్రీట్.. ఇక సందడే సందడి



మెగాస్టార్ చిరంజీవి పదేళ్ల గ్యాప్ తర్వాత రీ ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు. ఆయన రీ ఎంట్రీ చిత్రం ఖైదీ నంబర్ 150 సూపర్ హిట్ కావడంతో సినీ పరిశ్రమలో చిరు మళ్లీ తన ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన ఆచార్య చిత్రానికి మంచి స్పందన రాకపోవడం, గాడ్ ఫాదర్ సినిమా అంచనాలు అందుకోకపోవడం ఫ్యాన్స్‌ని నిరాశపరిచింది.ఆ తరువాత వచ్చిన వాల్తేరు వీరయ్య సినిమా హిట్ అయినప్పటికీ, భోళా శంకర్ నిరాశపరిచింది. ఈ సినిమా తర్వాత దాదాపు ఏడాది పాటు చిరంజీవిని వెండి తెరపై చూడడం సాధ్యం కాలేదు. కొన్నాళు ్లగా విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నారు చిరు. ఈ సినిమా 2026 సమ్మర్‌కు రానుంది.. గ్రాఫిక్స్, కొన్ని రీ–షూట్‌లు కారణంగా రిలీజ్ ఆలస్యం అయింది. ఏదేమైన సమ్మర్‌లో రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విశ్వంభర షూటింగ్ పూర్తి కాగా, చిన్న ప్యాచ్ వర్క్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా మల్లిడి వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతోంది.మరోవైపు అనీల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వర ప్రసాద్ చిత్రం చేస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. చిరు –బాబి కాంబినేషన్లో కొత్త చిత్రం 2026 దసరా లేదా దీపావళికి రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com